
అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
గురువారం 23-11-2023
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 | సంచిక : 322 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 10 పేజీలు + టాబ్లాయిడ్ 12 పేజీలు | వెల : 6.50

కృష్ణా ట్రిబ్యునల్ విచారణ వాయిదా



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కృష్ణా జలాల పంపిణీకి సంబంధించి కేంద్ర నోటిపై చేసిన విధివిధానాలపై అభ్యంతరం తెలుపుతూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ట్రిబ్యునల్ వాయిదా వేసింది. ఏపీ ప్రభుత్వ పిటిషన్‌ను బుధ, గురువారాల్లో జస్టిస్ బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ విచారణ చేయాల్సి ఉంది. బుధవారం విచారణ సందర్భంగా స్టేట్‌మెంట్ ఆఫ్ కేసు వివరాలు అందజేయాలని ఏపీ, తెలంగాణలను ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణ జనవరి 22కు వాయిదా వేసింది. మరోవైపు కేంద్రం నోటిఫికేషన్‌పై అభ్యంతరాలు చెబుతూ ఏపీ ప్రభుత్వం సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పిటిషన్ ఈ నెల 29న విచారణకు రానుంది.

తెలంగాణ,ఏపీల రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీ చేస్తూ ఈ ఏడాది అక్టోబర్ 6న కేంద్రం జారీ చేసిన విధివిధానాలకు అనుగుణంగా విచారణ జరపనుంది. కేంద్రం జారీ చేసిన గెజిట్‌పై సుప్రీంకోర్టును ఏపీ ప్రభుత్వం ఆశ్రయించింది. కేంద్ర గెజిట్‌పై సర్వోన్నత న్యాయస్థానం స్టే ఇవ్వకపోవడంతో ట్రిబ్యునల్ విచారణ కొనసాగిస్తోంది.

ఐరన్ మైనింగ్‌ను అడ్డుకున్నారనీ..

- 21 మంది ఆందోళనకారుల అరెస్టు
- మహారాష్ట్రలోని గడ్చిరోలిలో ఘటన

ముంబయి : మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో మైనింగ్ కార్యకలాపాలకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న 21 మందిని పోలీసులు అరెస్టు చేశారు. అయితే, అదుపులోకి తీసుకున్న తర్వాత పోలీసులు వారిని కొట్టారనీ, దీంతో చాలా మందికి తీవ్ర గాయాలయ్యాయని దామ్‌కోండ్‌వహీ బచావో సంఘర్ష్ సమితి అనే ఆదివాసీ సంస్థ ఆరోపించింది. జిల్లాలోని ఎటపల్లి తహసీల్‌లోని తొడగట్ట, చుట్టుపక్కల 70 గ్రామాల వాసులు సుర్జాగర్ కొండల వద్ద వేలం వేసిన ఆరు ఐరన్ గనులకు వ్యతిరేకంగా మార్చి 11 నుంచి నిరసనలు చేస్తున్నారు. మేలో ఐదు కంపెనీలు 4,684 హెక్టార్ల విస్తీర్ణంలో గనుల లీజులను పొందాయి. ఆదివాసీ గ్రామస్తులు కొండల్లో మైనింగ్ కార్యకలాపాలను చాలాకాలంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ భూములు తమకు పవిత్రమైనవనీ, గనులు పర్యావరణ వ్యవస్థను, వారి వ్యవసాయ జీవనోపాధిని నాశనం చేస్తాయని చెప్పారు. అరెస్టయిన 21 మందిపై ఐపీసీలోని సెక్షన్ 353 కింద కేసు నమోదు చేసినట్టు దామ్‌కోండ్‌వహీ బచావో సంఘర్ష్ సమితి తెలిపింది.



69 చోట్ల కాంగ్రెస్‌కు, 41 స్థానాల్లో
బీఆర్ఎస్‌కు మద్దతు
సిర్పూర్‌లో ఆర్ఎస్పీకి, కొత్తగూడెంలో కూనంనేనికి కూడా

- జమాతె ఈ ఇస్లామి హింద్ ఉపాధ్యక్షులు షోయబ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి 69 చోట్ల కాంగ్రెస్‌కు, 41 స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతు ఇస్తున్నట్టు జమాతె ఈ ఇస్లామి హింద్ ఉపాధ్యక్షులు ఏఎం షోయబ్ చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంఐఎం తొమ్మిది చోట్ల పోటీ చేస్తున్నా ఏడు స్థానాల్లో మద్దతు ఇస్తున్నామని వివరించారు. రాజేంద్రనగర్‌లో బీఆర్ఎస్‌కు, జూబ్లీహిల్స్‌లో అజారుద్దీన్‌కు మద్దతిస్తున్నామని చెప్పారు. సిర్పూర్‌లో బీఎస్పీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు, కొత్తగూడెంలో సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావును బలపరుస్తున్నామని వివరించారు. తాము ఏ రాజకీయ పార్టీకి మద్దతు ఇవ్వడం లేదని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో సర్వే ఆధారంగా స్థానిక కమిటీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని నియోజకవర్గాల వారీగా సరైన అభ్యర్థులకు మద్దతు ప్రకటిస్తున్నామని వివరించారు. అలయెన్స్ ఫర్ డెమోక్రసీ ఫోరం కన్వీనర్ జిలుకర శ్రీనివాస్ మాట్లాడుతూ కంటోన్మెంట్‌లో గద్దర్ కూతురు వెన్నెలకు మద్దతు ఇస్తున్నామని చెప్పారు. రాజకీయ పార్టీ ఆధారంగా కాకుండా అభ్యర్థి ఆధారంగా సర్వే చేసి నియోజకవర్గాల వారీగా మద్దతు ప్రకటిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జమాతె ఈ ఇస్లామి హింద్ ప్రధాన కార్యదర్శి ముస్తాక్, కార్యదర్శి ఉస్మాన్, నాయకులు ఆనంద్, అలయెన్స్ ఫర్ డెమోక్రసీ ఫోరం నాయకులు దానబోయిన రవి తదితరులు పాల్గొన్నారు.

అనుదినం... జనస్వరం
www.navatelangana.com
గురువారం 23-11-2023
సంపుటి : 9 సంచిక : 322

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar

10 పేజీలు + టాబ్లాయిడ్ 12 పేజీలు వెల : 6.50

కేరళ ఇండ్ల స్కీంపై కేంద్రం లొల్లి..

● గ్రాంట్‌ల నిలుపుదల ● కేరళ సర్కారు తీవ్ర అసంతృప్తి



తిరువనంతపురం : ఇండ్ల పథకం, ప్రభుత్వ గ్రాంట్‌ల విషయంలో కేంద్రం తీరుపై కేరళ సర్కారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హౌసింగ్ స్కీమ్‌లో క్రెడిట్ కోసం పాకులాడుతున్నదనీ, స్థానిక స్వపరిపాలన గ్రాంట్‌ల విడుదలను నిలిపివేసిందని ఆరోపించింది. కేరళలోని ఎల్డీఎఫ్ ...6లో



గెలిస్తే కదా.. సీఎం అయ్యేది

కొడంగల్ సభలో రేవంత్‌పై కేసీఆర్ నిప్పులు



● అలా అనుకుని ఓట్లేస్తే మళ్లీ మొదటికే..
● రెండుచోట్లా ఓడిపోతాడు
● బీఆర్ఎస్‌దే విజయం
● నేనెప్పుడూ పదవుల గురించి ఆశపడలేదు
● ధరణిని తీసేస్తే రైతులు ఆగమే..
● కాంగ్రెస్ అంటేనే దళారుల రాజ్యం : ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్

నవ తెలంగాణ- మహబూబ్ నగర్ / తాండూరు/కొడంగల్/పరిగి

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి ఖాయమని, ముఖ్యంగా రేవంత్‌రెడ్డి రెండు నియోజకవర్గాల్లోనూ చిత్తుగా ఓడిపోతారని సీఎం కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. అత్యధిక మెజార్టీతో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, అందులో ఎలాంటి అనుమానం లేదని స్పష్టంచేశారు. కేసీఆర్ బతికున్నంత కాలం తెలంగాణలో మతతత్వవాదులకు తావు లేదని సెక్యులర్ విధానాన్ని కాపాడుతామని సీఎం కేసీఆర్ స్పష్టంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ధరణి తొలగిస్తే తెలంగాణలో భూమాత కాదు భూమేత వస్తుందని అన్నారు. బుధవారం కొడంగల్, తాండూరు, పరిగి, మహబూబ్‌నగర్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ పాల్గొన్నారు. తాను ఇప్పటికీ వ్యవసాయం చేస్తున్నా కాబట్టే రైతుల కష్టాలు, బాధలు తనకు తెలుసన్నారు. రేవంత్‌రెడ్డి ఏనాడైనా వ్యవసాయం చేశారా.. ...9లో

అమృత్‌కాల్‌లో... అమృత్ లేదు

● ప్రజాధనాన్ని దోచిపెడుతున్నారు : రాజస్థాన్ ఎన్నికల ప్రచారంలో ఏచూరి

మోడీ పాలనలో అందరి పరిస్థితీ అధ్వాన్నం

● సీపీఐ(ఎం) అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ బృందాకరత్, సుభాషిణి, ఏచూరి విస్తృత ప్రచారం

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా సీపీఐ(ఎం) ప్రచారం సాగుతున్నది. వివిధ నియోజకవర్గాల్లో సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్, సుభాషిణి అలీ, కేంద్ర కమిటీ సభ్యులు విజూ కృష్ణన్ విస్తృత ప్రచారం నిర్వహించారు. దాతరామ్‌ఘడ్ అసెంబ్లీ అభ్యర్థి అమ్రారామ్‌కు మద్దతుగా డాటాలో నిర్వహించిన భారీ విజయ సంకల్ప సభలో సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రసంగించారు. మోడీ ప్రభుత్వం అమృత్‌కాల్ గురించి మాట్లాడుతోందని, ...9లో



రైసింగ్‌నగర్ నియోజకవర్గంలోని ముక్లావలో సీపీఐ(ఎం) అభ్యర్థి సయోపాత్రంకు మద్దతుగా జరిగిన సభలో సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందా కరత్ మాట్లాడారు. అలాగే హనుమాన్‌ఘర్ నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి కామ్రేడ్ మంగేజ్ చౌదరికి మద్దతుగా నోహర్‌లో ప్రజా విప్లవ ర్యాలీ జరిగింది. బృందా కరత్ కరత్ మాట్లాడుతూ, సామాన్యుల బలాన్ని మరింత బలోపేతం చేయడానికి, ప్రజల కోసం పోరాడటానికి మంగేజ్‌ను అసెంబ్లీకి పంపాలని కోరారు. లద్నూన్ అసెంబ్లీ నియోజకవర్గంలోని తెలి రోడ్డులో జరిగిన సభలో సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యురాలు సుభాషిణి అలీ, ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి, సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు విజూ కృష్ణన్ మాట్లాడారు.

బక్కోడు కాదు.. బకాసురుడు

ప్రాజెక్టుల పేర్లు చెప్పి ఓట్లడిగే దమ్ముందా..?

● బీఆర్ఎస్ ఓటమి ఖాయం
● గజ్వేల్‌లో నర్సారెడ్డి, కామారెడ్డిలో నేను ఓడిస్తాం
● కాంగ్రెస్ 80కిపైగా సీట్లతో అధికారంలోకొస్తుంది : ఎన్నికల ప్రచారాల్లో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ- గజ్వేల్/ నారాయణఖేడ్‌రూరల్/ధర్పల్లి

'రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మతి తప్పి మాట్లాడుతుండో.. మందేసి మాట్లాడుతుండో తెలియదు. 60 ఏండ్లల్లో కాంగ్రెస్ ఏం చేసిందని అంటున్నావ్. నాగార్జున సాగర్, శ్రీరామ్‌సాగర్ లాంటి అనేక ప్రాజెక్టులు కట్టి రైతాంగానికి సాగునీరిచ్చింది. మేం కట్టిన ప్రాజెక్టుల పేర్లు చెప్పి ప్రజలను ఓట్లు అడుగుతాం. నీవు కట్టిన కాళేశ్వరం, మేడిగడ్డ ప్రాజెక్టుల పేర్లు చెప్పి ప్రజలను ఓట్లు అడిగే దమ్ముందా.' అంటూ టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షులు రేవంత్‌రెడ్డి సీఎం కేసీఆర్‌కు సవాల్ విసిరారు. మరో వారంలో జరిగే ఎన్నికల్లో 80కి పైగా సీట్లు సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నామని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నిజామాబాద్ జిల్లా నిజామాబాద్ రూరల్, సిద్దిపేట జిల్లా గజ్వేల్, సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గాల్లో నిర్వహించిన కాంగ్రెస్ బహిరంగసభల్లో రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు.

నిజామాబాద్ జిల్లా ధర్పల్లిలో జరిగిన సభలో రేవంత్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యం అంటే గరీబోళ్ల రాజ్యం, పేదల రాజ్యమని తెలిపారు. బీఆర్ఎస్ రాజ్యం అంటే దొరల రాజ్యం, దొంగల రాజ్యం, భూములు కొల్లగొట్టే రాజ్యం, అక్రమ ఇసుక రాజ్యమన్నారు. బిడ్డ కవితను నిజామాబాద్ ప్రజలు బండకేసి కొడితే వెంటనే ఎమ్మెల్సీ పదవి ఇచ్చి తన కుటుంబాన్ని బాగుచేసుకున్నారని, మరి ప్రజల బతుకులు మారాయా అని ప్రశ్నించారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా వరి, పసుపు, ఎర్రజొన్న పంటలు పండిస్తారని, వారి తరపున మాట్లాడకుండా ఇక్కడి రైతాంగానికి స్థానిక ఎమ్మెల్యే నష్టం చేశారని విమర్శించారు. పసుపు బోర్డు తెస్తానన్న ఎంపీ కనబడకుండా పోయాడని అన్నారు. రాష్ట్రంలోని పేదలకు ...9లో

మోడీ, కేసీఆర్ ఇద్దరూ ఒక్కటే

బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం కలిసి కాంగ్రెస్‌పై కుట్ర

● దేశంలో ఆహార కొరత తీరింది ఇందిరమ్మ రాజ్యంలోనే : నల్లగొండలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే



నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

ప్రధానమంత్రి నరేంద్రమోడీ, సీఎం కేసీఆర్ ఇద్దరూ ఒకటేనని, వారిద్దరికీ పేదల కష్టాలు పట్టవని ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జునఖర్గే విమర్శించారు. రాష్ట్రంలో ఈసారి జరిగేవి అతి ముఖ్యమైన ఎన్నికలని, ఇందిరమ్మ రాజ్యం వస్తేనే తెలంగాణ మరింత ముందుకు వెళుతుందని తెలిపారు. డీసీసీ అధ్యక్షులు శంకర్‌నాయక్ అధ్యక్షతన బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. నల్లగొండ జిల్లాకు గొప్ప చరిత్ర ఉందని, దాన్ని ఈ ఎన్నికల్లో నిరూపించుకోవాలని పిలుపునిచ్చారు. నాగార్జునసాగర్ వంటి గొప్ప ప్రాజెక్ట్ కట్టిన ఘనత ఇందిరా గాంధీకి దక్కుతుందన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు లేకుంటే తెలంగాణ ఎలా ఉండేదని ప్రశ్నించారు. ఇందిరాగాంధీ పేదరిక నిర్మూలన కోసం 20 సూత్రాల కార్యక్రమాన్ని తీసుకువచ్చారని గుర్తుచేస్తూ ఆమెను దూషిస్తూ మాట్లాడటాన్ని ఖండించారు. బీఆర్ఎస్ పాలనలో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, రైతులకు రుణమాఫీ రావడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను ...9లో

ఇక కాంట్రాక్టర్ల వంతు

అమల్లోకి 'ఒకే దేశం-ఒకే లైసెన్స్' విద్యుత్ వ్యవస్థల 'కార్పొరేటీకరణ'కు గ్రీన్‌సిగ్నల్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దేశంలోని యావత్ విద్యుత్‌రంగాన్ని ప్రయివేటురంగంలో కార్పొరేట్లకు అప్పగించేలా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రాలకు ఉన్న హక్కుల్ని కాలరాస్తూ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వీటిని సాధ్యమైనంత త్వరగా ఆయా రాష్ట్రాల్లో అమల్లోకి తేవాలని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఆర్సీ) ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శులకు లేఖలు రాసింది. ఇప్పటి వరకు విద్యుత్ పనులు చేపట్టేందుకు ఆయా రాష్ట్రాల పరిధిలోనే కాంట్రాక్టర్లకు లైసెన్సులు మంజూరు చేసేవారు. దీనితో వారు టెండర్ల ద్వారా పనులు దక్కించుకొని చేపట్టేవారు. ఇప్పుడు ఈ విధానానికి కేంద్ర ప్రభుత్వం గండికొట్టింది. 'ఒకే దేశం-ఒకే లైసెన్స్' పేరుతో దేశవ్యాప్తంగా



చెల్లుబాటయ్యేలా లైసెన్సింగ్ విధానాల్లో మార్పులు తెచ్చింది. దీనివల్ల ఎక్కడో గుజరాత్‌లో లైసెన్స్ తీసుకున్న కాంట్రాక్టర్ తెలంగాణలో కరెంటు పనులు చేపట్టవచ్చు. దానికి తోడు పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థల పోటీని చిన్న కాంట్రాక్టర్లు తట్టుకునే పరిస్థితిని కోల్పోతారు. ఆయా కార్పొరేట్ సంస్థల కింద సబ్‌కాంట్రాక్టర్లుగా లేదా వర్కర్లుగా మిగిలిపోవాల్సి వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా లైసెన్సింగ్ విధానంలో తమ హక్కును కోల్పోతాయి. ఇప్పటికే దేశంలోని అనేక విద్యుత్ పంపిణీ, ఉత్పత్తి, సరఫరా వ్యవస్థల్ని కార్పొరేట్లకు అప్పగిస్తున్న కేంద్రప్రభుత్వం తాజాగా తీసుకున్న ఈ నిర్ణయంతో ఆయా రాష్ట్ర ప్రభుత్వాల్లోని విద్యుత్ సంస్థలు మరింత కుదేలయ్యే ప్రమాదం ఉన్నదని విద్యుత్‌రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటి వరకు విద్యుత్ సంస్థల ఉద్యోగులు, కార్మికులు మాత్రమే ఆందోళనలబాట పట్టారు. ఈ నిర్ణయంతో విద్యుత్ కాంట్రాక్టర్లు ...9లో

బీఆర్ఎస్ పాలనలో శ్రమ చులకన

● కార్మిక హక్కులను కాలరాస్తున్న కేసీఆర్
● వామపక్షాల అభ్యర్థులకే ఓటేయ్యండి : సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు



వివరాలు 9లో

బందోబస్తు పెంచండి

సమస్యాత్మక ప్రాంతాలపై డీజీపీ సమీక్ష



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల పరంగా అత్యంత సమస్యాత్మక ప్రాంతాలపై రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ పోలీసు ఉన్నతాధికారులతో బుధవారం సమీక్ష జరిపారు. రాష్ట్రంలో గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంలో పోలీసులు గుర్తించిన శాంతి భద్రతల పరంగా సమస్యాత్మక ప్రాంతాలు ఎన్ని? ప్రచార సమయంలో జరిగిన హింసాత్మక ఘటనలు ఎన్ని? చివరికి పోలింగ్ సమయంలో చోటు చేసుకున్న ఘర్షణలు ఎన్ని? చివరికి ఫలితాలు వెల్లడించిన రోజు జరిగిన ఘర్షణలు ఎన్ని? వాటికి కారణాలు ఏమిటి? అనే కోణంలో డీజీపీ అధికారులతో ...9లో

ఈసారి అంత ఈజీ కాదు..

పలు నియోజకవర్గాల్లో హస్తం ఢీ అంటే ఢీ

● దక్షిణ తెలంగాణ అంతటా కాంగ్రెస్ గాలి ● బీఆర్ఎస్ అగ్రనేతలతో భేటీలో పీకే
● అప్రమత్తమైన గులాబీ దళం ● ఈ వారం రోజులూ పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెట్టాలని బీఆర్ఎస్ బాస్ ఆదేశం ● అదే పనిలో ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మెన్లు





నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు మరో వారం రోజులే గడువున్న నేపథ్యంలో అధికార బీఆర్ఎస్ అగ్రనేతలు, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ (పీకే)తో ప్రత్యేకంగా భేటీ కావటం చర్చనీయాంశంగా మారింది. అత్యంత విశ్వసనీయ సమాచారం ప్రకారం... పార్టీ పరంగా చేయించిన సర్వేలు, ఇంటిలిజెన్స్ వర్గాలు అందించిన నివేదికల ఆధారంగా గులాబీ పార్టీకి 'ప్రమాద ఘంటికలు' మోగుతున్నాయనే ఆందోళనల నేపథ్యంలోనే ఈ రహస్య, అంతర్గత సమావేశాన్ని నిర్వహించినట్టు తెలుస్తోంది. వివిధ రాష్ట్రాల ఎన్నికల సమయంలో పీకే ఇచ్చిన సూచనలు, సలహాలు పని చేయటంతో ఆయా పార్టీలు అధికారంలోకి వచ్చినట్టు కథనాలు వెలువడిన సంగతి విదితమే. ఈ క్రమంలో ఇప్పుడు ఎదురు కాబోతున్న 'సంక్లిష్ట పరిస్థితుల'పై చర్చించేందుకే కారు పార్టీ నేతలు ఆయనతో భేటీ అయినట్టు సమాచారం.

ఈ సమావేశం సందర్భంగా పీకే పలు విషయాలను సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవిత దృష్టికి తీసుకొచ్చినట్టు సమాచారం. ముఖ్యంగా దక్షిణ తెలంగాణ జిల్లాలైన ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో 'హస్తం' గాలి బాగా వీస్తోన్నట్టు ఆయన చెప్పారు. దాంతోపాటు వరంగల్‌లో సగం సీట్లు, రంగారెడ్డిలో అత్యధిక సీట్లలో కాంగ్రెస్ హవా కొనసాగనుందని ఆయన విశ్లేషించారు. ఇక ఉత్తర తెలంగాణ జిల్లాలైన ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో మాత్రమే కారు రయ్యున దూసుకుపోనుందనీ, ఉమ్మడి మెదక్‌తోపాటు కరీంనగర్, హైదరాబాద్ జిల్లాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, మిశ్రమ ఫలితాలను సాధిస్తాయంటూ పీకే విశదీకరించినట్టు తెలిసింది. ఈ క్రమంలో గులాబీ పార్టీకి ఈసారి గెలుపు 'అంత ఈజీ కాదం'టూ ఆయన స్పష్టీకరించినట్టు సమాచారం. అనేక నియోజకవర్గాల్లో కాంగ్రెస్ గెలుస్తుందన్న మౌత్ టాక్ అనూహ్యంగా ఊపందుకుందన్న విషయాన్ని ఆయన కేసీఆర్ దృష్టికి తీసుకుపోయారు. అందువల్ల ఆ పార్టీ అత్యధిక స్థానాల్లో బీఆర్ఎస్‌తో ఢీ అంటే ఢీ అంటోందని వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న కొద్ది రోజుల సమయాన్ని వినియోగించుకుని, వ్యూహాత్మకంగా వ్యవహరించాలంటూ బీఆర్ఎస్ అధిష్టానానికి ఆయన సూచించారు. ఈ సందర్భంగా తనకున్న అనుభవంతో పలు సూచనలు, సలహాలను ఆయన వారికిచ్చినట్టు అధికార పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఈ పరిస్థితుల దృష్ట్యా పీకేతో భేటీ అనంతరం... సీఎం కేసీఆర్ జిల్లాలు, నియోజకవర్గాల్లోని నేతలకు దిశా నిర్దేశం చేశారు. ముఖ్యంగా అభ్యర్థులుగా ఉన్న ...9లో





ఆరెస్పీయే కాబోయే సీఎం

● రాష్ట్రంలో క్షీణించిన శాంతి భద్రతలు
● ఆ మూడు పార్టీలు సంపన్న వర్గాల కోసమే..
● తెలంగాణలో అధికారంలోకి వచ్చేది మేమే..: సూర్యాపేట సభలో బీఎస్పీ జాతీయ అధ్యక్షులు మాయావతి

వివరాలు 9లో

ప్రభుత్వాల బలం ఎప్పుడూ ప్రజల అజ్ఞానంలోనే ఉంటుంది
- లియోటాల్‌స్టాయ్

సంపాదకీయం

జనం పట్టని ఎన్నికలు



ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ నేడు అసెంబ్లీ ఎన్నికల తిరునాళ్లను చూస్తున్నాం. కొనుక్కోగలిగే నేతలు రాజకీయంగా హవా నడిపిస్తున్నారు. ఎన్నికల్లో చేసే ఖర్చు ఊహకు సైతం అందడంలేదు. ఆ వ్యయం అసాధారణమని రాజకీయ, ఆర్థిక విశ్లేషకుల భావన. తెలంగాణలో ఈ నెల 30 పోలింగ్ జరగనుంది. 119 నియోజక వర్గాల్లో 2290 మంది అభ్యర్థులు ఎన్నికల గోదాలోకి దూకారు. గతం కంటే ఈ సారి 469 మంది అధికంగా పోటీపడుతున్నారు. ఇప్పటికే రాష్ట్రం లౌడ్‌స్పీకర్లు, మైకుల శబ్దాలతో హోరెత్తుతోంది. ఆయా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లో నేతలు సహా దాదాపు 298 మంది స్టార్ క్యాంపెయినర్లు తమ ప్రసంగాలతో జనాన్ని ఊదర గొడుతున్నారు. ఏ గ్రామం చూసినా, ఏ జిల్లాను పరిశీలించినా, ఏ టీవీ ఛానెల్ పెట్టినా, ఏ పత్రిక చదివినా అంతా ఎన్నికల గోలనే. సభలు, సమావేశాలు, కార్నర్ మీటింగ్‌లు, ఆత్మీయసమ్మేళనాల జోరే ఎక్కువ. మందు, విందు కొసరు నాణానికి ఒకవైపు. మరోవైపంతా గలీజు రాజకీయం. ప్రజాసమస్యలు మరుగునపడేలా నేతలు వ్యక్తి గత దూషణల దశదాటి తిట్ల పురాణాల్లోకి జారిపోతున్నారు. ఆ పేర మహిళలను సైతం కించపరుస్తున్నారు. ఓటును మార్కెట్లో సరుకుగా మార్చేసి, కొనుగోలు చేసే దుష్ట సంస్కృతికి పాదువేశారు.

అన్నీ పార్టీలు మ్యానిఫెస్టోలు ప్రకటించినా, వాటిపై పెద్దగా పట్టింపు లేదు. సమాజంలోని ఆయా సామాజిక తరగతుల కష్టాలు, కడగండ్లను ఎట్టికి వదిలేశారు. రైతులు, వ్యవసాయకూలీలు, వృత్తిదారులు, దళితులు, మైనార్టీలు, గిరిజనులు, పోడు రైతుల సమస్యలపై వామపక్షాలు మినహా ఏ పార్టీ కూడానూ చడీచప్పుడు చేయదు. నాయకులు నోళ్లు మెదపరు. యువత ఉద్యోగాల వ్యథను కదపరు. మార్క్సిస్టు మహానేత పుచ్చలపల్లి సుందరయ్య వారసులుగా పంతొమ్మిది నియోజక వర్గాల్లో సీపీఐ(ఎం) అభ్యర్థులు ప్రజల లోగిళ్లలో ప్రత్యక్షమవుతున్నారు. పోడు భూముల పోరాటంలో పోలీసుల లాఠీ దెబ్బలు తిని జైలుకెళ్లినవారు, జనం కోసం పాదయాత్ర చేసినవారు, తమ ఆస్తులను త్యాగం చేసినవారు, పేదలకే జీవితాలను అంకితం చేసిన నాయకులు బరిలోకి దిగి జనం పాట అందుకున్నారు. అణగారిన వర్గాల సమస్యలను ఎజెండా చేస్తున్నారు. కమ్యూనిస్టులు చట్టసభల్లో అడుగిడితే, ఎలా ఉంటుందో విడమర్చి చెబుతున్నారు. ఆదరించాలని కోరుతున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నేతలు ఒకరినొకరు పరుషంగా తిట్టుకోవడమే తప్పితే జనం గోడేది? ఈ పార్టీలవీ ఒకే తరహా విధానాలే. పేదలపై ప్రేమలేదు. దేశంలో గానీ, రాష్ట్రంలో గానీ పేదరికం తగ్గడం లేదు. 2021 నిటిఅయోగ్ నివేదిక ప్రకారం రాష్ట్రంలో 13.74 జనాభా పేదరికంలో మగ్గుతున్నది. కనీసావసరమైన తాగునీరు ఇరవై నాలుగు శాతం మందికి అందుబాటులో లేదు. పేదరికం గ్రామాల్లో 7.5 శాతం కాగా, పట్టణాల్లో 5.88 శాతం ఉందని ఆ నివేదిక తేటతెల్లం చేసింది. పార్టీలు మారడం, స్వప్రయోజనాలపై ఉన్న మక్కువ, ప్రజల మంచి, చెడుల పరిష్కారంపై లేకపోవడం సిగ్గుచేటు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్నికల్లో కప్పదాట్లు బాగా పెరిగాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్యే ఇవి సాగుతుండటం అవి ఒకే తానులోని ముక్కలేనని చెప్పడానికి ఇంకేం కావాలి సాక్ష్యం?

ఎన్నికల సంఘం, పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డ సొమ్మే ముక్కున వేలేసుకునేలా చేస్తున్నది. ఈ నెల ఇరవై నాటికి పట్టుబడిన రూ.1760 కోట్లలో రూ.659.2 కోట్లు తెలంగాణదే. నగదులోనూ అరవై శాతం మనదే. దీన్ని బట్టి చూస్తే రాష్ట్రంలో ధన ప్రభావం విపరీతంగా ఉన్నట్టే. ఐదు రాష్ట్రాల్లో 2018లో పట్టుబడిన సొమ్ము రూ.239.15 కోట్లతో పోలిస్తే ఈ సారి ఇప్పటికే దొరికిన సొత్తు విలువ 636 శాతం అధికం. దిగజారిన రాజకీయ విలువలకు దర్పణమిది. నగదుతో పాటు మద్యం, డ్రగ్స్, విలువైన లోహాలు దొరకడం దురదృష్టకరం. సందట్లో సడేమియాలా కేంద్రంలోని బీజేపీ సర్కారు విపక్షాలను వేధిస్తున్నది. ఎన్నికలనూ అవకాశంగా తీసుకుని ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులపై ఐటీ దాడులతో జనంలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నది. ప్రధానంగా కాంగ్రెస్ అభ్యర్థులపై విపరీతంగా చేస్తున్నది. రణతంత్రపు ఎత్తులు వేస్తున్నది. ప్రత్యర్థులను దెబ్బతీసేలా వ్యూహ, ప్రతి వ్యూహాలకు పూనుకున్నది. వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని అధికారికంగానే పోల్ మేనేజ్‌మెంటుకు తెగబడటం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. కర్నాటక, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి అక్రమంగా నిధుల వరద పారుతున్నది. ఆయా రాష్ట్రాల సరిహద్దుల్లో పట్టుబడుతున్న సొమ్మే దీనికి నిదర్శనం. ఓటర్లు, ప్రజలు మేలుకుని కంఠకుల పీచమణచకపోతే, ప్రజాస్వామ్యం మనుగడే ప్రమాదం. ప్రశ్నార్థకం. ఓటు ప్రతి ఐదేండ్లకో సారి వచ్చే పండుగకాదు. తమ బతుకుదెరువుని చక్కబెట్టుకునే ఆయుధమని ప్రజలు గుర్తెరగాలి.

మార్క్సిస్టు మహానేత పుచ్చలపల్లి సుందరయ్య వారసులుగా పంతొమ్మిది నియోజకవర్గాల్లో సీపీఐ(ఎం) అభ్యర్థులు ప్రజల లోగిళ్లలో ప్రత్యక్షమవుతున్నారు. పోడుభూముల పోరాటంలో పోలీసుల లాఠీ దెబ్బలు తిని జైలుకెళ్లినవారు, జనం కోసం పాదయాత్ర చేసినవారు,తమ ఆస్తులను త్యాగం చేసినవారు, పేదలకే జీవితాలను అంకితం చేసిన నాయకులు బరిలోకి దిగి జనంపాట అందుకున్నారు. అణగారినవర్గాల సమస్యలను ఎజెండా చేస్తున్నారు.

బీజేపీ మేనిఫెస్టో మరో జుమ్లా


కేంద్రంలో తమ పాలనా వైఫల్యాలు ప్రజల ముందున్నాయి. అందుకే ఒకవైపు కులాన్నీ, మరోవైపు మతాన్నీ ముందుకు తెస్తున్నారు. బీసీని ముఖ్యమంత్రి చేస్తామన్నారు. ప్రధాన మంత్రే బీసీ అని చెప్పుకుంటున్న వీరు బీసీ కులగణనకు అడ్డు పడుతున్నారు కదా! అంతేకాదు. ఒక్కరికి ముఖ్యమంత్రి పదవి ఇస్తే బీసీలందరూ బాగుపడతారా? పదేండ్లు కేంద్రంలో అధికారంలో ఉండి ఎస్సీ వర్గీకరణ గురించి మాట్లాడని బీజేపీ, ఇప్పుడు కమిటీ వేస్తామంటున్నది. మరోవైపు ఓట్ల కోసం దైవభక్తినీ, మతాన్నీ వాడుకుంటున్నది.


ఎస్. వీరయ్య

రాష్ట్రంలో బీజేపీ ఎన్నికల ప్రణాళిక ప్రకటించింది. అది కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ ప్రణాళికలో ఇచ్చిన హామీలన్నీ "ప్రధాని మోడీ ఇస్తున్న హామీలు" అన్నారు అమిత్‌షా. అందుకే ఈ ప్రణాళికను లోతుగానే పరిశీలించాలి. కేంద్రంలో పదేండ్లుగా అధికారంలో ఉన్న పార్టీ కావటం, హామీలన్నీ ప్రధాని హామీలుగా పరిగణించాలనటంతో ప్రాధాన్యత సంతరించుకున్నది. ఈ సందర్భంగా అమిత్‌షా మాట్లాడుతూ "చంద్రునిపై మువ్వన్నెల జెండా ఎగురవేసిన బీజేపీ" అన్నారు! శాస్త్రవేత్తల ఆరు దశాబ్దాల కృషి ఫలితాన్ని బీజేపీ ఖాతాలో వేసుకోవటం చవకబారు ఎత్తుగడ. ఇదే ప్రయోగం విఫలమైనపుడు, అర్ధరాత్రి, శాస్త్రవేత్తల మీద ఆగ్రహంతో రుసరుసలాడిన ప్రధాని మోడీ ధోరణి ప్రజలు ఇంకా మరచిపోలేదు. వైఫల్యమైతే శాస్త్రవేత్తలదీ, విజయమైతే బీజేపీదని చెప్పుకుంటారన్నమాట! సోషల్ మీడియాలో నెటిజన్ల వ్యాఖ్యలు గమనించాలి. క్రికెట్ మ్యాచ్‌లో ఇండియా ఓటమితో బీజేపీ ఒక ప్రచారాస్త్రం కోల్పోయిందట! నిజమే... గెలిచి ఉంటే అది కూడా మోడీ విజయంగా చెప్పేవారే కదా!

ద్రవ్యోల్బణం తగ్గిస్తామనీ, సింగరేణి ఉద్యోగులకు ఆదాయం పన్ను రీయంబర్స్ చేస్తామనీ, వరిధాన్యం మద్దతు ధర క్వింటాల్‌కు రూ.3100 నిర్ణయించి, పంట మొత్తం కొనుగోలు చేస్తామని అమిత్‌షా అన్నారు. ఇవన్నీ తెలంగాణలో బీజేపీ గెలిస్తే చేస్తారట. ఇది రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోని విషయాలు కాదని అమిత్‌షాకు తెలియదా? పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు పెంచింది కేంద్ర బీజేపీ సర్కారు. ఫలితంగానే అన్ని నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయి. ఆహారధాన్యాలు బడా వ్యాపారుల ప్రయోజనాలకనుకూలంగా దాచిపెట్టుకోడానికీ, ఎగుమతికీ అవకాశం ఇచ్చింది మోడీ ప్రభుత్వమే. ఆహార సరుకుల ధరలు మరింత పెరగడానికి దారితీసింది. ఈ వాస్తవాలు దాచిపెట్టి తెలంగాణలో ధరలు తగ్గిస్తామని చెప్పటం హాస్యాస్పదం. ధాన్యం మద్దతు ధర చట్టబద్ధం చేయడానికి అంగీకరించేది లేదని మోడీ చెప్పేసారు. ఇక్కడికి వచ్చి, మద్దతు ధర గురించి అమిత్‌షా మాట్లాడుతున్నారు. పైగా పంట మొత్తం కొంటామంటున్నారు. గతేడాది "దొడ్డు బియ్యం కొనేదిలేద"ని మొండికేసిన విషయం రైతులు మరచిపోయారనుకుంటున్నారా? పసుపు బోర్డు తంతు కూడా ఇంతే. గత పార్లమెంటు ఎన్నికల తర్వాత, పసుపు బోర్డు సాధ్యం కాదనీ, అంతకన్నా గొప్పదేదో చేస్తామని బీజేపీ ఎంపీ తప్పించుకున్నారు. ఎన్నికలు దగ్గర పడగానే, రైతుల ఒత్తిడి తట్టుకోలేక, హడావుడిగా ప్రకటించారు. ఇప్పుడు పసుపు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని ఆశ పెడుతున్నారు. ఆదాయపు పన్ను రీయంబర్స్‌మెంట్ ఒక్క సింగరేణి ఉద్యోగులకు మాత్రమే చేసేది కాదు కదా!

పెట్రోలు, డీజిల్ మీద వ్యాట్ తగ్గిస్తామని మరో వాగ్దానం. ఇది మరింత మోసపూరితం. వీటి ధరలు పెంచేది కేంద్ర ప్రభుత్వం. పెంచకుండా ఉంటే సరిపోతుంది కదా! కేంద్ర పెంచుతుందట... ఇక్కడ తగ్గిస్తుందట. చమురుపై పన్ను విధానం భిన్నమైంది. కేంద్రం పెంచినపుడు, ఆటోమేటిక్‌గా రాష్ట్ర పన్ను కూడా పెరుగుతుంది. అంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ భారం మోపుతాయి. రాష్ట్రంలో వ్యాట్ తగ్గించాలనటం రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టటమే. ఇప్పటికే జీఎస్టీ పేరుతో వనరులన్నీ కేంద్రం గుప్పిట్లో పెట్టుకున్నది. ఇప్పుడు కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే చమురుపై పన్నులు తగ్గించాలి. ఆదాయం కోసం బడాబాబుల మీద ఆదాయం పన్ను పెంచాలి. రాష్ట్రాలకు మరిన్ని నిధులు అందుబాటులోకి తేవాలి. కానీ మోడీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు పన్ను 10శాతం తగ్గించింది. ప్రజలమీద మాత్రం పన్నుల భారం మోపింది. ఒకవైపు ఎల్ఐసీతో సహా ప్రభుత్వరంగ సంస్థలన్నీ ప్రయివేటుపరం చేస్తూ, నిజాం షుగర్ ఫ్యాక్టరీ గురించి మాట్లాడటం ఆశ్చర్యకరం. రాష్ట్రంలోని ప్రభుత్వ శాఖల్లో 2.7లక్షల ఖాళీ పోస్టులు ఆరు నెలల్లో భర్తీ చేస్తామన్నారు. కేంద్రంలో పదేండ్ల నుంచి అధికారంలో ఉన్నారు కదా.. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులు ఎందుకు నింపలేదు? ఫిబ్రవరి3, 2022న పార్లమెంట్‌లో కేంద్రమంత్రి జితేందర్ సింగ్, రాతపూర్వకంగా ఇచ్చిన జవాబులోనే, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలలో 8,75,158 పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఒప్పుకున్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలలోని ఖాళీలు కలిపితే 15లక్షలు దాటుతాయి. ఇప్పటికి మరో రెండు లక్షలు కలుపుకుని 17లక్షలకు చేరి ఉంటాయి. వీరు తెలంగాణలో ఖాళీ పోస్టులు భర్తీ చేస్తామని నమ్మబలుకుతున్నారు. పేదలకు ఇండ్ల పట్టాల వాగ్దానం మరింత హాస్యాస్పదం. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా 2022 డిసెంబర్ 31 నాటికే దేశంలో అందరికీ ఇంటి సౌకర్యం కల్పిస్తామని ప్రకటించారు. ఇప్పుడు దానిగురించి దాటవేసి, మరోసారి వాగ్దానం చేస్తున్నారు. గ్యాస్ సిలిండర్ గురించి మాట్లాడుతున్న బీజేపీ దాని ధర పెంచింది మోడీ ప్రభుత్వమేనన్న విషయం చెప్పదు. పైగా సంక్షేమ పథకాలకు 'ఉచితాలు' అని పేరుపెట్టి, వాటికి వ్యతిరేకంగా బీజేపీ నాయకుడే కేసు వేసారు. మోడీ ప్రభుత్వం కూడా 'ఉచితాలు' మంచివి కాదని కోర్టుకు చెప్పింది. మరోవైపు ఇక్కడ సంక్షేమం గురించి మాట్లాడటం రెండు నాల్కల ధోరణి కదా! ప్రయివేటు ఆస్పత్రులలో రు.10లక్షల కవరేజీతో ఆరోగ్యబీమా అంటున్నారు. ఆ డబ్బుతో ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేయవచ్చు. ప్రభుత్వ డబ్బుతో ప్రయివేటు హాస్పిటల్స్‌ను ఎందుకు మేపాలి? ఒక్క సాగునీటి ప్రాజెక్టుకు కూడా జాతీయ హోదా ఇవ్వలేదు. రాష్ట్రానికి రావల్సిన చట్టబద్ధమైన నిధులు కూడా బిగబట్టి బకాయి పెడుతున్నారు. దేశంలో ఎన్నికల బాండ్ల పేరుతో అవినీతిని చట్టబద్ధం చేసింది మోడీ ప్రభుత్వం. ఆ నాయకులే ఇక్కడ అవినీతిపరులను జైలుకు పంపుతామని అంటున్నారు. చర్యలెందుకు తీసుకోవటం లేదని మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా "చర్యలు తీసుకోవటం దర్యాప్తు సంస్థల పని, మా పని కాదు" అన్నారు అమిత్‌షా. మరోవైపు రాష్ట్రంలో అధికారంలోకి వస్తే జైలుకే అంటున్నారు. ఇక్కడ దర్యాప్తు సంస్థలను పక్కనబెట్టి జైలుకు పంపుతారా? ఇవి బ్లాక్‌మెయి లింగ్ ఎత్తుగడలు.



ప్రజల సమస్యల పరిష్కారం గురించి ఏమి చెప్పినా ప్రజలు నమ్మే స్థితిలేదు. కేంద్రంలో తమ పాలనా వైఫల్యాలు ప్రజల ముందున్నాయి. అందుకే ఒకవైపు కులాన్నీ, మరోవైపు మతాన్నీ ముందుకు తెస్తున్నారు. బీసీని ముఖ్యమంత్రి చేస్తామన్నారు. ప్రధానమంత్రే బీసీ అని చెప్పుకుంటున్న వీరు బీసీ కులగణనకు అడ్డుపడుతున్నారు కదా! అంతేకాదు. ఒక్కరికి ముఖ్యమంత్రి పదవి ఇస్తే బీసీలందరూ బాగుపడతారా? పదేండ్లు కేంద్రంలో అధికారంలో ఉండి ఎస్సీ వర్గీకరణ గురించి మాట్లాడని బీజేపీ, ఇప్పుడు కమిటీ వేస్తామంటున్నది. మరో వైపు ఓట్ల కోసం దైవభక్తినీ, మతాన్నీ వాడుకుంటున్నది.

తెలంగాణ ప్రజలందరికీ ఉచిత అయోధ్య ప్రయాణం, దైవ దర్శనం, వసతి కల్పిస్తారట! దేశ ప్రజలందరూ ఇదే అడిగితే ఏం చెబుతారు? వృద్ధులకు రైల్వేలో ఉన్న సదుపాయాలు తగ్గించారు. ప్రభుత్వోద్యోగులకు పాత పెన్షన్ విధానం రద్దు చేసారు. ఈపీఎఫ్ పెన్షన్‌దారుల గోడు పట్టించుకోరు. అయోధ్య, కాశీ ప్రయాణాలకు మాత్రం వృద్ధులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తారట! తాంత్రికుల సలహాతోనే కేసీఆర్ తమ పార్టీ పేరు మార్చారని విమర్శ చేసారు. అదే నిజమైతే అశాస్త్రీయ నిర్ణయమే! తప్పే. కరోనా కాలంలో చప్పట్లు కొట్టాలనీ, పూలు చల్లాలనీ మోడీ బహిరంగంగానే పిలుపునిచ్చారు. ఐదువేల ఏండ్లనాడే ప్లాస్టిక్ సర్జరీ ఉన్నదనీ, వినాయకుడికి ఏనుగు తల అట్లానే వచ్చిందని కూడా అన్నారు. ఇంతకన్నా అశాస్త్రీయం, రాజ్యాంగ విరుద్ధం ఇంకా ఏముంటుంది? ఇప్పుడు మేనిఫెస్టో పేరుతో కూడా మతపరమైన విభజనకు ప్రయత్నిస్తున్నారు. ముస్లింలలోని బీసీల రిజర్వేషన్లు రద్దు చేసి హిందువులలోని బీసీలకు, ఎస్సీ, ఎస్టీలకు పంచుతారట. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను కూడా వక్రీకరిస్తున్నారు. హిందూ ముస్లిం కొట్లాటగా చిత్రీకరిస్తున్నారు. ఇంత చేసినా తెలంగాణలో బీజేపీ గెలవలేదని అర్థమైంది వారికి. అందుకే ఎన్ని సీట్లొచ్చినా బీజేపీనే అధికారంలోకి వస్తుందంటున్నారు. అదెట్లా సాధ్యమని విలేకరులు అడిగితే డిసెంబరు 3న చూడండని అమిత్‌షా అన్నారు. అంటే ఇతర పార్టీల శాసనసభ్యులను టోకుగా కొనుగోలు చేస్తారన్న మాట. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్నాటక ఎత్తుగడలు తెలంగాణలో కూడా వేయనున్నారన్న మాట. అంటే.. అధికారం కోసం విలువలన్నీ దిగజార్చి, ఏ గడ్డయినా గరవడానికి సిద్ధంగా ఉన్నట్టే కదా! తెలంగాణ ప్రజలు అప్రమత్తంగా ఉండవల్సిందే. ◆

ఇంత చేసినా తెలంగాణలో బీజేపీ గెలవలేదని అర్థమైంది వారికి. అందుకే ఎన్ని సీట్లొచ్చినా బీజేపీనే అధికారంలోకి వస్తుందంటున్నారు. అదెట్లా సాధ్యమని విలేకరులు అడిగితే డిసెంబరు 3న చూడండని అమిత్‌షా అన్నారు. అంటే ఇతర పార్టీల శాసనసభ్యులను టోకుగా కొనుగోలు చేస్తారన్నమాట. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్నాటక ఎత్తుగడలు తెలంగాణలో కూడా వేయనున్నారన్న మాట. అంటే.. అధికారం కోసం విలువలన్నీ దిగజార్చి, ఏ గడ్డయినా గరవడానికి సిద్ధంగా ఉన్నట్టే కదా! తెలంగాణ ప్రజలు అప్రమత్తంగా ఉండవల్సిందే.

మార్గదర్శి, స్ఫూర్తి ప్రదాత కామ్రేడ్ శంకరయ్య

కామ్రేడ్ ఎస్.శంకరయ్య శత జయంతి సందర్భంగా సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యుడు జీ.రామకృష్ణన్ జూలై 18, 2021న రాసిన వ్యాసాన్ని, శంకరయ్య మరణానంతరం నివాళులు అర్పిస్తూ పీపుల్స్ డెమోక్రసీ పున్ణముద్రించిన వ్యాసం ఇది.


జి.రామకృష్ణన్

జూలై 15, 1922న జన్మించిన కామ్రేడ్ ఎస్.శంకరయ్య, ఎన్.ఎస్‌గా అందరికీ సుపరిచితుడు. జూలై 15, 2021 తేదీన ఆయన తన వందవ సంవత్సరంలోకి ప్రవేశించాడు. బహుముఖ నాయకునిగా ఆర్థిక, రాజకీయ, సామాజిక, భావజాల, సాంస్కృతిక మొదలైన రంగాలలో తనదైన ముద్ర వేశాడు. రాజకీయ రంగంలో, కుటుంబ జీవితంలో ఒక కమ్యూనిస్ట్‌గా ఉండడం ఎలా అని చెప్పడానికి ఆయన జీవితం ఒక నమూనా. అదే, మనకు మార్గ నిర్దేశం చెయ్యడం, స్ఫూర్తినివ్వడం కొనసాగిస్తుంది.

శంకరయ్య యువకుడుగా ఉన్న రోజుల్లో, సామాజిక సంస్కరణలు, నాస్తికత్వ విధానాలతో ఆత్మగౌరవ ఉద్యమం వైపు ఆకర్షితుడయ్యాడు. ఆ సమయంలో, కమ్యూనిస్ట్ పార్టీ మాత్రమే సంపూర్ణ స్వాతంత్ర్యం నినాదాన్ని ముందుకు తీసుకొని వచ్చింది. శంకరయ్య ఈ పరిణామాలన్నిటినీ గమనించి, ఆర్థిక సమానత్వంతో కూడిన కుల రహిత సమాజానికి దారితీసే సామాజిక మార్పే దీనికి పరిష్కారమనీ, ఈ లక్ష్యం దిశగా మానవాళిని నడిపించేది కూడా మార్క్సిజం మాత్రమే అనే నిర్ణయానికి వచ్చాడు. కళాశాల విద్యార్థిగా ఉన్నప్పుడే శంకరయ్య కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (సీపీఐ) సభ్యుడు అయ్యాడు. మధురై జిల్లాలో ఏర్పడిన మొట్టమొదటి పార్టీ శాఖ కూడా ఇదే.

రాజకీయ ఖైదీగా

మధురైలోని అమెరికన్ కళాశాల విద్యార్థి సంఘానికి శంకరయ్య అధ్యక్షుడిగా ఎన్నికైనాడు. అతికొద్ది కాలంలోనే ఆయన రాష్ట్రస్థాయి విద్యార్థి నాయకునిగా గుర్తింపు పొందాడు. పోలీసులు అరెస్ట్ చేసిన అన్నామలై విశ్వవిద్యాలయం విద్యార్థులపై జరిగిన హింసాత్మక దాడులను ఖండిస్తూ ఒక శక్తివంతమైన కరపత్రాన్ని ఆంగ్లంలో రాసాడు. వాటిని విస్తృతంగా పంపిణీ చేయడం జరిగింది. ఆ దృశ్యాన్ని ఆయన ఇలా స్పష్టంగా వివరించాడు: "తలలు పగుల గొడుతున్నారు, ఎముకలు ముక్కలుగా విరగ్గొడుతున్నారు, అన్నామలై విశ్వవిద్యాలయంలో రక్తపు నది ప్రవహిస్తుంది". వార్షిక పరీక్షలకు కేవలం 15 రోజుల ముందే పోలీసులు శంకరయ్యను అరెస్ట్ చేసి, జైలుకు పంపారు. పద్దెనిమి నెలల తర్వాత మాత్రమే ఆయన్ను విడుదల చేశారు.

శతాబ్దాల తరువాత ఆయనను ఈ ప్రశ్నను అడిగాను : "మీరు న్యాయవాది అవ్వాలని మీ నాన్నగారు కోరుకున్నారు. ఫైనల్ పరీక్షలకు కేవలం పక్షం రోజుల ముందే మీరు అరెస్ట్ అయ్యారు. అంటే మీరు మీ చదువు కొనసాగించరు, లా డిగ్రీ సాధించరు, న్యాయవాది అవ్వరని అర్థం. ప్రభుత్వం మిమ్మల్ని ఎప్పుడు విడుదల చేస్తుందో స్పష్టంగా తెలియదు. అలాంటి పరిస్థితుల్లో, పోలీసులు మిమ్మల్ని అరెస్ట్ చేసినప్పుడు, మీ మానసిక స్థితి ఏంటి?

ఆయన సమాధానం ఇలా ఉంది : "నేను స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నందుకు అరెస్ట్ చేసి, జైలుకు పంపిన ప్రక్రియ నాకు ప్రేరణ ఇచ్చింది. నేను దేని గురించి కూడా బాధపడలేదు."

జైలు నుంచి విడుదల అవడంతో, శంకరయ్య కమ్యూనిస్ట్ పార్టీ మధురై జిల్లా కమిటీకి కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. మధురై జిల్లా పార్టీ చరిత్రలో 1943 నుండి 1947 వరకు (నాలుగు సంవత్సరాలు) చాలా ముఖ్యమైన కాలం. జిల్లా వ్యాప్తంగా జరిగిన మిలిటెంట్ ప్రజా పోరాటాలకు పార్టీ నాయకత్వం వహించింది. అనేక కార్మికవర్గ పోరాటాలు, ఆహారధాన్యాల నిల్వలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాల తర్వాత కామ్రేడ్ పి.రామమూర్తి, ఏ.బాలసుబ్రమణ్యన్, ఎం.ఆర్. వెంకట్రామన్, కే.టి.కే.తంగమణి, జానకి అమ్మ లాంటి యోధులతో పాటు శంకరయ్యను 1946లో అరెస్ట్ చేశారు. నాయకులందరినీ మధురై కుట్ర కేసులో ఇరికించారు. నాయకులు ఆగస్ట్ 14, 1947 నాడు మాత్రమే ఇతర నాయకులతో పాటు విడుదల అయ్యారు. వారి విడుదల వార్త ముందుగానే తెలియడంతో, వారిని అభినందించడానికి ప్రజలు భారీ సంఖ్యలో చేరుకున్నారు. పార్టీ నిర్వహించిన భారీ బహిరంగ సభలో నాయకులను సాదరంగా ఆహ్వానించారు.

జైలు, అండర్ గ్రౌండ్ జీవితం

కామ్రేడ్ శంకరయ్య మొత్తం ఎనిమిదేళ్ల జైలు జీవితం గడిపారు. వలస పాలనలో నాలుగేండ్లు, స్వాతంత్ర్యానంతర కాంగ్రెస్ పాలనలో నాలుగేళ్లు. అండర్ గ్రౌండ్‌లో మూడేళ్ల జీవితం గడిపారు. అది, ఆయన ఉద్యమానికి అంకితం చేసిన జీవితం. స్వాతంత్ర్య సమరయోధులకు ప్రభుత్వం పెన్షన్‌ను ప్రకటించినప్పుడు, పార్టీ నిర్ణయానికి అనుగుణంగా ఆయన దానిని తిరస్కరించాడు. దాని గురించి ఎవరైనా అడిగితే, దేశ స్వాతంత్ర్యం కోసం జైలుకు వెళ్ళడమే తనకు చాలా విలువైన బహుమానం అని తేలికగా చెప్పాడు.

అండర్ గ్రౌండ్ జీవితం, జైలు జీవితం చాలా కష్టమైనవి, వినాశకరమైనవి. ఒక బలమైన, పట్టుదల గల మనస్తత్వం లేకుండా అలాంటి జీవితాన్ని ఎవరూ తట్టుకోలేరు. అయినప్పటికీ, కమ్యూనిస్టులు ఈ సవాళ్ళను చాలా ధైర్యంగా ఎదుర్కొన్నారు. శంకరయ్య వేలూరు జైల్లో రాజకీయ ఖైదీగా ఉన్నప్పుడు, ఆయనతో పాటు కమ్యూనిస్ట్ ఖైదీలు రాజకీయ వివక్షకు వ్యతిరేకంగా (కాంగ్రెస్ ఖైదీలు, కమ్యూనిస్ట్ ఖైదీలను 'ఏ','బీ' కేటగిరీలుగా చేయడం) నిరవధిక నిరాహారదీక్ష చేపట్టారు. నిరవధిక నిరాహారదీక్ష పదవ రోజున జైలు సూపరింటెండెంట్ జైలు సందర్శించినప్పుడు, శంకరయ్య మాక్సిమ్ గోర్కీ రాసిన 'అమ్మ' నవలను చదువుతుండడం చూసి, నిరాహార దీక్షలో ఉన్న కమ్యూనిస్టుల మానసిక బలాన్ని చూసి ఆయన ఆశ్చర్యపోయాడు.

పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా:-

1953లో ఉమ్మడి కమ్యూనిస్ట్ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యునిగా శంకరయ్య ఎన్నికయ్యాడు. సీపీఐ(ఎం) ఏర్పాటుకు ముందు జరిగిన పార్టీ జాతీయ కౌన్సిల్ సమావేశం నుండి బయటకి వచ్చిన 32మంది సభ్యుల్లో శంకరయ్య ఒకరు. 1995లో సీపీఐ(ఎం) తమిళనాడు రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా ఎన్నికైన ఆయన ఆ హోదాలో 2002 వరకు పని చేశాడు. రాష్ట్ర కార్యదర్శిగా, రాష్ట్రంలో నెలకొన్న సమస్యల పట్ల ఆయన చాలా చురుగ్గా జోక్యం చేసుకునే వారు. 1998లో కోయంబత్తూరులో జరిగిన బాంబు పేలుళ్లు, మత ఘర్షణలు, 24 మంది ప్రాణాలు కోల్పోడానికి దారితీసాయి. ఈ సంక్షోభాన్ని చక్కదిద్దేందుకు శంకరయ్య, కామ్రేడ్ ఉమానాథ్‌ను కోయంబత్తూరు పంపించాడు. శంకరయ్య, ముఖ్యమంత్రితో సంప్రదింపులు జరపడంతో పాటు మత ఘర్షణలకు బాధ్యులైన వారిని అరెస్ట్ చేసి, రాష్ట్ర వ్యాప్తంగా భద్రతా చర్యలు చేపట్టాలని కోరాడు. కార్మికవర్గ కేంద్రంగా ఉన్న కోయంబత్తూరులో జరిగిన మత ఘర్షణల పట్ల సీపీఐ(ఎం) ఆందోళన చెందిందనీ పేర్కొంటూ, కార్మికవర్గ ఐక్యతను దెబ్బతీసే మతతత్వ శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరాడు.

1990 దశాబ్దం ద్వితీయార్థంలో, తమిళనాడు రాష్ట్రంలోని దక్షిణ జిల్లాలలో కులాల మధ్య ఘర్షణలు జరిగిన ఫలితంగా విషాదకరంగా ప్రాణ నష్టం, ఆస్తి నష్టం వాటిల్లింది. కామ్రేడ్ శంకరయ్య అభ్యర్థన మేరకు నాటి ముఖ్యమంత్రి కరుణానిధి అఖిల పక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆ రెండు రోజుల సమావేశానికి శంకరయ్యతో పాటు నేను కూడా హాజరయ్యాను. సమావేశం జరుగుతున్న సందర్భంలో శంకరయ్య జోక్యం చేసుకొని, "మా పార్టీ శ్మశానవాటిక శాంతి కోసం లేదు. ఇప్పుడు మేము మీ ముందుంచుతున్న నినాదాల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. రాజకీయ పార్టీలు, సామాజిక సంస్థలు ఈ ప్రక్రియలో కీలకపాత్ర పోషించాల్సి ఉంటుందని" అన్నాడు. ఆ నినాదాలు : "అస్పృశ్యత శాపాన్ని నిర్మూలించాలి, కులాల మధ్య చెలరేగుతున్న ఘర్షణలను అంతం చేయండి, ప్రజల ఐక్యతను కాపాడండి." కామ్రేడ్ శంకరయ్య చేసిన సూచనలను ముఖ్యమంత్రి స్వాగతించాడు.

సీపీఐ(ఎం) ఏర్పడిన తర్వాత తమిళనాడు రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో నడిచిన 'తీక్కతిర్' పత్రికకు సంపాదకునిగా కూడా పనిచేశాడు. కళలు, సాహిత్యం అభివృద్ధికి సంబంధించి కూడా ఆయనకు లోతైన అవగాహన ఉంది. తమిళనాడు ప్రోగ్రెసివ్ రైటర్స్ యూనియన్ ఏర్పాటులో ఆయన కీలకమైన పాత్రను పోషించాడు. తమిళనాడు ప్రోగ్రెసివ్ రైటర్స్ యూనియన్ మహాసభలో ఆయన చేసిన ప్రసంగం, సాహిత్యంలో రూపం, సారంల సాపేక్ష పాత్రలపై జరిగిన చర్చలో ఆయనకున్న అవగాహనను తెలియజేసింది, విస్తృతమైన ఆమోదాన్ని కూడా పొందింది.



శాసనసభ్యునిగా

శంకరయ్య తమిళనాడు రాష్ట్ర శాసనసభకు మూడు పర్యాయాలు ఎన్నికయ్యాడు. మొదటిసారి గెలిచినప్పుడు లెజిస్లేచర్ పార్టీ డిప్యూటీ నాయకునిగాను, రెండు, మూడో దఫా గెలిచినప్పుడు లెజిస్లేచర్ పార్టీ నాయకునిగా పని చేశాడు. విద్య, పాలనా వ్యవస్థ, న్యాయవ్యవస్థలో తమిళ భాషను ప్రవేశపెట్టాలని నొక్కిచెప్పడం, శాసనసభ్యునిగా తాను పోషించిన పాత్ర వలన ఆయనకు మంచి గౌరవం దక్కింది. తమిళనాడులో రైతు ఉద్యమ నిర్మాణంలో శంకరయ్య కీలకమైన పాత్రను పోషించాడు. ఆయన తమిళనాడు రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడిగానూ, అదేవిధంగా జాతీయ స్థాయిలో అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షునిగా, కార్యదర్శిగాను సేవలందించాడు. ఉమ్మడి కమ్యూనిస్ట్ పార్టీ ప్రచురించిన జనశక్తి పత్రికకు ఆయన సంపాదకునిగా సేవలందించాడు. సీపీఐ(ఎం) ఏర్పడిన తర్వాత తమిళనాడు రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో నడిచిన 'తీక్కతిర్' పత్రికకు సంపాదకునిగా కూడా పనిచేశాడు. కళలు, సాహిత్యం అభివృద్ధికి సంబంధించి కూడా ఆయనకు లోతైన అవగాహన ఉంది. తమిళనాడు ప్రోగ్రెసివ్ రైటర్స్ యూనియన్ ఏర్పాటులో ఆయన కీలకమైన పాత్ర పోషించాడు. తమిళనాడు ప్రోగ్రెసివ్ రైటర్స్ యూనియన్ మహాసభలో ఆయన చేసిన ప్రసంగం, సాహిత్యంలో రూపం, సారంల సాపేక్ష పాత్రలపై జరిగిన చర్చలో ఆయనకున్న అవగాహనను తెలియజేసింది, విస్తృతమైన ఆమోదాన్ని కూడా పొందింది.

శంకరయ్య, ఆయన వ్యక్తిగత జీవితానికి కూడా ప్రజాస్వామిక నిబంధనలను అన్వయిస్తూ వచ్చాడు. ఆయన కులవివక్షతను బలంగా వ్యతిరేకించడమే కాక తాను పుట్టిన కుల,మతాలకతీతంగా ఉన్న వ్యక్తిని పెళ్లి చేసుకున్నాడు. ఆయనది చాలా పెద్ద కుటుంబం. ఆ కుటుంబంలో చాలావరకు కులాంతర వివాహాలే జరిగాయి.ఇలా జరగడంలో కామ్రేడ్ శంకరయ్య పాత్ర చాలా ముఖ్యమైనది. కామ్రేడ్ శంకరయ్య జీవితం నేటితరం కార్యకర్తలకు మార్గదర్శకంగా, స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది. ◆

("పీపుల్స్ డెమోక్రసీ" సౌజన్యంతో)

అనువాదం : బోడపట్ల రవీందర్, 9848412451

శాంతి వాక్యమొకటి నాటుతున్నాను

రేపటి ఉదయాల్లోని తాజాదనమంతా
పొడిపొడిగా రాలిపోతుంది
పాలుతాగుతున్న పిట్టలు
ఇంకో ఉదయంలోకి కళ్ళు తెరవకుండానే
శవాల గుట్టలుగా పేరుకుపోతున్నాయి

విడగొట్టబడ్డ మట్టికణాలు
బాంబుల తుఫాను మధ్య చిక్కుకొని
ఊపిరి బిగబట్టి చూస్తున్నాయి
చిటికెడు శాంతివాసనగల్ల
మనిషైవడైనా కనిపించడా అని
మబ్బుతెర వెనుక నుండి నెలవంక వేచి చూస్తుంది

సంవత్సరాల వెనక్కి పాకులాడటాలు
పాత ఆలోచనల తుండు గుడ్డల తలకట్టులు
వలస జాతుల ఆమోద పత్రాల
సంఘర్షణల అంతర్యుద్ధమిది

నొక్కిపెట్ట బడ్డ సన్నని గొంతుల మూలుగులు
ఆకాశానికి ఎగిసిపడ్డ ఆక్రందనల ఆర్తనాదాలు
కాలపుపుటలకు ఎక్కిళ్లుపట్టి
మిణుగురులను కాంక్షిస్తున్న
ఒకానొక సందర్భం

చర్మం మీది గుర్తులు బీటలు వారిన అద్దం ముక్కలై
కళ్లను గుచ్చుకుంటున్నాయి
శాంతిని కోరుతున్న న్యాయగంట
గాయాల సంద్రాన్ని తొడుక్కుని
లేతపచ్చివాసనతో గుబులుగా ఉంది

ఆధిపత్యపు కడ్డీలకట్టకు విద్వేషాలరంగు పులుముకున్న
ఉద్వేగ బాధితులకు
శాంతినిప్పు ఇంకెప్పుడు అంటుకుంటదో

ప్రపంచమంతా ఏకమయి
ఇసుకతిన్నెల గుండెలపై ప్రశాంతంగా నిద్రిస్తూ
తెల్లనిపావురాలుగా మారి తత్త్వగీతాలను పాడుకునే రోజు
కలలోనైనా వస్తుందో లేదో

నేనయితే శాంతివాక్యమొకటి నాటుతున్నాను
ఏరోజుకయినా అందరి గుండెల్లో విచ్చుకునే
ఆలోచనాపువ్వయి పూయకపోతుందా అని

- డా. తండ హరీష్ గౌడ్, 8978439551





రైజింగ్ నగర్‌లో ఎర్రజెండా రయ్...రయ్...

ప్రచారంలో దూసుకుపోతున్న సీపీఎం అభ్యర్థి షోపత్ రామ్ • కాంగ్రెస్, బీజేపీలకు చెమటలు పట్టిస్తున్న యువనేత

'లాల్ లాల్ లహర్ ఆయేగా, షోపత్ జైపూర్ జాయేగా' అనే నినాదాలతో భారత్-పాక్ సరిహద్దు గ్రామమైన ఖ్యాలీవాలాలో సీపీఐ(ఎం) అభ్యర్థి షోపత్ రామ్ మేఘ్‌వాల్‌కు గ్రామస్తులు స్వాగతం పలికారు. చాలా గ్రామాలు సిక్కు మూలానికి చెందిన రైతులతో ఉన్నాయి. వీరంతా 19వ శతాబ్దంలో పంజాబ్ నుంచి వలస వచ్చినవారు. పాకిస్థాన్‌కు ఆనుకుని ఉన్న శ్రీగంగానగర్, అనుప్‌గఢ్ జిల్లాల ప్రాంతం మొత్తం ప్రస్తుతం సిక్కుల వ్యవసాయ భూమి. రాజస్థాన్‌లోని షెఖావతి ప్రాంతం మాదిరిగానే, గంగానగర్,అనుప్‌గఢ్ ప్రాంతంలో కూడా వ్యవసాయ సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. "వ్యవసాయానికి కాలువ నీటి కొరత. చీడపీడల కారణంగా పత్తి పంటలకు నష్టం వాటిల్లడం, పంట నష్టం జరిగినా బీమా అందని పరిస్థితి" వంటి వ్యవసాయ సమస్యలు ఉన్నాయి. అనుప్‌గఢ్ జిల్లాలో భాగమైన రైజింగ్‌నగర్‌లో సీపీఐ(ఎం) అభ్యర్థి షోపత్‌రామ్ వ్యవసాయ రంగంలోని సమస్యలను ప్రజల ముందుంచుతున్నారు. షోపత్ రామ్ గత రెండు దశాబ్దాలుగా రైజింగ్‌నగర్ రైతులతో కలిసి పనిచేస్తున్నారు.

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

2004లో గంగానగర్, అనుప్‌గఢ్ ప్రాంతాల్లోని రైతులు కాలువ నీటి కోసం నెలల తరబడి ఉద్యమించారు. ఏఐకేఎస్ నాయకత్వంలో ఉద్యమం సాగింది. అప్పట్లో ఎస్ఎఫ్ఐ నాయకుడు షోపత్‌రామ్ కూడా పోరాటంలో చురుగ్గా భాగస్వామ్యం అయ్యారు. ఉద్యమాన్ని అణిచివేసేందుకు పోలీసులు జరిపిన కాల్పుల్లో ఏడుగురు రైతులు చనిపోయారు. ఉద్యమం నేపథ్యంలో ఇందిరా కెనాల్ ద్వారా గంగానగర్, అనుప్‌గఢ్ ప్రాంతాలకు ఎక్కువ నీరు చేరింది. పోరాటం విజయవంతమైంది. కానీ షోపత్ సింగ్ సహా నేతలను తప్పుడు కేసుల్లో జైల్లో పెట్టారు. నాలుగు నెలల జైలు శిక్ష షోపత్ సింగ్‌ను ఉక్కు మనిషిగా తయారు చేసింది. ఆ తరువాత రైతుల కోసం అనేక పోరాటాలకు షోపత్ సింగ్ నాయకత్వం వహించారు. 2018 ఎన్నికల్లో రైజింగ్‌నగర్‌లో 43 వేలకు పైగా ఓట్లతో షోపత్ సింగ్ రెండో స్థానంలో నిలిచారు. బీజేపీ సిట్టింగ్ ఎంపీ బల్వీర్ సింగ్ లూత్రా, కాంగ్రెస్ అభ్యర్థి సోహన్ లాల్ రిజర్వ్‌డ్ నియోజకవర్గం రైసింగ్‌నగర్‌లో షోపేత్ సింగ్‌కు ప్రత్యర్థులుగా ఉన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేపై ప్రజల్లో వ్యతిరేకత బలంగా ఉందని సీపీఐ(ఎం) తాలూకా కార్యదర్శి కలు థోరి అన్నారు. ఈసారి కాంగ్రెస్ అధికారిక అభ్యర్థి, గత ఎన్నికల నుంచి కాంగ్రెస్ రెబల్. గత ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేసిన సోనాదేవి ఇప్పుడు కాంగ్రెస్‌కు దూరంగా ఉన్నారు. కాంగ్రెస్, బీజేపీ రెండూ కులం కార్డులతో ఓట్లు దండుకునే పనిలో నిమగ్నమైయ్యాయి. అయితే సీపీఐ(ఎం) ఆశ అన్ని వర్గాల రైతులు, కార్మికుల మద్దతుపైనే ఉంది" అని కలు థోరి అన్నారు.

గత ఎన్నికల కంటే పరిస్థితి అనుకూలంగా ఉందని సీపీఐ(ఎం) అభ్యర్థి షోపత్ రామ్ అన్నారు. ప్రజాశక్తి, నవ తెలంగాణ ప్రతినిధితో ఫోన్‌లో షోపత్ రామ్ మాట్లాడారు. గత ఐదేండ్లుగా నియోజకవర్గంలో ప్రజలతో మమేకమయ్యారు. నియోజకవర్గంలో చాలా మేర చిన్న రైతులే ఉన్నారు. వ్యవసాయానికి పంజాబ్ నుంచి కాలువ నీటిని పొందడం ఎల్లప్పుడూ సమస్య. ఆ దశలన్నింటిలోనూ రైతులు సంఘటిత ఆందోళనలతో అధికారులపై ఒత్తిడి తెచ్చారు. ఒప్పంద కూలీలకు సకాలంలో డబ్బులు అందడం లేదు. పని గంటలు కూడా తక్కువ. ఇలాంటి సమస్యలకు పరిష్కారాలు వెతికే పనిలో చురుగ్గా పాల్గొన్నారు. నియోజకవర్గంలో రైతులకు పంటల బీమా అందని పరిస్థితి నెలకొంది. ఇది సిట్టింగ్ ఎమ్మెల్యేపై తీవ్ర వ్యతిరేకతగా మారింది. నియోజకవర్గంలోని 20 వేల మంది శిఖం రైతుల్లో అధిక భాగం ఈసారి సీపీఎం వెంటే ఉన్నారు. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో జరిగిన చారిత్రాత్మక పోరాటమే సిక్కు రైతులను సీపీఐ(ఎం)కు దగ్గర చేసింది. గత ఎన్నికల్లో వారి ఓట్లు పూర్తిగా బీజేపీకే పడ్డాయి. కాల్వ నీటి కోసం కిసాన్ సభ చేపట్టిన ఆందోళన కూడా రైతుల ఓట్లకు మరింత అనుకూలంగా ఉండేందుకు దోహదపడింది.

సీపీఎం వెంట రైతులు
సీపీఎం అభ్యర్థి షోపత్ రామ్

బీజేపీ, కాంగ్రెస్ రెండూ సంస్థాగత సమస్యలను ఎదుర్కొంటున్నాయి. బీజేపీకి చెందిన స్థానిక ఎంపీ, వారి ఎమ్మెల్యేతో సమస్యలు ఉన్నాయి. కాంగ్రెస్‌కు మరోసారి రెబల్ వేధింపులు ఎదురయ్యాయి. వారి మహిళా నేత ఒకరు తిరుగుబాటు చేశారు. సీపీఐ(ఎం) రెండేండ్ల క్రితమే ఎన్నికల కార్యకలాపాలు ప్రారంభించింది. నియోజకవర్గంలోని 278 పోలింగ్ బూత్‌లలో క్రియాశీలక కమిటీలు ఉన్నాయి. కోవిడ్ కష్టకాలంలో సీపీఐ(ఎం), ప్రజా సంఘాల కార్యకలాపాలు రైజింగ్ నగర్, నగరంతో సహా ఇతర ప్రాంతాల్లో ప్రజల్లోకి వెళ్లాయి. ఇదంతా ఎన్నికల్లో ప్రతిఫలిస్తుందని షోపత్ రామ్ ఆశాభావం వ్యక్తం చేశారు.



విశ్వరూపమా.. మోదీకి కైవసమా?

నాటక మిత్రులకు శుభవార్త.. నాటకం అంతరించిపోతుందని తెగ బాధపడిపోనవసరం లేదు. అవసరమైనప్పుడల్లా వ్యవస్థ తనకు కావాల్సిన సన్నివేశాలను, నటులను దానికదే సృష్టించుకుంటుంది.

షెడ్యూల్-కులాల వర్గీకరణ ఇప్పుడు ఎన్నికల అంశంగా ముందుకొచ్చింది. కొద్దిరోజుల క్రితం హైదరాబాద్‌లో జరిగిన మాదిగ విశ్వరూప సభలో ప్రధాని నరేంద్రమోదీ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణతో తాను భుజం భుజం కలిపి పోరాడతానని మాదిగ దండోరా అఖిల భారత అధ్యక్షుడు వర్గీకరణ ఉద్యమానికి మరోతోడు దొరికినట్లు భావించమని ప్రధాని మందకృష్ణను కోరారు. అలాంటి ఘనమైన ఎన్నో మాటలు చెప్పి చివరికి వర్గీకరణ పై తాము ఒక కమిటీ వేయనున్నట్లు ప్రకటించారు. ప్రసంగాలకు ముందు వేదిక మీద దండోరా నాయకుడు ప్రధాని భుజం పై తలబెట్టి కన్నీరు కార్చారు. ప్రధాని ఓదార్చారు. మందకృష్ణ సూచనపై స్పందించిన సభికులకు ప్రధాని వంగి వంగి దండం పెట్టారు. మొత్తం మీద సభను సూపర్ యాక్షన్‌తో రక్తి కట్టించారు. ఇటీవల ఒక చానల్‌లో ప్రముఖ నటుడు ప్రకాశ్‌రాజ్‌ను ఇంటర్వ్యూ చేస్తూ 'రాజకీయాల్లో కమల్‌హాసన్ ఫెయిల్, మీరూ ఫెయిల్, మరి సక్సెస్ అయిన నటుడెవరు' అని యాంకర్ అడిగారు. ప్రకాశ్‌రాజ్ తడుముకోకుండా ఠక్కున మోదీ అని చెప్పారు. ఆయన స్థాయిలో నటించగల నటుడెవరు? మోదీ కోసం ప్రత్యేకంగా మేకప్, కాస్ట్యూమ్స్, స్క్రిప్ట్ రైటర్స్, కెమెరా బృందాలున్నాయి. ఆయనే సక్సెస్ ఫుల్ యాక్టర్ అని అన్నారు. ప్రకాశ్ రాజ్ ఈజ్ రైట్ అన్పించింది విశ్వరూప సభ.

గతంలో వెంకయ్య నాయుడు ఉపరాష్ట్రపతిగా ఉన్న సమయంలో ఆయన పాదాల పైబడి వర్గీకరణకు సాయం చేయమని మంద కృష్ణ కోరారు. వర్గీకరణ మాత్రం జరగలేదు. పై కులాల వారు కింది కులాల వారితో పాదనమస్కారాలు చేయించుకోవడం హిందూ సాంప్రదాయం. మంద క్రిష్ణ పాద నమస్కారాలు కూడా ఆ అకౌంట్లోనే పడి ఉంటాయి ప్రధానంగా విశ్వరూప రచన బీజేపీది గతంలో హామీ ఇచ్చి మాట తప్పారు గదా? అని ప్రశ్నించాల్సిన దశలో మాదిగలను, ఉపకులాలను మోదీ సభకు సమీకరించి ఎన్నికల్లో బీజేపీకి ప్రయోజనం చేకూర్చే పనికి మంద కృష్ణ తోడ్పడ్డారు.


ఎస్. వినయకుమార్

బీజేపీ కండ్లలోంచి చూస్తే దళితులు

సామాజిక అంశాలపై మోదీ వైఖరి ఏమిటో తెలియాలంటే. గుజరాత్ సమతాచార శాఖ ముద్రించిన ఆయన పుస్తకం చదవాలి. గుజరాత్‌లో వాల్మీకి కులం వారు పారిశుద్ధ్య పనులు చేస్తారు. "వేల సంవత్సరాల నుండి వాల్మీకులు పారిశుద్ధ్య పని ఎందుకు చేస్తున్నారంటే ఆ పనిలో వారికి ఆధ్యాత్మిక సంతోషం లభిస్తుంది. వారు అదే పని చేయాలని ఎవరూ నిర్ణయించలేదు. భగవంతుడు తమకు ఆ పని నిర్దేశించారని వారు భావిస్తారు అందుకే ఆ పని చేస్తున్నారు." అని మోదీ విశ్లేషించారు. ఆ అంతరంగాన్ని బట్టి మోదీలో కర్మ సిద్ధాంతం అమలు చేయాలన్న తాపత్రయం ఎంత బలీయంగా ఉందో విశదం అవుతుంది. అంతటి దుర్మార్గమైన భావనలు గల వ్యక్తి, ఆ పార్టీ ఎస్సీ రిజర్వేషన్లలో వర్గీకరణకు సానుకూలంగా ఉంటారని ఎవరైనా ఎలా నమ్మగలరు? ఉన్నావో, హత్రాస్‌ల్లో దళిత మహిళలపై జరిగిన అత్యాచారాలను నిరసిస్తూ బీజేపీ ఎక్కడైనా సభలు ప్రదర్శనలు జరిపిందా? దళితులపై దాడులకు కుల దురహంకార హత్యలకు వ్యతిరేకంగా గొంతు విప్పిందా? పైగా హత్రాస్ కేసులో నిందితులకు మద్దతుగా స్థానిక బీజేపీ శాసన సభ్యుడి నాయకత్వంలో సభ జరిపారు. ఆ సభలో ఆర్ఎస్ఎస్, కర్ణీసేన, బజరంగ్ దళ్ వంటి సంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించారు. అక్కడ కన్పించిన పై సంఘాల నాయకులంతా క్షత్రియ మహాసభ, రాష్ట్రీయ సవర్ణ సంఘటన్ వంటి కుల సంఘాలకూ నాయకులే. సభలో బీజేపీ నాయకుడు రంజిత్ శ్రీవాత్సవ మాట్లాడుతూ ఒక కుశ్శంకను లేవనెత్తారు. అత్యాచారానికి గురై హత్య చేయబడ్డారని చెబుతున్న మహిళల శవాలు ఎందుకని చెరుకు తోటల్లో, తృణధాన్యాల చేళ్లలోనో దొరుకుతున్నాయి? వరి పోలాల్లో ఎందుకు దొరకడం లేదని ప్రశ్నించాడు. ఈ పిచ్చి ప్రశ్నను బీజేపీ వారు తప్ప మరెవరైనా వేయగలరా? మరో బీజేపీ ఎంఎల్ఏ సురేంద్రనాథ్ సింగ్ మాట్లాడుతూ అత్యాచారాలు అరికట్టాలంటే బాలికలకు సంస్కారాలు నేర్పాలని అన్నారు. హత్యాచారానికి గురయిన మహిళల పట్ల బీజేపీ నాయకుల వైఖరి ఎంత దుర్మార్గంగా ఉంటుందో పై వ్యాఖ్యలు తెలియజేస్తున్నాయి. కాగా గొర్రె కసాయివాన్ని నమ్మినట్లు మంద కృష్ణ అలాంటి భావాలు గల వారిని నమ్ముతున్నారు. తనతో పాటు మాదిగలను, ఉపకులాల వారిని కూడా నమ్మమని చెప్తున్నారు.

హిందూ మతంలోని అంటరానితనం, వివక్ష, దుర్మార్గాలు, అత్యాచారాలు భరించ లేకే కదా దళితులు ముస్లిం, క్రైస్తవ మతాలను స్వీకరించారు. అది చారిత్రక సత్యం. భారతదేశంలోని ముస్లింలందరూ ఇరాన్, అఫ్ఘానిస్తాన్, టర్కీల నుండి వచ్చిన వారేమీ కాదు. అలాగే క్రైస్తవులు జరూసలేం, జోర్డాన్‌ల నుండి రాలేదు. మనుస్మృతి వల్ల అనుభవిస్తున్న అలవి మానిన బాధలు భరించలేకే కదా దళితులు మతం మార్చుకొన్నది. ఆ మతాల్లో కూడా వారిని బతకనివ్వడం లేదు బీజేపీ హిందువులు మాత్రమే భారతీయులు. మిగతా వారంతా హిందువుల చెప్పు చేతల్లో బతకాలి అని ఆర్ఎస్ఎస్ శాసిస్తుంది. దాని అర్థం ఏమిటి? మనుస్మృతిని మరో రూపంలో రుద్దడమేగా?

పులినోట్లో తలపెట్టడం అన్యాయం

ఆదివాసీలకు సంబంధించి కూడా బీజేపీ విచిత్ర వాదన చేస్తోంది. అది నెలకొల్పిన వనవాసి కళ్యాణ ఆశ్రమం సిద్ధాంతం ప్రకారం ముస్లిం రాజులు అమలు చేస్తున్న బలవంతపు మత మార్పిడులను తట్టుకోలేక ప్రజలు అడవుల్లోకి పారిపోయారు. అందుకే "ఆదివాసి" అన్న మాటను తొలగించి 'వనవాసి' అన్న పేరు పెట్టారట. ఆదివాసీలపై సాగిస్తున్న అకృత్యాలను దాచి పెట్టే ప్రయత్నమే ఇది. గుజరాత్ రాష్ట్రంలో ఆదివాసీలను ఎంతగా ప్రభావితులను చేయగలిగారంటే 2002లో అహ్మదాబాదు నగరంలో ముస్లింల పై సాగించిన మారణకాండకు ఆదివాసీలను ఉపయోగించారు. మన కన్నును మన వేలుతోనే పొడిపించడమంటే ఇదే ఇవన్నీ కళ్లెదుట కన్పిస్తున్నా ముప్ఫై ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడుతున్న మందకృష్ణ మాదిగ పోయి పోయి పులి నోట్లో తలబెట్టారు. తను పెడితే పెట్టారు. కాని తెలంగాణలో ఎన్నికల ప్రచారం సాగుతున్న సమయంలో పార్లమెంట్ ఎన్నికలు కూడా కొన్ని నెలల్లో జరగనున్న సమయంలో ఎస్సీ ఉపకులాలతో సహా మాదిగలందరినీ పులి నోట్లో తలబెట్టమనడం ఎంత అన్యాయం? ఎస్సీ వర్గీకరణ న్యాయమైన డిమాండ్. దాని వల్ల డక్కలి, మాదిగ దాసరి, మాలదాసరి, చిందు, మాదిగ జంగం, డోలు డంబర్ల, బైండ్ల తదితర ఉపకులాలన్నింటినీ మాదిగలతో సహా కొంచమైనా న్యాయం జరుగుతుంది. ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కాశీం చెప్పన్న దాని ప్రకారం ఎస్సీ ఉపకులాల వారెవరూ అధ్యాపకులుగా ఉస్మానియా విశ్వవిద్యాలయం మెట్లు ఎక్కలేదు. ఎస్సీ వర్గీకరణ ఈ పాటికే జరిగి ఉంటే ఉన్నత విద్యలోనే కాదు వృత్తి విద్యా కోర్సుల్లోనూ వారికి సీట్లు దొరికేవి ఎందరో ఉపకులాల వారికి మేలు జరిగేది. గత తరమే కొత్త వెలుగులు చూసుండేది. కాని ఆ పని కాంగ్రెస్ చేయలేదు, బీజేపీ చేయలేదు. దొందూ దొందే. పదేళ్ల పాటు ప్రధానిగా ఉన్న మోదీకి ఏ దశలోనూ వర్గీకరణ అంశం కన్పించలేదు. హైదరాబాద్‌లో వేలాది మందిని మాదిగ విశ్వరూప సభకు తరలిస్తున్నప్పుడైనా ప్రభుత్వం ఒక నిర్ణయానికి రావాలి గదా? ప్రధాని ముందుగా మంత్రివర్గంలో మాట్లాడి ఒప్పించాలి. తన పార్టీ వేదికలపై చర్చించి వర్గీకరణకు సానుకూలతను సంపాదించాలి. మంత్రివర్గ సమావేశం జరపక తన పార్టీలో తగిన వేదిక నుండి స్పష్టమైన సంకేతం లేకుండానే ప్రధాని ఆషామాషీగా సభకు తరలొచ్చారు. ప్రధానికి వర్గీకరణ పై చిత్తశుద్ధి ఉంటే ఈ పాటికి ఆ కసరత్తు చేసేవారు. ఆ విషయం చెప్పి ఉండేవారు.

బీజేపీ పాలనలో దళితులపై పెరిగిన దాడులు

బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చాక దేశంలో దళితుల మీద దాడులు పెరిగాయి. దళిత మహిళలపై అవలీలగా అత్యాచారాలకు పాల్పడుతున్నారు. ప్రశ్నించడానికి వెళ్లిన వారి ప్రాణాలు హరిస్తున్నారు. దళితులపై జరుగుతున్న దాడుల మీద పార్లమెంట్‌లో సీపీఐ(ఎం) సభ్యులు కె.కె.రాకేశ్ వేసిన ప్రశ్నకు హోంశాఖ సహాయ మంత్రి సమాధానమిస్తూ శాంతి భద్రతల నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోనిది. అప్పటికి అలాంటి అకృత్యాలు జరగకుండా చూడమని ఎప్పటికప్పుడు మేము రాష్ట్ర ప్రభుత్వాలకు అడ్వైజరీలు రాస్తూనే ఉన్నామని సెలవిచ్చారు. దళితుల మీద దాడులు ఎక్కువగా ఎక్కడ జరుగుతున్నాయని చూస్తే వాటిలో ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్‌లు మొత్తం మీద మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. కేంద్రం పంపే అడ్వైజరీలను మరి ఆ రాష్ట్రాలు ఎందుకు ఖాతరు చేయలేదు. ఆ రెండు రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉంది. ఆ వరుసలో రాజస్థాన్ కూడా ఉంది. అక్కడ ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నా చాలాకాలం పాటు బీజేపీ ఆ రాష్ట్రాన్ని ఏలింది. ఫ్యూడల్ వ్యవస్థ ప్రబావం ఇంకా ఏ రాష్ట్రాల్లో ఎక్కువగా ఉందో ఆ రాష్ట్రాల్లో సామాజిక వివక్ష, అసహనం సహజంగానే ఎక్కువ మోతాదులో ఉంటాయి. ఫ్యూడల్ వ్యవస్థను రూపుమాపడంలో బీజేపీ, కాంగ్రెస్‌లు రెండింటికీ శ్రద్ధ లేదు. ఉత్తర ప్రదేశ్‌లో దళితులపై జరిగిన దౌర్జన్యాల్లో యూపీ ముందుండగా, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లు 2వ, 3వ స్థానంలో ఉన్నాయి. జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) తేల్చిన లెక్కలివి. దళితుల జనాభా అత్యధికంగా 31.94 శాతం పంజాబ్‌లో ఉన్నారు. అయినా దళితులపై జరిగే అత్యాచారాల్లో అది చివరి స్థానంలో ఉంది. సమాధానం సింపుల్. అక్కడ సిక్కు మతస్తుల సంఖ్య ఎక్కువ. ఎక్కడ హిందూ మత ఛాందసులు ఎక్కువ ఉంటారో అక్కడ దళితులపై దౌర్జన్యాలు ఎక్కువ.

దళితులపై జరిగిన దౌర్జన్యాల కేసుల దర్యాప్తు కూడా వేగంగా జరగదు కోర్టు విచారణకు రావు. విచారణకు వచ్చి కేసులపై తీర్పులు రావడం, శిక్షలు పడటం మరీ తక్కువ. 2021 నాటికి జాతీయ క్రైం రికార్డు బ్యూరో ప్రకారం దర్యాప్తు జరగాల్సిన ఎస్సీ కేసులు 70,818 కోర్టు విచారణతో ఉన్నవి 2,63,512 కేసులు, శిక్షలు పడిన కేసుల సంఖ్య 36 శాతం మాత్రమే 2018లో ఎస్సీ,ఎస్టీ చట్టాన్ని బలహీనపర్చారు. అయినప్పటికీ కేసుల పరిష్కారం ఒక సవాల్‌గానే ఉందని బ్యూరో పేర్కొంది.

బీజేపీకి అశ్వత్థామరెడ్డి రాజీనామా

• ఒంటరి అవుతున్న ఈటల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి బీజేపీకి గుడ్‌బై చెప్పేశారు. ఈటల వెంట నడుస్తున్న నేతలను బీజేపీలోని ఓ గ్రూపు పొమ్మనలేకనే పొగబెడుతున్నట్టు ప్రచారం జరుగుతున్నది. తనను నమ్ముకుని వచ్చిన నేతలు ఒక్కొక్కరుగా బీజేపీని వీడుతుండటంతో ఆ పార్టీలో ఈటల రాజేందర్ ఒంటరి వారవుతున్నారు. ఆయనకు అత్యంత సన్నిహితంగా ఉండి పార్టీని వీడిన వారి జాబితాలో తుల ఉమ, ఏనుగు రవీందర్‌రెడ్డి, అశ్వత్థామరెడ్డి, తదితరులున్నారు. వీరంతా ఆ పార్టీలో టికెట్లు ఆశించి భంగపడ్డవారే. వారికి టికెట్లు ఇప్పించుకోవడంలో ఈటల విఫలమయ్యారనే విమర్శలూ ఉన్నాయి. వేములవాడ సీటును తుల ఉమ బలంగా ఆశించారు. అధిష్టానం ఆమెకు సీటును కూడా కేటాయించింది. కానీ, జాతీయ స్థాయిలో కీలక నేతలు చక్రం తిప్పడంతో ఈటలకు మొండిచెయ్యే ఎదురైంది. దీంతో తుల ఉమ ఆ పార్టీకి రాంరాం చెప్పిన విషయం విదితమే. అశ్వత్థామరెడ్డికి కూడా బీజేపీ జాతీయ నాయకత్వం వనపర్తి సీటును కేటాయించింది. పోటీకి ఆయన సన్నద్ధం అయ్యారు. తీరా చివరి రోజు అక్కడ అభ్యర్థిని మారుస్తూ అనుగ్నరెడ్డికి ఇచ్చింది. ఆర్టీసీలో కార్మిక సంఘం నేతగా ఎదిగిన అశ్వత్థామరెడ్డికి ఇది పెద్ద అవమానమే. దీన్ని ఆయన జీర్ణించుకోలేకపోయారు. ఈ నేపథ్యంలోనే ఆయన బీజేపీకి గుడ్‌బై చెప్పేశారు. ఒకటెండ్రు రోజుల్లో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని వెల్లడించారు. ఈటలకు అనుకూలురే కాదు వ్యతిరేకులూ ఆయనపై విమర్శలు ఎక్కుపెడుతూ పార్టీకి దూరమయ్యారు. ఆ జాబితాలో రాజగోపాల్‌రెడ్డి, విజయశాంతి ఉన్నారు. పైకి బీజేపీ నేతలు గంభీరాలకు పోతున్నా నేతల మధ్య ప్రచ్ఛన్నయుద్ధం అంతర్గతంగా సాగుతున్నదనే చర్చ నడుస్తున్నది. అదే సమయంలో ఈటల రాజేందర్ చేరిక తర్వాతనే పార్టీ డీలాపడ్డదనీ ఆర్ఎస్ఎస్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న హార్డ్‌కోర్ కార్యకర్తలు విమర్శలు ఎక్కుపెడుతున్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినా సరేగానీ కాంగ్రెస్‌ను రానివ్వొద్దనే నిర్ణయానికి రావడం వల్లనే అభ్యర్థులను నిర్ణయించడంలో అనేక మార్పులు జరిగాయనే విమర్శ మొదటి నుంచీ బలంగా వినిపిస్తున్నది.

ఒక్క అవకాశం ఇచ్చి చూడండి వరంగల్ రూపు రేఖలే మారుస్తారు

• జనసేన అధినేత పవన్ కళ్యాణ్

నవతెలంగాణ-మట్టెవాడ

తెలంగాణలో జరుగుతున్న ఎన్నికల్లో బీజేపీ పార్టీతో పొత్తు పెట్టుకుని జనసేన పోటీలో ఉన్నదని వరంగల్ తూర్పు, పశ్చిమలో ఎర్రబెల్లి ప్రదీప్ రావు, పద్మలకు ఒక్క అవకాశం ఇచ్చి చూడాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వరంగల్ హంటర్ రోడ్‌లోని సీఎస్ఆర్ గార్డెన్స్ వద్ద నిర్వహించిన ఎన్నికల ప్రచారసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అవినీతిమయమైన ప్రభుత్వంతో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని, దొరల పాలనతో ప్రజలు బానిసలుగా బతుకుతున్నారని అన్నారు. జనసైనికులంతా ఏకపక్షంగా బీజేపీ గెలుపొందడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రదీప్‌రావు వ్యక్తిగతంగా చాలా సౌమ్యుడు అని, అవినీతికి దూరంగా, వివాద రహితుడిగా పేరుందని తెలిపారు. 2009 అసెంబ్లీ ఎన్నికల నుంచి తనని చూస్తున్నానని, ప్రజల్లో వారికి మంచి ఆదరణ ఉన్నదని, తూర్పు నియోజకవర్గంపై పూర్తి అవగాహన ఉన్న నాయకుడని తెలిపారు. వరంగల్ ఆడబిడ్డ రావు పద్మ మంచి వ్యక్తి అని తనకు అవకాశం కల్పించాలని కోరారు. అభ్యర్థులు ప్రదీప్ రావు, రావు పద్మ మాట్లాడుతూ.. బీజేపీ పట్ల ప్రధాని నరేంద్ర మోడీ పాలనపట్ల ప్రజలు ఆకర్షితులవుతున్నారన్నారు. ఈ సారి ఎన్నికల్లో సమిష్టిగా అందరం కలిసి తూర్పు, పశ్చిం నియోజకవర్గాల్లో కాషాయజెండా ఎగురవేద్దామని, అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోదామని పిలుపునిచ్చారు. ప్రజల కష్టాలు, సమస్యలు తెలిసిన తమను బీజేపీ అభ్యర్థులుగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	62,020	-	---
22 క్యారెట్లు	56,850	-	---
కిలో వెండి	79,000	▼	450



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 82
రిటైల్ (లైవ్)	రూ. 104
స్కిన్‌తో	రూ. 151
స్కిన్‌లెస్	రూ. 172

అత్తకు రూ.5 వేలు, కోడళ్లకు రూ.3 వేలు

పచ్చి రాజకీయ అవకాశవాది రాజగోపాల్‌రెడ్డిని ఓడించాలి

- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆగమాగం
- చౌటుప్పల్, కోదాడ రోడ్‌షోల్లో కేటీఆర్

నవతెలంగాణ-కోదాడరూరల్, చౌటుప్పల్

డబ్బు ప్రలోభాలతో ప్రజలను మోసం చేసేందుకు వచ్చిన పచ్చి రాజకీయ అవకాశవాదులు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులు కోమటిరెడ్డి బ్రదర్స్‌ను ఓడించాలని ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ పిలుపు నిచ్చారు. డిసెంబర్ 3 తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు అనంతరం 18 ఏండ్లు నిండిన ప్రతి మహిళకు సౌభాగ్య లక్ష్మి పథకం కింద.. కోడళ్ళకు రూ. 3000, ఆసరా పింఛన్ అందుకుంటున్న అత్తలకు రూ.5000 పెన్షన్ ఇవ్వబోతున్నట్టు తెలిపారు. బుధవారం సూర్యాపేట, యాద్రాద్రి జిల్లాలోని చౌటుప్పల్, కోదాడ పట్టణాల్లో నిర్వహించిన రోడ్ షోలలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ వల్లే కాళేశ్వరం నుంచి ఇక్కడికి నీళ్ల వస్తున్నాయని తెలిపారు. కోదాడలో బీజేపీకి అభ్యర్థి లేకనే జనసేనకు ఇచ్చారని ఎద్దేవా చేశారు. మోడీ ఆరోజు సిలిండర్‌కు మొక్కి ఓటు వేయాలని చెప్పిండని, అనంతరం మన నెత్తిమీద కూర్చుని రూ.600 సిలిండర్ రూ.1200 చేశాడని ఆరోపించారు. ఇక్కడ పాలిటెక్నిక్ కాలేజీ కూడా వస్తుందన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటేనే ఆకలి చావులు, ఆత్మహత్యలు అని అన్నారు.

ఏ పార్టీకి వ్యతిరేకంగా అయితే నందమూరి తారకరామారావు పార్టీ పెట్టారో ఇప్పుడు టీడీపీ వాళ్లు ఆ పార్టీకి ఓటేస్తారా అని ప్రశ్నించారు. 55 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో మునుగోడు ప్రజలకు ఫ్లోరిన్ నీరు తాగించారని, దాంతో వారి కాళ్లు, చేతులు వంకర్లు పోయి అనేక అనారోగ్యాలకు గురయ్యారన్నారు. చౌటుప్పల్ పట్టణంలో మిషన్ భగీరథ పైలాన్ ఏర్పాటుచేసి మంచినీరు అందించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ కష్టాలు వస్తాయన్నారు. ఇప్పుడు మళ్లీ ఛాన్స్ ఇస్తే ఎరువుల కోసం దుకాణాల ముందు క్యూలో నిలబడాలా, కరెంట్ కోసం అర్ధరాత్రి మళ్లీ పొలాల వద్దకు వెళ్లి పాములు, తేళ్లు కరిచి చనిపోవాలా అని ప్రశ్నించారు. కేవలం డబ్బుల కోసం రాజకీయాలు చేసి డబ్బులతోనే జనాలను కొనొచ్చని భావిస్తున్న కోమటిరెడ్డి బ్రదర్స్‌ను ఓడించి తగిన బుద్ధిచెప్పాలన్నారు.



కేరళ ఇండ్ల స్కీంపై కేంద్రం లొల్లి..

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం రాష్ట్రంలో నిరాశ్రయులైన ప్రజలకు గృహనిర్మాణం కల్పించేందుకు జీవనోపాధి చేరిక ఆర్థిక సాధికారత మిషన్ (లైఫ్)ను ప్రారంభించింది. రాష్ట్ర ప్రభుత్వం 2016 నుంచి 3,56,108 ఇండ్లను లబ్దిదారులకు అందజేయగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరో 1,41,257 ఇండ్లను పూర్తి చేయాల్సి ఉన్నది.

భూమి లేదా ఇల్లు లేని సుమారు 4.32 లక్షల మందికి గృహ సౌకర్యాలను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం లైఫ్ మిషన్ 2016, నవంబర్ 10న ప్రారంభించింది.

ఆ తర్వాత ప్రభుత్వం ఈ సంఖ్యను 4.72 లక్షలకు సవరించింది. కేరళ ప్రభుత్వం లైఫ్ మిషన్ కింద ఒక్కో ఇంటికి రూ.4 లక్షలు అందిస్తున్నది. పథకం కింద ఆమోదించబడిన ఇండ్లలో కొద్ది శాతం కేంద్ర నిధులు ఉంటాయి.

కేంద్ర, రాష్ట్ర వాటా ఇలా..

రాష్ట్ర మంత్రి ఎం.బి రాజేష్ ప్రకటన ప్రకారం.. కేంద్రం కేవలం 32,171 ఇండ్లకు రూ.72,000 చొప్పున మంజూరు చేయగా, 79,860 ఇండ్లకు రూ.1,50,000 చొప్పున మంజూరు చేసింది. మరోవైపు, రాష్ట్ర ప్రభుత్వం పీఎంఏవై పథకం కింద ఉన్న 32,171 ఇండ్లకు రూ.3,28,000 చొప్పున అందించగా, లైఫ్ మిషన్ కింద మిగిలిన 2,44,077 ఇండ్లకు రూ.4 లక్షల చొప్పున అందించింది. "లబ్దిదారుల కోరిక మేరకు ఇండ్లను డిజైన్ చేసుకునే హక్కును ఎల్డీఎఫ్ ప్రభుత్వం కల్పించింది. ప్రభుత్వ విరాళాలను బహిర్గతం చేసే లోగో లేదా గుర్తు లేకుండా వారు ఇతర వ్యక్తులలాగానే ఆత్మగౌరవంతో ఇంట్లో నివసించాలి" అని మంత్రి ప్రకటనలో పేర్కొన్నారు.

హౌసింగ్ స్కీమ్‌లో కేంద్రం జోక్యాన్ని వ్యతిరేకించాలని కేరళ ప్రజలకు విజ్ఞప్తి చేసిన మంత్రి.. స్వచ్ఛ్ భారత్‌తో సహా ప్రాజెక్టులకు కేంద్రం ఇలాంటి కో-బ్రాండింగ్ కార్యకలాపాలను విధిస్తున్నదని ఆరోపించారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం ఎక్కువ వాటా ఇస్తున్నదని గుర్తు చేశారు.

'ఫండ్ విడుదలకు ఆమోదయోగ్యం కాని షరతులు'

15వ ఆర్థిక సంఘం ప్రకారం గ్రాంట్‌ల పంపిణీలో జాప్యం, ఖర్చు చేయడానికి షరతులు విధించడం ఎల్ఎస్‌జీడీ ఎదుర్కొంటున్న మరో సమస్య. "కేంద్రం, ఆర్థిక సంఘం 2020-21 నుంచి ఖర్చుపై షరతులు విధించాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే గ్రాంట్లను స్థానిక సంస్థలు ఎలా ఖర్చు పెట్టాలో కూడా వారే నిర్దేశిస్తున్నారు" అని మంత్రి విమర్శించారు. ఆరు వేర్వేరు పథకాల కోసం గ్రాంట్‌ను వినియోగించుకోవడానికి దేశవ్యాప్తంగా నిబంధన విధించడం మాకు ఆమోదయోగ్యం కాదని మంత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఎస్‌జీకి రూ. 814 కోట్ల గ్రాంట్‌లను కేంద్రం నిలిపివేసిందని కేరళ సర్కారు విమర్శించింది. గ్రాంట్లు విడుదల చేయాలని నిరంతరం డిమాండ్ చేసిన తర్వాత, నవంబర్ 21 నాటికి రాష్ట్రానికి రూ. 252 కోట్లు వచ్చాయనీ, అయితే మూడింట రెండు వంతులకు పైగా గ్రాంట్లు విడుదల కాలేదని వివరించింది.

గొర్రెల కాపరులపై అటవీశాఖ అధికారి దాడి

నవతెలంగాణ-జన్నారం

గొర్రెల కాపరులపై అటవీశాఖ అధికారి దాడి చేసిన ఘటన మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలో జరిగింది. లింగయ్యపల్లె గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు జక్కుల మొగిలి, ఐలయ్య తమను బీట్ ఆఫీసర్ సతీష్ విచక్షణారహితంగా కొట్టారని బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గొర్రెల కాపరులు విలేకరులతో మాట్లాడుతూ.. రోజులాగే తాము గొర్రెలను తీసుకొని అడవికి వెళ్లామని, అక్కడ విధులు నిర్వర్తిస్తున్న బీట్ ఆఫీసర్ సతీష్ గొర్రెలను ఇక్కడికి ఎందుకు తీసుకొచ్చారని దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. గొర్రెల మందను తరమడంతో 20 గొర్రెలు తప్పిపోయినట్టు తెలిపారు.

బర్రెలక్క తమ్ముడిపై దాడికి సీపీఐ(ఎం) ఖండన

- ఆ కుటుంబానికి రక్షణ కల్పించాలి: తమ్మినేని డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కొల్లాపూర్ శాసనసభకు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన బర్రెలక్క (అలియాస్ శిరీష) ప్రచారం ముగించుకుని వెళ్తున్న సమయంలో ఆమె తమ్ముడిపై గుర్తు తెలియని వ్యక్తులు భౌతిక దాడికి పాల్పడటాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఖండించింది.

ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నామినేషన్ వేసినప్పటి నుంచి ఆమె కుటుంబ సభ్యులను ప్రలోభాలకు, వేధింపులకు, భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఒకవైపు మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అంటూనే, నిరుపేద దళిత అమ్మాయి రాజకీయంగా ముందుకొస్తే ఇలాంటి ఘటనలకు పాల్పడడం దారుణమని విమర్శించారు.

గతంలో నిరుద్యోగ అంశంపై సోషల్ మీడియాలో పోస్టు పెట్టినందుకు శిరీషపై కేసు పెట్టి కోర్టుల చుట్టూ ఇప్పటికీ తిప్పుతున్నారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల్లో పోటీచేసే హక్కును కాలరాయడం సరైంది కాదని తెలిపారు. ఈ దాడికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలనీ, శిరీష కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

30న సింగరేణిలో ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవివ్వాలి

సీఈవోకు సీపీఐ(ఎం) మాజీ ఎమ్మెల్యే నంద్యాల లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఈనెల 30న సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ వేతనంతో కూడిన సెలవును ప్రకటించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి కోరారు. ఈ మేరకు ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) వికాస్‌రాజ్‌కు బుధవారం ఆయన లేఖ రాశారు.

రాష్ట్రంలో భారీ ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి హైదరాబాద్‌లోని కార్పొరేట్ కార్యాలయంతో సహా ఆరు జిల్లాలకు విస్తరించి ఉందని వివరించారు. ఇందులో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు వేలాది మంది పనిచేస్తున్నారని తెలిపారు. ఈనెల 30న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ రంగ, ప్రయివేటు సంస్థల ఉద్యోగులందరికీ వేతనంతో కూడిన సెలవును ప్రకటించారని గుర్తు చేశారు. కానీ సింగరేణి యాజమాన్యం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఓటింగ్‌లో పాల్గొనేందుకు సెలవును మంజూరు చేయడం లేదని తెలిపారు. ఈ అంశంపై జోక్యం చేసుకుని సింగరేణి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఈనెల 30న వేతనంతో కూడిన సెలవును మంజూరు చేసేలా ఆ యాజమాన్యానికి తగు ఆదేశాలివ్వాలని కోరారు.

మావోయిస్టులు పెట్టిన.. మందుపాతర పేలి గిరిజనుడికి గాయాలు

నవతెలంగాణ-చర్ల

పోలీసులను లక్ష్యంగా చేసుకొని మావోయిస్టులు అమర్చిన ఐఈడీ మందు పాతర పేలి గిరిజనుడికి తీవ్ర గాయాలైన ఘటన ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా, పామేడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మవరం గ్రామానికి చెందిన సబ్కా చంద్రయ్య మంగళవారం ఉదయం చేపలు పట్టడానికి వెళుతుండగా పోలీసులను లక్ష్యంగా చేసుకొని మావోయిస్టులు అమర్చిన ఐఈడీ మందు పాతర పేలడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన గ్రామస్తులు చంద్రయ్యను జెట్టీలో తీసుకొని వెళుతుండగా 204 కోబ్రా, 151 సీఆర్పీఎఫ్ బెటాలియన్ సిబ్బంది గమనించి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. పామేడు ఫీల్డ్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.



అక్కడ అతనికి డాక్టర్ తరుణ్ మాలిక్ చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం భద్రాచలం తరలించారు. చంద్రయ్య కుడి కాలును తొలగించారు. ప్రస్తుతం బాధితుడు చికిత్స పొందుతున్నాడు.

బీఆర్ఎస్ పాలన పోతేనే నిరుద్యోగులకు న్యాయం

ప్రొఫెసర్ పీ.ఎల్.విశ్వేశ్వర్ రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలన పోతేనే నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందని టీజేఎస్ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ పీ.ఎల్.విశ్వేశ్వర్ రావు తెలిపారు. బుధవారం హైదరాబాద్ సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయతో పాటు నిరుద్యోగ చైతన్య యాత్ర కో ఆర్డినేటర్లు మాసంపల్లి అరుణ్ కుమార్, సయ్యద్ సలీమ్ పాషా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్ రావు మాట్లాడుతూ దేశంలోనే తెలంగాణలో అత్యధిక నిరుద్యోగం ఉందని విమర్శించారు. టీయస్‌పీఎస్సీ నిర్వహించిన పరీక్షల్లో పత్రాలు లీక్ కాలేదనీ, అమ్ముకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనర్హులతో పబ్లిక్ కమిషన్‌ను నింపారని తెలిపారు. రాష్ట్రంలో బాధ్యాతాయుతమైన ప్రభుత్వం లేదని దుయ్యబట్టారు. మాసంపల్లి అరుణ్ కుమార్ మాట్లాడుతూ తొమ్మిదేండ్లలో జాబ్ క్యాలెండర్ ప్రకటించలేదనీ, నిరుద్యోగ భృతి ఇవ్వలేదనీ, కేవలం ఎన్నికల కోసం మళ్లీ జాబ్ క్యాలెండర్ అంటూ కేటీఆర్ నిరుద్యోగులను మోసం చేస్తున్నారని విమర్శించారు. గత ఎన్నికల ముందు 2017లోనూ కేటీఆర్ ఇవే మాటలు చెప్పి అమలు చేయలేదని గుర్తుచేశారు. కేసీఆర్, కేటీఆర్‌లను నిరుద్యోగులను నమ్మే ప్రసక్తే లేదనీ, కాంగ్రెస్ ను గెలిపిస్తారని తెలిపారు. 200 మందికి పైగా నిరుద్యోగులు మరణిస్తే, ఆత్మహత్యలు చేసుకుంటే పరామర్శించని వారికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సయ్యద్ సలీం పాషా మాట్లాడుతూ జాబ్ క్యాలెండర్, 2 లక్షల ఉద్యోగాల భర్తీ హామీ ఇచ్చిన కాంగ్రెస్‌కు నిరుద్యోగులు ఆకర్షితులయ్యారని తెలిపారు. దీంతో హడావుడీగా కేటీఆర్ నిరుద్యోగుల కాళ్ల దగ్గర సాగిలపడినట్టు డ్రామాలు మొదలెట్టారని విమర్శించారు. ఖాళీలను భర్తీ చేయలేని అసమర్థ బీఆర్ఎస్ పార్టీని ఓడిస్తామని హెచ్చరించారు. నిరుద్యోగి వెంకటరెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగులు కానీ వారితో ముచ్చట్లు పెట్టి నిరుద్యోగులతో ఇంటరాక్ట్ అయినట్టు కేటీఆర్ అబద్ధపు ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. నిరుద్యోగులు అశోక్ నగర్, చిక్కడపల్లి లైబ్రరీ, ఒయు తదితర యూనివర్సిటీల్లో ఉన్నారని తెలిపారు. నిజంగా కేటీఆర్‌కు దమ్ముంటే అక్కడికి రావాలని నాయకులు సవాల్ చేశారు.



ప్రభుత్వ మెడికల్ కాలేజీకి.. కొంగర రోహిత్ భౌతికకాయం అప్పగింత

బాధను దిగమింగి.. వైద్య విద్యార్థుల కోసం భౌతికకాయం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మాధవ్‌నగర్‌కు చెందిన సీనియర్ జర్నలిస్టు, పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు కొంగర శ్రీనివాస్‌రావు, నీరజ దంపతుల కుమారుడు కొంగర రోహిత్ (33) అనారోగ్యంతో ప్రగతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. దాంతో కొంగర రోహిత్ భౌతిక కాయాన్ని వారి తల్లిదండ్రులు బుధవారం ఉదయం ప్రభుత్వ మెడికల్ కాలేజీ విద్యార్థులకు పరిశోధన నిమిత్తం అందజేశారు. యుక్త వయసులోనే కొడుకు చనిపోయినా.. ఆ బాధను దిగమింగి, కొడుకు నేత్రాలను దానం చేయడమే కాకుండా, మొత్తం భౌతికకాయాన్ని వైద్య విద్యార్థుల ప్రయోగాల కోసం అప్పగించడం అత్యంత ఆదర్శవంతమైన విషయమని పలువురు కొనియాడారు. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, న్యూడెమోక్రసీ పార్టీల నాయకులే ఇప్పటివరకు ప్రభుత్వ మెడికల్ కాలేజీకి 16 వరకు భౌతిక కాయాలు అందించారని మెడికల్ కాలేజీ డీన్ డాక్టర్ సుధాకర్‌రావు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ప్రక్రియ సమాజానికి ముఖ్యంగా వైద్య విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమన్నారు. కొంగర రోహిత్ భౌతికకాయానికి సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, న్యూడెమోక్రసీ, సీపీఐ తదితర పార్టీల నాయకులు నివాళులర్పించారు. అలాగే మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణరావు, వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు వనమాల కృష్ణ, వి.ప్రభాకర్, ఆకుల పాపయ్య, కంజర భూమన్న, ఆల్గోట్ రవీందర్, దాసు, పి.శ్రీధర్, ఎం.సుధాకర్, రామ్మోహన్ రావు, నర్రా రామారావు, నర్సింలు, రామకృష్ణ నివాళులర్పించారు.



నిర్మలా సీతారామన్ మాట్లాడింది వాస్తవమే

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రైతుల నుంచి కరెంటు బిల్లులు వసూలు చేయాలని బీజేపీ ఎక్కడా చెప్పలేదనీ, కంపెనీలు, దొంగతనంగా వాడుకునే కరెంటు అంతా రైతుల ఖాతాలో పడుతుంది కాబట్టే పారదర్శకత కోసం మీటర్లు పెట్టాలని చెప్పామని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి చెప్పారు. బీజేపీ అధికారంలోకి వచ్చినా ఉచిత కరెంట్‌నే ఇస్తామన్నారు.

ఈ విషయంపై నిర్మలా సీతారామన్ మాట్లాడింది ముమ్మాటికీ వాస్తవమేనన్నారు. మహిళా మంత్రి పట్టుకుని సిగ్గుందా అని మాట్లాడటం సీఎం కేసీఆర్‌కు తగదని హితవు పలికారు. బుధవారం హైదరాబాద్‌లోని హోటల్ కత్రియాలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 25, 26, 27 తేదీల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తెలంగాణలో పర్యటిస్తారని తెలిపారు. రాష్ట్రంలో బీజేపీకి సానుకూల వాతావరణం ఏర్పడిందన్నారు. బీసీ, ఎస్సీ సంఘాలు తమకు మద్దతు తెలుపుతున్నాయన్నారు. బీసీ సీఎంను చేసే దమ్ము ధైర్యం కాంగ్రెస్‌కు, దళితున్ని సీఎం చేసే దమ్ము కేసీఆర్‌కు ఉందా అని ప్రశ్నించారు. మెడికల్ కాలేజీల కోసం కేసీఆర్ కేంద్రానికి లేఖలే రాయలేదనీ, రాస్తే లేఖలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.రీజినల్ రింగ్ రోడ్డు ఎందుకు ఆలస్యమవుతున్నదని ప్రశ్నించారు. తొమ్మిదేండ్లలో కేంద్రం తెలంగాణకు తొమ్మిది లక్షల కోట్ల రూపాయలను ఇచ్చిందని చెప్పారు. మూడో తేదీ వరకు రైతులు వడ్లను అమ్ముకోవద్దనీ, తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వరి కనీస ధర రూ.3,100 ఇస్తామని చెప్పారు.



కర్నాటక ప్రజలకు కాంగ్రెస్ మోసం : యడ్యూరప్ప


కర్నాటక ప్రజలను ఐదు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప విమర్శించారు. బుధవారం హోటల్ కత్రియాలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని చెప్పారు. రాష్ట్రాన్ని దివాళా తీయిస్తున్నదన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. తెలంగాణలో ఇప్పుడు ఆరు గ్యారెంటీలతో మరోమారు మోసం చేయడానికి వస్తున్నదని విమర్శించారు.

ఓవైసీ దురుసుగా ప్రవర్తించారు

ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ..విధుల్లో ఉన్న పోలీసు అధికారిపై అక్బరుద్దీన్ ఓవైసీ దురుసుగా ప్రవర్తించారని విమర్శించారు. దారుసలాం నుంచి అనుమతి పొందితే తప్ప పాతబస్తీలో తిరిగే పరిస్థితి లేదనీ, ఎవరైనా వెళ్తే భౌతిక దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు మజ్లిస్‌కు తొత్తుగా వ్యవహరించడం వల్లనే ఈ పరిస్థితి వచ్చిందన్నారు.

డాక్టర్ కె. లక్ష్మణ్

ప్రచారంలో ఉద్రిక్తత



ఎడవల్లిలో ఆ మూడు పార్టీల లీడర్ల వాగ్వావాదం

బీఆర్ఎస్ నాయకులతో కాంగ్రెస్, బీజేపీ నేతల ఘర్షణ

పోలీసులు నచ్చజెప్పినా వినకపోవడంతో లాఠీచార్జి

నవతెలంగాణ-ఎడపల్లి/బోధన్

ఎన్నికల ప్రచారంలో భాగంగా బోధన్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి మహమ్మద్ షకీల్‌కు ఎదురు దెబ్బ తగిలింది. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని అంబం(వై), ఏఆర్పీ క్యాంప్, బ్రాహ్మణపల్లి, జైతాపూర్ గ్రామాల్లో ఆయన బుధవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 'తమ గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండా ఎన్నికల ప్రచారానికి ఎందుకు వచ్చారని పలువురు గ్రామస్తులు ఎమ్మెల్యేను నిలదీసేందుకు వెళ్తుండగా.. స్థానిక బీఆర్ఎస్ నాయకులు వారిని అడ్డుకున్నారు. అలాగే కాంగ్రెస్, బీజేపీ నాయకులు సైతం ఎమ్మెల్యే ప్రచారాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. తమ గ్రామాల్లో రెండు పడక గదులు లేక అనేకమంది పేదలు అద్దె ఇండ్లల్లో నివాసం ఉంటున్నారని మండిపడ్డారు. జైతాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ నాయకులతో వాగ్వాదానికి దిగారు. దాంతో మండలంలోని సాటాపూర్ గేట్ వద్ద జైతాపూర్, ఏఆర్పీక్యాంపు, వడ్డెపల్లి గ్రామాల కాంగ్రెస్, బీజేపీ నాయకులు.. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులపై ఘర్షణకు దిగారు. దాంతో పోలీసులు అక్కడికి చేరుకుని నచ్చజెప్పినా వినకపోవడంతో స్వల్ప లాఠీచార్జి చేపట్టారు.

దాడులకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేయాలి : ఎమ్మెల్యే షకీల్

ఎడపల్లి మండలంలో ఏఆర్పీ క్యాంప్, జైతాపూర్, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన తనపై దాడిచేసేందుకు ప్రయత్నించిన కాంగ్రెస్, బీజేపీ నాయకులపై హత్యాయత్నం కేసులు నమోదు చేయాలని ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ నిజామాబాద్ పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా దాడి వివరాలు వెల్లడించారు. దాడులకు పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. తాము ఘర్షణ పడకుండా సామరస్యంగా వెళ్లిపోయిన కూడా తిరిగి సాటాపూర్ గేట్ వద్ద ఏకంగా బీఆర్ఎస్ కార్యకర్తలనే లక్ష్యంగా చేసుకుని బీజేపీ, కాంగ్రెస్ నాయకులు కొందరు దాడులు చేయడంతో పార్టీ కార్యకర్త మోసిన్ తలకు తీవ్రగాయాలయ్యాయన్నారు. పోలీసులు చర్యలు తీసుకోని యెడల కార్యకర్తలతో కలిసి నిరసన చేపడతామని తెలిపారు. అలాగే పూలదండలలో రాళ్లుపెట్టి విసరడంతో తాను ప్రమాదాన్ని గ్రహించి తృటిలో తప్పించుకున్నానని తెలిపారు. ఈ ఘటన దావానంలా వ్యాపించడంతో ప్రచారంలో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే ఇంటికి చేరుకున్నారు.

యువతకు బీఆర్ఎస్ వెన్నుపోటు

- ఎన్నికల్లో తిరుగుబాటు తప్పదు :

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రణదీప్‌సింగ్ సూర్జేవాలా

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



రాష్ట్ర యువతకు బీఆర్ఎస్ ఎన్నో హామీలిచ్చి చివరకు వెన్నుపోటు పొడిచిందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రణదీప్‌సింగ్ సూర్జేవాలా ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ సర్కారుపై తిరుగుబాటు చేస్తారని హెచ్చరించారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలు అజయ్ కుమార్, కుసుమ కుమార్, రమణి, షామా తదితరులతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకపోవడం, పేపర్ లీకేజీలతో యువత కలలు చెదిరి ఆత్మహత్యలకు పాల్పడ్డారని చెప్పారు. బీఆర్ఎస్ యువత జీవితాల్లో చీకటి నింపిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ భవిష్యత్తును దోచుకున్న కేసీఆర్ కమీషన్ మాఫియా రాజ్ అని ఎద్దేవా చేశారు. పదేండ్లలో లెక్కలేనన్ని అబద్ధపు వాగ్దానాలు, వెన్నుపోటు పొడిచిందన్నారు. యువత కలలు, ఆకాంక్షలను కేసీఆర్ ప్రభుత్వం అణచివేసిందన్నారు. ఉద్యమ సమయంలో సీఎం కేసీఆర్ 'ప్రతి ఇంటికి ఒక ఉద్యోగం' అంటూ యువతకు కేసీఆర్ అబద్ధాలు చెప్పారని తెలిపారు. 40 లక్షల మంది తెలంగాణ నిరుద్యోగ యువతకు బీఆర్ఎస్ పాలన ప్రతికూలంగా మారిందన్నారు. ఐటీఐఆర్ ప్రాజెక్టు, బయ్యారం ఉక్కు కర్మాగారం, గిరిజన విశ్వవిద్యాలయం ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదన్నారు. బీఆర్ఎస్, బీజేపీ అనుబంధంతో యువతను మోసం చేసిందన్నారు. 2014-2021లో రాష్ట్రంలో 3,600 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేపదే పరీక్షలను వాయిదా వేయడం, అవకతవకల కారణంగా మర్రి ప్రవల్లికతోపాటు ఎంతో మంది యువతీ, యువకులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పోస్టల్ బ్యాలెట్లు మొత్తం రాలే...

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఎన్నికల సంఘం ఆమోదించిన పోస్టల్ బ్యాలెట్లలో 50 శాతం కూడా రిటర్నింగ్ అధికారులకు తిరిగి అందలేదు. సాధ్యమైనంత త్వరగా వాటిని అందచేయాలని ఎన్నికల సంఘం అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో 29,267 పోస్టల్ బ్యాలెట్లకు అనుమతి లభించింది. వాటిలో మంగళవారంనాటికి 9,174 పోస్టల్ బ్యాలెట్లు రిటర్నింగ్ అధికారులకు అందాయి. 80 ఏండ్లు పైబడిన వృద్ధుల కోసం 80 ప్లస్ ఫాం ద్వారా 17,105 పోస్టల్ బ్యాలెట్లకు అనుమతి లభించగా, వాటిలో 6,226 బ్యాలెట్లు మాత్రమే అందాయి. దివ్యాంగుల పోస్టల్ బ్యాలెట్లు 9,964 ఆమోదం పొందగా, 2,884 మాత్రమే అందాయి. ఎస్మా పరిధిలో పనిచేస్తున్న వారికి 2,198 పోస్టల్ బ్యాలెట్లకు అనుమతి లభించగా, వాటిలో 64 మాత్రమే అందాయని ఎన్నికల సంఘం తెలిపింది. అలాగే ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన (ఎమ్‌సీసీ) కింద అక్టోబర్ 10వ తేదీ నుంచి నవంబర్ 20 వరకు 777 ఫిర్యాదులు అందాయని వివరించారు. తనిఖీల ద్వారా స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ రూ.657.60 కోట్లకు పెరిగింది. గడచిన 24 గంటల్లో రూ.18.06 కోట్ల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

అక్టోబర్ నెల వేతనాలు చెల్లించాలి

- తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ ,

హెల్పర్స్ యూనియన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అంగన్ వాడీ ఉద్యోగులకు అక్టోబర్ నెల వేతనాలు రాని జిల్లాలకు తక్షణమే చెల్లించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ , హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కె.సునీత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి, రాష్ట్ర కోశాధికారి పి.మంగ ఒక ప్రకటన విడుదల చేశారు. ములుగు, వనపర్తి, యాదాద్రి భువనగిరి తదితర జిల్లాలకు అక్టోబర్ నెల వేతనాలు రాకపోవడంతో ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెలా 14వ తేదీన అంగన్ వాడీ ఉద్యోగులందరికీ ఒకేసారి వేతనాలు చెల్లిస్తామని గతంలో ప్రభుత్వం చెప్పిందని వారు గుర్తుచేశారు. తక్షణమే వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కమిషనర్‌కు వారు విజ్ఞప్తి చేశారు.

నరసింహన్‌తో తమిళిసై భేటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర గవర్నర్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ గవర్నర్ ఈ.ఎస్.ఎల్.నరసింహన్‌తో భేటీ అయ్యారు. బుధవారం హైదరాబాద్‌లోని ఐటీసీ గ్రాండ్ కాకతీయ హోటల్‌లో వారు మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు.

కాంగ్రెస్‌లో చేరిన దివ్యవాణి

- అనివార్య కారణాలతోనే టీడీపీ

నుంచి బయటకు వచ్చానని వెల్లడి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అనివార్య కారణాలతోనే టీడీపీ నుంచి బయటకు వచ్చినట్టు సినీ నటి దివ్యవాణి తెలిపారు. విజన్ కలిగిన టీడీపీ అధినేత చంద్రబాబు దగ్గర గతంలో పని చేయడం ఆనందంగా వుందన్నారు. నీతి, నిజాయితీగా ప్రజలకోసం పని చేస్తున్న కాంగ్రెస్‌లో పనిచేయాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు.బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో దివ్యవాణి కాంగ్రెస్‌లో చేరారు. ఆమెకు మాణిక్‌రావు ఠాక్రే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పేదవాడు బాగుపడాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. బంగారు తెలంగాణ కావాలంటే నియంత పాలకులను ఓడించి కాంగ్రెస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యకర్తగా తనకు ఏ పని అప్పగించినా బాధ్యతగా పని చేస్తానన్నారు.

యాదాద్రి పునర్నిర్మాణంపై

సిట్టింగ్ జడ్జితో విచారించాలి

- హిందూ ఏక్తా ఆందోళన్

పార్టీ అధ్యక్షులు హరక్ బహదూర్ ఛత్రి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం పునర్నిర్మాణం ప్రక్రియపై హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో సమగ్ర విచారణ చేయించాలని హిందూ ఏక్తా ఆందోళన్ పార్టీ అధ్యక్షులు హరక్ బహదూర్ ఛత్రి డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవాలయంలోని మూలవిరాట్ పురాతన విగ్రహం ఏమైందనీ, స్వయంభూ దేవాలయాన్ని 12 ఫీట్ల లోతుకు తవ్వాల్సిన అసవరమేమి వచ్చిందని ప్రశ్నించారు. తవ్వకాల్లో విలువైన నిధి బాంఢాగారం లభించిందనీ, దాన్ని అన్యాక్రాంతం చేశారనే అనుమానాలున్నాయని చెప్పారు. పునర్నిర్మాణం పేరుతో ఆలయం చారిత్రిక ప్రతిష్టను దెబ్బతీశారని విమర్శించారు. వైష్ణవ దివ్యక్షేత్రాన్ని టెంక్లాయిగా ఎలా మారుస్తారని నిలదీశారు. ప్రధాన ఆలయంలో అళ్వార్ల మూర్తులను ఎందుకు ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. పురాతన విగ్రహం ఆలయ గర్భగుడిలో లేదని అఖిల భారతీయ హిందూ మహాసభ అధ్యక్షులు రవిరంజన్ సింగ్ యాదగిరిగుట్ట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని విమర్శించారు. మూల విరాట్ విగ్రహం మాయంపై నిజనిర్ధారణ కమిటీ వేసి త్వరలోనే నివేదిక సమర్పిస్తామని చెప్పారు. సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు, నాయకులు ప్రభాకర్ రెడ్డి, ప్రతాప్ సింగ్ బిజిలి, కె. మహేశ్వర రావు పాల్గొన్నారు.

కెనడా పౌరులకు ఇ-వీసా పునరుద్ధరణ

న్యూఢిల్లీ : కెనడా పౌరులకు ఇ-వీసా సేవలను భారత్ బుధవారం పునరుద్ధరించింది. బ్రిటీష్ కొలంబియాలో జూన్ 18న ఖలిస్తాన్ నాయకుడు హర్దీప్ సింగ్ నిజ్జార్‌ను హత్య చేసిన ఘటనలో భారత ఏజెంట్ల పాత్ర వుందంటూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడెయు వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో కెనడా పౌరులందరికీ అన్ని వీసా సదుపాయాలను భారత్ రద్దు చేసింది. అది జరిగిన రెండు మాసాల తర్వాత ఇ-వీసా సర్వీసుల పునరుద్ధరణ నిర్ణయం వెలువడింది. కెనడా జాతీయుల చేతిలో భారత అధికారుల ప్రాణాలకు ప్రమాదం వుందని పేర్కొంటూ కెనడాలోని అన్ని భారత రాయబార కార్యాలయాల్లో వీసా సేవలను భారత్ నిలిపివేసింది. దీంతో తృతీయ దేశాల్లో భారత రాయబార కార్యాలయాల ద్వారా భారత వీసాల కోసం కెనడా జాతీయులు దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చింది.

అర్జెంటీనా భవితవ్యం!

బ్యూనస్ ఎయిర్స్ : మితవాది, తనకు తాను స్వేచ్ఛావాదిగా చెప్పుకునే జేవియర్ మిలే అర్జెంటీనా అధ్యక్షుడిగా ఈ నెల 19న ఎన్నికయ్యారు. అధ్యక్షుడుగా ఎన్నికైనందుకు మిలేతో పాటు సంబరపడిన మరో వ్యక్తి అమెరికా రాయబారి మార్క్ స్టాన్లీ. అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన మిలేను అభినందిస్తూ మొట్ట మొదట ట్వీట్ చేసింది ఆయనే. మానవ హక్కుల పరిరక్షణ, ప్రజాస్వామ్యం, వాతావరణ మార్పులపై పోరాటం వంటి వాటిలో కలిసి పనిచేస్తామని పేర్కొ న్నారు. అయితే ఈ రంగాల్లో ఏ ఒక్కటీ ఎవరికీ కొద్దిగా కూడా ప్రయోజనం కలిగించే రంగం కాదు. అర్జెంటీనాలో వున్న అతిపెద్ద లిథియం నిల్వలపై అమెరికా కన్ను పడింది. ఇప్పటివరకు ఈ లిథియం నిల్వలపై వివిధ స్థాయిల్లో ప్రభుత్వ నియంత్రణ వుంది. ప్రభుత్వ రంగంలో వున్న చమురు కంపెనీ వైపిఎఫ్‌ను ప్రైవేటీకరిస్తామని ఇప్పటికే మిలే హామీ ఇచ్చారు. స్థానికంగా వ్యక్తమయ్యే వ్యతిరేకతను తోసిరాజని లిథియం గనులపై హక్కులను విదేశీ పెట్టుబడిదారులకు అప్పగించాలని చూస్తు న్నాడు. తాననుకుంటున్న నయా ఉదారవాద విధానాలను అమలు చేసేందుకు మిలేకి రాజ కీయ మద్దతు అవ సరం. కానీ ఎన్ని కల ప్రచారంలో వారిని మిలే పూర్తి గా నిర్లక్ష్యం చేశారు. కమ్యూని స్టులపైనందుకు చైనా లేదా బ్రెజిల్‌తో వాణిజ్యం చేసేది లేద న్నారు.. అర్జెంటీనాకు ఈ రెండు దేశాలు ప్రధాన వాణిజ్య భాగ స్వాములుగా వున్నాయి. పైగా చై నా ప్రధాన రుణదాతగా కూడా వుం ది. ఆ విషయాన్ని మరచి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

బీఆర్ఎస్ పాలనలో మద్యానికి బానిసలై ఇరవై వేల మంది బలి

మహిళా కాంగ్రెస్ జాతీయ నేత నెట్టా డిసౌజ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ పాలనతో మద్యానికి బానిసలై ఇరవైవేల మంది చనిపోయారని మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు నెట్టా డిసౌజ ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ తెలంగాణలో ప్రజలను తాగుబోతులుగా మారుస్తుందన్నారు. లిక్కర్ ఆదాయం మీదనే తెలంగాణ రాష్ట్రం నడుస్తుందన్నారు. లిక్కర్ ఆదాయం రూ. 36 వేల కోట్లకు పెరిగిపోయిందన్నారు. 2014 నుంచి 2021 వరకు నేరాలు 47 శాతానికి పెరిగాయన్నారు. బీజేపీ ప్రభుత్వం బేటీ పడావో బేటి బచావో అంటూనే మహిళలకు రక్షణ లేకుండా చేస్తుంది. తెలంగాణలో మహిళలకు భద్రత లేకుండా పోయిందన్నారు. తెలంగాణలో బెల్ట్ షాపులను పెరిగిపోయాయని చెప్పారు. మహిళలపై జరుగుతున్న దాడుల విషయంలో దక్షిణ భారతదేశంలో తెలంగాణ నెంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. బెల్ట్ షాపులకు వ్యతిరేకంగా రాష్ట్రంలో ఆదివాసీ మహిళలు ఇతర మహిళా సంఘాలుపోరాడుతూనే ఉన్నాయి. మహిళలకు మంత్రివర్గంలో స్థానం కల్పించకుండా కేసీఆర్ అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో ఇంకా 42 శాతం మహిళలు నిరక్షరాస్యతలో ఉన్నారు. మహిళా సాధికారతలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. అంగన్వాడీలకు రాష్ట్రంలో సరైన వసతులు, టాయిలెట్లు లేవన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మహాలక్ష్మీ పథకం ద్వారా నెలకు రూ. 2500 సాయంతో పాటు రూ. 500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామన్నారు. బెల్ట్ షాపులను పూర్తిగా రద్దు చేస్తామన్నారు. చిన్న పిల్లలకు మద్యం అనుమతించబోమని తెలిపారు. ప్రతి జిల్లాకు రిహాబిలిటేషన్ సెంటర్‌ను తీసుకొస్తామన్నారు. ఆడబిడ్డలకు పెళ్ళికి లక్షతో పాటు 10 గ్రాముల బంగారం అందజేస్తామన్నారు. కాలేజీకి వెళ్లే అమ్మాయిలకు ఎలక్ట్రానిక్ స్కూటర్లను అందిస్తామన్నారు.

మూడ్రోజులు ప్రధాని మోడీ ఇక్కడే

25,26,27 తేదీల్లో ఎన్నికల ప్రచార సభలు

హైదరాబాద్‌లో రోడ్ షో

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఈ నెల 25,26,27 తేదీల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. ఈ మేరకు పర్యటన షెడ్యూల్‌ను బీజేపీ ప్రకటించింది. ఈ నెల 25న మధ్యాహ్నం 1:25 గంటలకు దుండిగల్ విమానాశ్రయానికి మోడీ చేరుకుంటారు. అక్కడ నుంచి కామారెడ్డికి వెళ్లి మధ్యాహ్నం 2:15 నుంచి 2:55 వరకు సభలో పాల్గొంటారు. ఆ తర్వాత సాయంత్రం 4:05 గంటలకు రంగారెడ్డి జిల్లాలో జరిగే బహిరంగ సభకు హాజరవుతారు. ఆ సభ అయిపోయిన తర్వాత రాత్రి 7:35 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో రాజ్‌భవన్‌కు చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు. 26న ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 12:45 వరకు కన్హయ్య శాంతివనంలో జరిగే ఒక కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ తర్వాత మధ్యాహ్నం 2:15 నుంచి 2:45 వరకు దుబ్బాక, 3:45 నుంచి సాయంత్రం 4:25 వరకు నిర్మల్ బహిరంగ సభలకు హాజరవుతారు. అక్కడి నుంచి దుండిగల్ విమానాశ్రయానికి చేరుకుని సాయంత్రం 5:45 గంటలకు తిరుపతికి వెళ్తారు. 27న ఉదయం ఉదయం 11:30 గంటలకు హకీంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి మహబూబాబాద్ చేరుకుని మధ్యాహ్నం 12:45 నుంచి 1:25 వరకు నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారు. ఆ సభ అనంతరం నేరుగా కరీంనగర్‌లో 2:45 గంటల నుంచి 3:25 వరకు జరిగే బహిరంగ సభలో పాల్గొని మాట్లాడుతారు. సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు హైదరాబాద్‌లో నిర్వహించే రోడ్ షోలో మోడీ పాల్గొంటారు. రోడ్ షో తర్వాత సాయంత్రం 6:25 గంటలకు తిరిగి ఢిల్లీకి బయలు దేరుతారు.



యువ క్రికెటర్లకు పరీక్ష

నేడు ఆస్ట్రేలియాతో తొలి టి20
రాత్రి 7.00గం॥ల నుంచి

విశాఖపట్నం: ఐసిసి వన్డే ప్రపంచకప్ విజేత ఆస్ట్రేలియాతో టి20 సమరానికి టీమిండియా సిద్ధమైంది. వన్డే ప్రపంచకప్‌లో ఆడిన సూర్యకుమార్, ఇషాన్ మినహా.. మిగిలిన క్రికెటర్లందరూ విశ్రాంతి కోరుకోవడంతో యువ క్రికెటర్లతో ఆసీస్‌తో పోరుకు టీమిండియా సిద్ధమైంది. అలాగే కోచ్ రాహుల్ ద్రావిడ్ కూడా ఈ సిరీస్‌కు దూరంగా ఉండడంతో వివిఎస్ లక్ష్మణ్ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. ఇక మిస్టర్ 360 డిగ్రీస్‌కు తొలిసారి భారత పగ్గాలు దక్కాయి. ప్రపంచకప్‌లో నిరాశపరిచిన సూర్యకుమార్‌తో పాటు ఒక్క మ్యాచ్‌లోనూ చోటు దక్కని ఇషాన్ కిషన్ ఈ మ్యాచ్‌లో బ్యాట్ ఝుళిపించాల్సిన అవసరమెంతైనా ఉంది. మరోవైపు యువ క్రికెటర్లు జైస్వాల్, తిలక్ వర్మ, రింకూ సింగ్, బిష్ణోయ్ తదితర ఆటగాళ్లకు ఈ సిరీస్ ఓ సవాలుతో కూడుకున్నది. మరోవైపు ఆస్ట్రేలియా జట్టు వన్డే ప్రపంచకప్‌ను నెగ్గిన ఉత్సాహంతో బరిలోకి దిగుతోంది. కెప్టెన్ కమిన్స్, స్టార్క్, లబూషేన్, వార్నర్, మార్ష్ వన్డే ప్రపంచకప్ ముగిసాయ స్వదేశానికి తిరిగి వెళ్లారు. మిగిలిన ఆటగాళ్ళతో ఆ జట్టు టి20 సిరీస్‌కు సిద్ధమౌతోంది. ఇక ఆసీస్ సీనియర్ వికెట్ కీపర్, బ్యాటర్ మాధ్యూ హెడ్ ఈ సిరీస్‌కు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఇరుజట్ల మధ్య ఐదు టి20ల సిరీస్‌లో భాగంగా తొలి టి20 విశాఖపట్నంలోని ఎసిఏ-విడిసిఏ క్రికెట్ అకాడమీలో జరగనుంది.

దక్షిణాఫ్రికా సిరీస్‌కు హార్దిక్ దూరం

టీమిండియా స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా ఇంకా గాయం నుంచి పూర్తిగా కోలుకోలేదు. వన్డే ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్‌తో మ్యాచ్ సందర్భంగా గాయపడ్డ హార్దిక్.. గురువారం నుంచి ఆస్ట్రేలియాతో జరిగే టి20 సిరీస్‌తో పాటు సౌతాఫ్రికా టూర్‌కు దూరంగా ఉండనున్నాడు. దీంతో అతడు ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్)లోనే తిరిగి బ్యాట్ పట్టనున్నట్లు సమాచారం. భారత జట్టు ఆసీస్‌తో టి20 సిరీస్ ముగిసిన తర్వాత దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లనుంది. ఆ తర్వాత జనవరిలో స్వదేశంలో అఫ్గాన్‌తో మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్.. ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆడనుండగా.. ఆ సిరీస్‌లకు అతడు అందుబాటులో ఉంటాడా? లేదా? అనేది సందేహాస్పదమే. పాండ్యాకు మరింత విశ్రాంతి అవసరమని, వచ్చే ఏడాది జూన్‌లో భారత జట్టు టీ20 వరల్డ్ కప్‌కు సిద్ధమవుతున్న నేపథ్యంలో పాండ్యాను మధ్యలో ఆడించి గాయాన్ని పెద్దది చేసేదానికంటే ప్రస్తుతానికి అతడికి విరామమిచ్చిందే బెటర్ అన్న యోచనలో బిసిసిఐ ఉన్నట్టు తెలుస్తోంది.

జట్లు:

భారత్: సూర్యకుమార్(కెప్టెన్), ఇషాన్ కిషన్(వికెట్ కీపర్, జైస్వాల్, తిలక్ వర్మ, శివమ్ దూబే, రింకూ సింగ్, అక్షర్ పటేల్, బిష్ణోయ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిధ్ కృష్ణ, ముఖేష్ కుమార్, వాషింగ్టన్ సుందర్, ఆవేశ్ ఖాన్, గైక్వాడ్, జితేశ్ శర్మ.

ఆస్ట్రేలియా: మాధ్యూ వేడ్(కెప్టెన్, వికెట్ కీపర్), హెడ్, షార్ట్, స్మిత్, ఇంగ్లిస్, మ్యాక్స్‌వెల్, స్టొయినీస్, టిమ్ డేవిడ్, అబట్, జంపా, ఎల్లిస్, బెహ్రెన్ డార్ఫ్, సాంఘ్వా, జెన్సన్, హెర్డే.

తొలిరౌండ్‌లోనే ఓడిన శ్రీకాంత్, లక్ష్యసేన్



హాంగ్జౌ: చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్లకు రెండోరోజు నిరాశ తప్పలేదు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలిరౌండ్ పోటీలో కిదాంబి శ్రీకాంత్, లక్ష్య సేన్, ప్రియాన్షు రజవత్ ఓటమిపాలయ్యారు. ప్రియాన్షు రాజవత్..17-21, 14-21 తేడాతో జపాన్‌కు చెందిన కెంటా నిసిమోటో చేతిలో, లక్ష్యసేన్ 19-21, 18-21 తేడాతో చైనాకే చెందిన షి-యు-కి చేతిలో వరుససెట్లలో పరాజయాన్ని చవిచూశారు. ఇక కిదాంబి శ్రీకాంత్ 15-21, 21-14, 13-21 తేడాతో థాయ్‌లాండ్‌కు చెందిన కున్లావత్ విటిద్సరన్ చేతిలో పోరాడి ఓడాడు. మంగళవారం హెచ్ఎస్ ప్రణయ్.. పురుషుల డబుల్స్‌లో చిరాగ్-సాత్విక్ గెలిచి రెండోరౌండ్‌కు చేరిన సంగతి తెలిసిందే.

బెంగాల్ వారియర్స్ కెప్టెన్‌గా మణిందర్ సింగ్

ప్రొ కబడ్డీ సీజన్-10



ముంబయి: ప్రొ కబడ్డీ సీజన్-10 బెంగాల్ విరాయర్స్ కెప్టెన్‌గా మణిందర్ సింగ్ ఎంపికయ్యాడు. రైడర్ మణిందర్ సింగ్‌ను బెంగాల్ ఫ్రాంచైజీ రూ.2.120కోట్లకు వేలంలో కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. మణిందర్ సింగ్ 2017నుంచి బెంగాల్ తరపున ఆడుతున్నాడు. 33ఏళ్ల మణిందర్ ప్రొ కబడ్డీ చరిత్రలో 1000 పాయింట్లు సాధించిన వారియర్స్ తొలి ఆటగాడు. ప్రొ కబడ్డీ సీజన్-10 టోర్నీ డిసెంబర్ 2నుంచి అహ్మదాబాద్‌లో ప్రారంభం కానుంది. బెంగాల్ వారియర్స్ జట్టు పికెల్ సీజన్-10లో తన తొలి లీగ్ మ్యాచ్‌ను డిసెంబర్ 4న బెంగళూరు బుల్స్‌తో తలపడనుంది.

బ్రెజిల్‌కు అర్జెంటీనా ఝులక్

ఫిఫా ప్రపంచకప్ -2026 క్వాలిఫయర్స్



రోమ్: ఫిఫా ప్రపంచకప్-2026 క్వాలిఫయర్స్‌లో బ్రెజిల్ జట్టుకు తొలి మ్యాచ్‌లోనే చేదు అనుభవం ఎదురైంది. డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా చేతిలో బ్రెజిల్ 1-0తో ఓటమిపాలైంది. అర్జెంటీనా తరఫున ఏకైక గోల్‌ను నికోలాస్ చేశాడు. దీంతో దక్షిణ అమెరికా నుంచి అర్జెంటీనా జట్టు గ్రూప్ లీగ్‌లో టాప్‌లో నిలిచింది. ఇతర పోటీల్లో కొలంబియా 1-0తో పరాగ్వేపై ఉరుగ్వే 3-0తో బొలీవియాపై, ఈక్వెడార్ 1-0త గెలుపొందగా.. పెరూ-వెనిజులా జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 1-1గోల్స్‌తో ఆ గాముగిసింది.

గిరిజనుల పక్షాన పోరాడే సీపీఐ(ఎం),వామపక్ష పార్టీల

అభ్యర్థులను గెలిపించండి

తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గిరిజనులకు అండగా ఉంటూ వారి సమస్యల కోసం ప్రభుత్వాలపై నిత్యం పోరాడుతూ ఎన్నో గిరిజన సమస్యల పరిష్కారంలో ముఖ్యపాత్ర పోషించిన సీపీఐ(ఎం), వామపక్ష పార్టీల అభ్యర్థులకు తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు తెలిపింది. ఈ మేరకు బుధవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.ధర్మ నాయక్, ఆర్.శ్రీరాం నాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు అనుసరించిన గిరిజన వ్యతిరేక విధానాలతో పాటు గిరిజనులకు ఇచ్చిన వాగ్దానాల అమలు కోసం గిరిజన సంఘం నిర్వహించిన ఆందోళనలు, పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొని వారి సమస్యల పరిష్కారంలో సీపీఐ(ఎం), వామపక్ష పార్టీలు కీలకపాత్ర నిర్వహించాయని వారు గుర్తుచేశారు. సీపీఐ(ఎం), వామపక్ష పార్టీల పోరాటాల ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చి 4.50 లక్షల ఎకరాలపై గిరిజనులకు హక్కు పత్రాలు ఇచ్చిందని తెలిపారు. గిరిజనులకు ఆరు శాతం నుండి 10 శాతానికి రిజర్వేషన్ పెంచాలని, తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు, వాటి అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇవ్వాలనీ, రాష్ట్ర బడ్జెట్లో గిరిజనుల కేటాయించే సబ్ ప్లాన్ నిధులు వారి అభివద్ధికే ఖర్చు చేయాలని జరిగిన రాష్ట్రవ్యాప్త ఉద్యమంలో కూడా ఆ పార్టీలు గిరిజనులకు అండగా నిలబడ్డాయని తెలిపారు. అటువంటి సీపీఐ(ఎం), వామపక్ష పార్టీల అభ్యర్థులను గెలిపించి అసెంబ్లీకి పంపడం ద్వారా గిరిజన సమస్యలపై మరిన్ని పోరాటాలు నిర్వహించి గిరిజనులకు అండగా నిలబడతారని వివరించారు. వారిని గెలిపించేందుకు తెలంగాణ గిరిజన సంఘం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కోట్లాది మంది గిరిజనుల హక్కులను కాలరాసే విధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అటవీ సంరక్షణ తీసుకొచ్చిందని విమర్శించారు. గిరిజనుల సంస్కృతిని నాశనం చేస్తూ మనువాద ఆధిపత్య సంస్కతిని బలవంతంగా రుద్దుతూ గిరిజనుల ఉనికికే ప్రమాదం వచ్చే విధంగా చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో గిరిజన తెగల మధ్య ఘర్షణ పెడుతూ లబ్ది పొందేందుకు కుట్రలు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అటువంటి బీజేపీ, దాని మిత్రపక్ష జనసేన పార్టీల అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం), వామపక్ష పార్టీలు పోటీ చేయని స్థానాల్లో లౌకిక, ప్రజాస్వామ్య, సామాజిక, పోరాడే శక్తులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

గుర్గావ్‌లో ఎన్‌హెచ్‌ఏఐ ఫ్లైఓవర్ డ్యామేజ్

- 40 అడుగుల పొడవుతో పగుళ్లు
- కొనసాగుతున్న మరమ్మతు పనులు

2019లో రూ.40 కోట్లతో ఈ ఫ్లైఓవర్ ప్రారంభం



న్యూఢిల్లీ: నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) ప్రాజెక్ట్ అయిన ఐఎఫ్ఎఫ్‌సీఓ చౌక్ సమాంతర ఫ్లైఓవర్ తీవ్రమైన భద్రతా సమస్యను ఎదుర్కొంటున్నది. ఈ ఫ్లైఓవర్ 40-అడుగుల పొడవు, సుమారు 5-అంగుళాల వెడల్పు గల పగుళ్లను చూసింది. దీంతో ఇది ప్రయాణీకుల భద్రత గురించి ఆందోళనలను పెంచుతున్నదని విశ్లేషకులు అంటున్నారు. రూ. 40 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఫ్లైఓవర్ 2019లో ప్రారంభించబడింది. ఈ ఫ్లైఓవర్ విషయంలో ఎన్‌హెచ్ఏఐ ప్రాధాన్యతనిచ్చింది. అయితే నాలుగేండ్లలోనే ఈ ప్రాజెక్టుకు పగుళ్లు రావటంతో ఎన్‌హెచ్ఏఐ పట్ల విశ్వాసం తగ్గే ప్రమాదమున్నదని విశ్లేషకులు అంటున్నారు. కాగా, ఫ్లైఓవర్‌కు పగుళ్లు ఏర్పడిన వెంటనే వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగింది. అధికారులు తక్షణ మరమ్మతులను ప్రారంభించారు. ఫ్లైఓవర్ డ్యామేజ్‌తో ప్రయాణీకులు, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు చాలా ఇబ్బందులను ఎదుర్కొన్నారని స్థానిక వార్త కథనాలు వెల్లడించాయి. గంటకు 40 కి.మీ వేగంతో కూడా బ్యాలెన్స్‌ను కొనసాగించడంలో ఇబ్బందులను ఎదుర్కొన్నారని వివరించాయి. ఈ విషయాన్ని ఎన్‌హెచ్ఏఐ ప్రతినిధి సైతం ధ్రువీకరించారు. ఐఎఫ్ఎఫ్‌సీఓ చౌక్ సమాంతర ఫ్లైఓవర్ ఎం.జి రోడ్, ఢిల్లీ-గురుగ్రామ్ ఎక్స్‌ప్రెస్ వే సర్వీస్ లేన్ నుంచి ప్రయాణీకులకు ఒక కీలక మార్గం. వారిని సిగ్నేచర్ టవర్ క్రాసింగ్ లేదా రాజీవ్ చౌక్ వైపు మళ్లిస్తుంది.

అయితే, ఈ 84 మీటర్ల ఫ్లైఓవర్ పని ప్రారంభించినప్పటి నుంచి సవాళ్లను ఎదుర్కొంటున్నది. ఆగస్టు 2021లో, భారీ వర్షం కారణంగా దెబ్బతినడంతో రిటైనింగ్ వాల్ కూలిపోయింది. మరమ్మతుల అనంతరం ఫ్లైఓవర్‌ను తిరిగి ప్రారంభించారు. ఇలాంటి ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని ఈ ఫ్లైఓవర్ పట్ల ఎన్‌హెచ్ఏఐ అప్రమత్తంగా ఉండాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

రేపు ఏపీ సీఎం జగన్ బెయిల్ రద్దు పై సుప్రీంలో విచారణ


ఎంపీ రఘురామకృష్ణరాజు పిటిషన్ దాఖలు


(ఫైల్)

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బెయిల్ రద్దు చేయాలని ఎంపీ రఘురామ కృష్ణరాజు దాఖలు చేసిన పిటిషన్.. సుప్రీంకోర్టులో రేపు (శుక్రవారం) విచారణకు రానుంది. అక్రమాస్తుల కేసులో గత పదేండ్లుగా జగన్ బెయిల్ పై ఉన్నారని, కేసులపై విచారణ వేగవంతం చేయాలని గతంలో తెలంగాణ హైకోర్టులో రఘురామ పిటిషన్ చేశారు. దీనిపై తెలంగాణ హైకోర్టులో సీబీఐ కౌంటర్ దాఖలు చేసింది. అనంతరం రఘురామ పిటిషన్‌ను కొట్టివేస్తూ న్యాయస్థానం తుది ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో హైకోర్టు ఆదేశాలను సుప్రీంకోర్టులో ఎంపీ రఘురామ సవాలు చేశారు. ఈ క్రమంలో జస్టిస్ అభయ్ ఎస్ ఓఖా ధర్మాసనం శుక్రవారం జరిపే విచారణ జాబితాలో రఘురామ పిటిషన్‌ను చేర్చింది. పిటిషన్‌పై జస్టిస్ అభయ్ ఎస్ ఓఖా, జస్టిస్ పంకజ్ మిత్తల్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టనున్నది.

తండేల్.. నా కెరీర్‌లో సెన్సేషనల్ మూవీ


నాగచైతన్య

కొత్త తరహా కథలకు ఎప్పుడూ పెద్ద పీట వేసే నాగచైతన్య ప్రస్తుతం వెబ్ సిరీస్ ప్రపంచంలోకి అడుగు పెట్టారు. ఆయన ప్రధాన పాత్ర పోషించిన 'దూత' డిసెంబర్1 నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమింగ్ కానుంది.

మరోవైపు చందూ మొండేటి దర్శకత్వంలో రూపొందనున్న భారీ ప్రాజెక్ట్ టైటిల్, ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. ఈ చిత్రానికి 'తండేల్' అనే పవర్ ఫుల్ టైటిల్ ఖరారు చేశారు. నేడు గురువారం నాగచైతన్య పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

యూనిక్ కాన్సెప్ట్‌తో దూత

ఈ బర్త్ డే నాకు సమ్‌థింగ్ స్పెషల్. ఫ్యాన్స్‌కి కూడా సర్‌ప్రైజ్‌లు ఉన్నాయి. నేను చేసిన తొలి వెబ్ సిరీస్ 'దూత' ట్రైలర్ విడుదల అవుతోంది. చందూ మొండేటి దర్శకత్వంలో రూపుదిద్దుకొంటున్న సినిమా టైటిల్ 'తండేల్' ఫస్ట్ లుక్ రిలీజ్ అయ్యింది. విక్రమ్ కుమార్ 'దూత' లాంటి యూనిక్ కాన్సెప్ట్‌తో వచ్చారు. ఇది ఖచ్చితంగా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది. ఈ సిరీస్‌కి సీజన్ 2, సీజన్ 3 ఐడియాలు విక్రమ్ దగ్గర ఉన్నాయి. సీజన్ 1 హిట్టయితే.. తప్పకుండా మరో సీజన్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తాం.

- ఈ సిరీస్‌కి సంబంధించి విక్రమ్ చెప్పిన ఐడియానే నాకు కొత్తగా అనిపించింది. ఇలాంటి సూపర్ నేచురల్ థ్రిల్లర్స్ తీయడంలో విక్రమ్ మాస్టర్. దూతలాంటి కాన్సెప్ట్ ఇప్పటివరకూ రాలేదు. విక్రమ్ అద్భుతంగా తీశారు. నిర్మాత శరత్ మరార్ ఎక్కడా రాజీపడకుండా చాలా గ్రాండ్‌గా ఈ సిరీస్‌ని నిర్మించారు. ఇప్పటి వరకు చూడని కొత్త లొకేషన్స్‌లో షూట్ చేశాం. టెక్నికల్‌గా ఉన్నత స్థాయిలో ఉంటుంది. ప్రేక్షకులు సీట్ ఎడ్జ్ థ్రిల్ ఫీలౌతారు.

తండేల్‌లో బెస్తవాడిగా..

చందూ మొండేటితో 'తండేల్' లాంటి ఓ స్పెషల్ ప్రాజెక్ట్ చేస్తున్నా. ఈ సినిమా కోసం శ్రీకాకుళంలోని కె.మత్స్యలేశం గ్రామానికి వెళ్లాం. అక్కడ పరిస్థితులని దగ్గరుండి అర్థం చేసుకున్నాం. ఇది నా కెరీర్‌లో బిగ్గెస్ట్ బడ్జెట్ సినిమా. చాలా పెద్ద కాన్వాస్, స్పాన్ ఉన్న కథ. కథ రీత్యా కొంత భాగం ఇండియాలో కొంత భాగం పాకిస్తాన్‌లో జరుగుతుంది. ఈ చిత్రం నా కెరీర్‌లోనే సెన్సేషనల్ మూవీ. ఇందులో నాది బెస్తవాడి పాత్ర. అలాగే శ్రీకాకుళం యాసను కూడా ప్రాక్టీస్ చేస్తున్నాను. ఓ ఫిషర్‌మెన్ జీవితంలో జరిగిన కొన్ని సంఘటల్ని సినిమాటిక్‌గా చెప్పబోతున్నాం. అలాగే అద్భుతమైన అనుభూతిని పంచే ప్రేమకథ ఉంది. 'లవ్‌స్టోరీ' తర్వాత నేను, సాయిపల్లవి మళ్ళీ కలిసి నటిస్తున్నాం. తన రాకతో ఈ కథకు మరింత బలం చేకూరినట్టయింది.

నవ్వుతూనే ఉంటారు..


వీజే సన్నీ

ఫుల్ మూన్ మీడియా ప్రొడక్షన్స్ పతాకంపై ప్రొడక్షన్ నెం-1గా రూపొందిన చిత్రం 'సౌండ్ పార్టీ'. వీజే సన్నీ, హ్రితిక శ్రీనివాస్ జంటగా నటించారు. జయ శంకర్ సమర్పణలో సంజయ్ శేరి దర్శకత్వం వహించారు. రవి పొలిశెట్టి, మహేంద్ర గజేంద్ర, శ్రీ శ్యామ్ గజేంద్ర నిర్మాతలు. ఈ చిత్రం వరల్డ్ వైడ్‌గా ఈనెల 24న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదలవుతోంది.

ఈ సందర్భంగా హీరో సన్నీ మీడియాతో మాట్లాడుతూ,'బిగ్ బాస్' తర్వాత నేను చేసిన ప్రాజెక్టుల్లో బెస్ట్ ప్రాజెక్టు 'సౌండ్ పార్టీ'. ఈ సినిమా కోసం 100% ఎఫెక్ట్ పెట్టాను. తండ్రి కొడుకుల మధ్య ఉండే ఫ్రెండ్షిప్ బాండింగ్‌ను ఫన్నీ వేలో చూపించాం. డబ్బులు కోసం ఫాదర్ అండ్ సన్ ఏం చేశారనేది.. ఏం చేయకూడదనేది ఇందులో చూపించాం. కంప్లీట్ అవుట్ అండ్ అవుట్ ఎంటర్టైనర్ ఇది. ఇందులో బిట్ కాయిన్‌కు కూడా కీలకపాత్ర ఉంటుంది. ఈ సినిమాకు దర్శకుడు సంజయ్ నన్ను రిఫర్ చేశారు. నిర్మాతలు కొత్తవారైనా ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఈ చిత్రాన్ని నిర్మించారు. సినిమాలో పెద్ద సర్ప్రైజ్ కూడా ఉంటుంది. జయశంకర్ ప్రెజెంటర్‌గా ఈ సినిమాకు చాలా హెల్ప్ చేశారు. హ్రితిక శ్రీనివాస్ .. ఆమని మేనకోడలు అని నాకు షూటింగ్ టైంలో తెలిసింది. హీరోయిన్‌గా మంచి పేరు తెచ్చుకుంటుంది. శివన్నారాయణని చూస్తే ఎవరికైనా ఇప్పటికీ 'అమృతం' సీరియల్ గుర్తొస్తుంది. ఆయన నేను తండ్రీ కొడుకులుగా ప్రేక్షకులను ఎంటర్టైన్ చేస్తాం. వెన్నెల కిషోర్ వాయిస్ ఓవర్ ఇచ్చి సపోర్ట్ చేస్తే.. నాని కూడా ప్రమోషన్స్ విషయంలో సపోర్ట్‌గా నిలిచారు. సెన్సార్ సభ్యులు ఈ సినిమా చూసి చాలా నవ్వుకున్నామని చెప్పారు. యూఎస్‌లో ప్రీమియర్ వేస్తే వందకు వంద మార్కులు వేశారు' అని చెప్పారు.

నవచిత్రం

భారీ సెట్‌లో పక్కా మాస్ సాంగ్


నితిన్, శ్రీలీల

నితిన్, బ్యూటీ డాల్ శ్రీలీల హీరో, హీరోయిన్లుగా రూపొందుతున్న అవుట్ అండ్ ఔట్ ఎంటర్‌టైనర్ 'ఎక్స్‌ట్రా - ఆర్డినరీ మ్యాన్'. రైటర్ - డైరెక్టర్ వక్కంతం వంశీ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు.

ప్రస్తుతం శంషాబాద్‌లో వేసిన భారీ సెట్‌లో 300కి పైగా ఫారిన్ డాన్సర్స్‌తో జానీ మాస్టర్ కొరియోగ్రఫీలో పక్కా మాస్ సాంగ్‌ను హీరో నితిన్, శ్రీలీలపై చిత్రీకరిస్తున్నారు. ఈ పాట చిత్రీకరణతో ఎంటైర్ షూటింగ్ పూర్తవుతుంది. ఈ చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా డిసెంబర్ 8న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ రిలీజ్ చేస్తున్నారు. నితిన్ ఈ చిత్రంలో జూనియర్ ఆర్టిస్ట్ క్యారెక్టర్‌లో కనిపించి తనదైన కామెడీ టైమింగ్‌తో ఎంటర్‌టైన్ చేయించనున్నారు. శ్రేష్ఠ్ మూవీస్, ఆదిత్యమూవీస్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్స్, రుచిర ఎంటర్‌టైన్ మెంట్స్ బ్యానర్స్‌పై ఎన్.సుధాకర్ రెడ్డి, నికితా రెడ్డి ఈ మూవీని నిర్మిస్తున్నారు.

డబుల్ ధమాకా..


మోహన్‌బాబు


మంచు విష్ణు

విష్ణు మంచు ప్రస్తుతం 'కన్నప్ప' సినిమాతో పాన్ ఇండియా వైడ్‌గా సందడి చేసేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ సినిమా షూటింగ్ న్యూజిలాండ్‌లో శరవేగంగా జరుగుతోంది. డ్రీమ్ ప్రాజెక్ట్ కావడంతో ఈ సినిమాను ఆయన ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. మోహన్ లాల్, శివ రాజ్ కుమార్, ప్రభాస్, శరత్ కుమార్ వంటి స్టార్లు ఇందులో నటిస్తున్న సంగతి తెలిసిందే. నేడు (గురువారం) విష్ణు పుట్టిన రోజు సందర్భంగా ఈ చిత్రం నుంచి క్రేజీ అప్డేట్ రానుందని చిత్ర బృందం తెలిపింది.

ఇదిలా ఉంటే, నేటితో మోహన్‌బాబు సినీ ప్రయాణానికి 48 ఏండ్లు పూర్తయ్యాయి. విలక్షణ నటుడిగా, కలెక్షన్ కింగ్‌గా మోహన్ బాబు ఈ 48 ఏండ్లలో ఎన్నెన్నో రికార్డులు నెలకొల్పారు. ఎన్నో అవార్డులను అందుకున్నారు. తన నటనతో తెలుగు ప్రేక్షకులపై చెరగని ముద్రను వేశారు. జయాపజయాలకు అతీతంగా ఆయన కొనసాగించిన ప్రయాణం అన్ని తరాల వారికి స్ఫూర్తిదాయకం.

లుట్ పుట్ గయా..



షారుక్ ఖాన్, డైరెక్టర్ రాజ్‌కుమార్ హిరాణి కాంబినేషన్‌లో రూపొందుతోన్న చిత్రం 'డంకీ'. డంకీ డ్రాప్ 2 - లుట్ పుట్ గయా అంటూ తొలి పాటగా హృదయానికి హత్తుకునే రొమాంటిక్ సాంగ్‌ను మేకర్స్ బుధవారం మేకర్స్ విడుదల చేశారు.

ఈ ప్రపంచం ఏమనుకున్నా పర్లేదని హర్డీకి అండగా మను నిలబడుతుంది. ఆ సమయంలో హర్డీ, మనుల ప్రేమ ప్రయాణాన్ని ఈ పాట తెలియజేసేలా ఉంది. మను పట్ల తన మనసులోని భావనను హర్డీ పాట రూపంలో తెలియజేస్తున్నాడు. ఈ మెలోడీ పాటకు ప్రీతమ్ అద్భుతమైన సంగీతాన్ని అందించగా, అర్జిత్ సింగ్ వినసొంపైన గాత్రంతో పాటకు ప్రాణం పోశారు. స్వానంద్ కిర్‌కిరే, ఐ.పి.సింగ్ ఈ పాటకు సాహిత్యాన్ని అందించారు. ట్యూన్‌కు తగ్గట్టు గణేష్ ఆచార్య చక్కటి డాన్స్ మూమెంట్స్‌ను కంపోజ్ చేశారు. దీంతో పాటలోని రొమాంటిక్ ఫీల్‌కి అదనపు హంగు తోడైనట్లు అనిపిస్తుంది. చక్కటి హాస్యం, హృదయాన్ని హత్తుకునే ఎమోషన్స్‌తో ఈ సినిమా నిండి ఉంటుంది. ఇది నలుగురు స్నేహితులకు సంబంధించిన కథ. ఈ నలుగురు స్నేహితులు వారి కలలను నిజం చేసుకోవటానికి విదేశాలకు వెళ్లాలని అనుకుంటారు. ఈ ప్రయాణంలో వారెలాంటి ఆటుపోట్లను ఎదుర్కొన్నారనేదే కథాంశం. స్నేహం, ప్రేమ వంటి అంశాలతో నిజ ఘటనలను ఆధారంగా చేసుకుని ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు డైరెక్టర్ రాజ్ కుమార్. ఈ చిత్రం డిసెంబర్‌లో విడుదలవుతుంది.

పోలీసుల్ని పోలీసులే వెంటాడితే?


శ్రీకాంత్

రాహుల్ విజయ్, శివాని రాజశేఖర్ లీడ్ రోల్స్‌లో తేజ మార్ని తెరకెక్కించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. శ్రీకాంత్, వరలక్ష్మీ శరత్ కుమార్ కీలకపాత్రలు పోషించారు. గీతా ఆర్ట్స్ 2 బ్యానర్‌పై బన్నీ వాస్, విద్యా కొప్పినీడి నిర్మించారు. ఈనెల 24న సినిమా విడుదలవుతున్న సందర్భంగా హీరో శ్రీకాంత్ మీడియాతో సంభాషించారు.

'ఇదొక డిఫరెంట్ కాన్సెప్ట్. ఎక్కడైనా పోలీసులు క్రిమినల్స్‌ని ఛేజ్ చేసి పట్టుకుంటారు. కానీ ఇందులో పోలీస్ ఛేజెస్ పోలీస్ కథ. పొలిటిషన్స్ పోలీసులను ఎలా వాడుకుంటారు? దానివల్ల పోలీసులకు ఎదురైన ఇబ్బందులు ఏమిటి అనేది మెయిన్ కాన్సెప్ట్. ఓటు బ్యాంకింగ్ కోసం కులాలను, మతాలను రాజకీయ నాయకులు ఏ విధంగా వాడుకుంటారు అనేది ఇందులో స్పష్టంగా చూపించారు. సిస్టమ్‌లో జరిగేది మాత్రమే చూపించారు. కానీ పొలిటికల్‌గా ఎలాంటి సెటైర్ ఉండదు. దర్శకుడు తేజ కథ చెబుతున్నప్పుడే థ్రిల్ అయ్యాను. శ్రీకాకుళం బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుంది. స్టోరీ, స్క్రీన్ ప్లే చాలా ఎక్సైటింగ్‌గా ఉంటుంది. హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ పాత్రలో నటించాను. నేను, రాహుల్ విజయ్, శివాని రాజశేఖర్.. మా ముగ్గురి పాత్రల మధ్య కథ తిరుగుతుంటుంది. వరలక్ష్మి శరత్ కుమార్ మా పై ఆఫీసర్‌గా ఉండి.. మమ్మల్ని పట్టుకోవడానికి చూస్తారు. వరలక్ష్మి వేసే ఎత్తులకు నేను పైఎత్తులు వేస్తూ ఉంటాను. పర్ఫార్మెన్స్‌కి చాలా స్కోప్ ఉన్న పాత్ర పోషించాను. 'లింగిడి లింగిడి' సాంగ్ రిలీజ్ అయిన తర్వాత సినిమాపై బజ్ బాగా పెరిగింది. ప్రొడ్యూసర్స్ బన్నీ వాసు, విద్య చాలా క్లారిటీగా దీన్ని రూపొందించారు' అని అన్నారు.

ఇలాంటి క్లైమాక్స్ చూసి ఉండరు..


తేజ్ బొమ్మదేవర

తేజ్ బొమ్మదేవర, రిషికి లోక్రే జంటగా నటించిన సినిమా 'మాధవే మధుసూదన'. ఈ చిత్రాన్ని సాయి రత్న క్రియేషన్స్ బ్యానర్ పై నిర్మిస్తూ దర్శకత్వం వహించారు బొమ్మదేవర రామచంద్రరావు.

బొమ్మదేవర శ్రీదేవి సమర్పిస్తున్న ఈ సినిమా ఈ నెల 24న థియేటర్స్ ద్వారా గ్రాండ్‌గా రిలీజ్ కాబోతోంది. ఈ సందర్భంగా హీరో తేజ్ బొమ్మదేవర మీడియాతో మాట్లాడుతూ, 'బీబీఏ కంప్లీట్ చేశాను. విదేశాలకు వెళ్లి ఎంబీఏ చేద్దామని అనుకున్నా. ఆ టైంలోనే మా నాన్న ఈ కథను రెడీ చేసుకున్నారు. ఆయనతో పాటు నేను కూడా ట్రావెల్ చేశాను. ఎంతో మంది వద్దకు వెళ్లి కథ చెప్పాం. కానీ సెట్ అవ్వలేదు. చివరకు మా నాన్న నన్నే అడిగారు. నటనలో శిక్షణ తీసుకుని ఇందులో హీరోగా నటించాను. చాలా మంచి కథ. తెలుగులో ఇది కొత్త జోనర్‌లా అనిపిస్తుంది. క్లైమాక్స్ అందరినీ టచ్ చేస్తుంది. ఇంత వరకు అలాంటి క్లైమాక్స్ చూసి ఉండరు. లవ్, థ్రిల్, కామెడీ ఇలా అన్ని అంశాలను జోడించి తెరకెక్కించిన చిత్రమిది. మోషన్ పోస్టర్ లాంచ్ చేసిన టైంలో హీరో నాగార్జున కొన్ని సలహాలు ఇచ్చారు. 'నాన్న కష్టపడి పైకి వచ్చారు.. నువ్వు కూడా చాలా కష్టపడాలి.. డ్యాన్సులు బాగా చేశావ్' అని అన్నారు. ముమ్ముందు ఎలాంటి పాత్రలు వచ్చినా చేస్తాను' అని చెప్పారు.

టిక్కీ తినేద్దామా...!



చల్లదనానికి కాస్త వేడి వేడిగా ఏదైనా తాగాలని, తినాలని అనిపిస్తుంటుంది. అయితే ఎప్పుడు చేసుకునే పకోడి, బజ్జీలే కాకుండా కాస్త హెల్దీగా ఉండే స్నాక్స్ చేసుకుంటే ఎంతో బాగుంటుంది. అందులో రాజ్‌మా, పాలకూర, సోయా వంటి వాటిని చేర్చుకుంటే ఇంకెంత బాగుంటుందో కదా... మరెందుకు ఆలస్యం... వీటితో టిక్కీలు చేసుకుందాం...

ఆలూ, అన్నంతో..

కావాల్సిన పదార్థాలు : ఎరుపు, పసుపు, ఆకుపచ్చ క్యాప్సికం - రెండు, ఆలు - (ఉడికించినవి) రెండు పెద్దవి, కారం, మిరియాలపొడి అరచెంచా చొప్పున, ఉప్పు - తగినంత, పచ్చిమిర్చి - మూడు, నూనె - అరకప్పు, ఉల్లిపాయలు - రెండు, ఉప్పు - తగినంత, అన్నం - కప్పు, కొత్తిమీర - కట్ట, పెరుగు - అరకప్పు, ఎండు మిర్చి - ఒకటి

తయారు చేసే విధానం : కడాయి స్టవ్ మీద పెట్టి రెండు చెంచాల నూనె వేడి చేసి ఉల్లిపాయ, క్యాప్సికం ముక్కలూ, ఎండు మిర్చి ముక్కలూ వేసి కొంచెం సేపు వేయించాక, మిరియాలపొడీ, కారం, తగినంత ఉప్పూ, పచ్చిమిర్చి తరుగూ వేసి కలుపుకోవాలి. క్యాప్సికం ముక్కల్లోని పచ్చివాసన పోయాక వీటన్నింటినీ ఓ గిన్నెలోకి తీసుకోవాలి. అందులో అన్నం, ఉడికించిన ఆలూ, పెరుగూ, కొత్తిమీర తరుగూ వేసి బాగా కలపాలి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని టిక్కీల్లా అద్దుకోవాలి. పొయ్యి మీద పెనం పెట్టి.. రెండు టిక్కీలను ఉంచి.. కొంచెం కొంచెంగా నూనె వేసుకుంటూ రెండు వైపులా కాల్చుకోవాలి. ఇలాగే మిగిలినవీ చేసుకుంటే సరి.





రాజ్‌మా, క్యాప్సికంతో..

కావాల్సిన పదార్థాలు : రాజ్మా గింజలు - రెండు కప్పులు, బ్రెడ్‌పొడి - కప్పు, క్యాప్సికం - రెండు, జీలకర్రపొడి, గరం మసాలా - ఒకటిన్నర చెంచాల చొప్పున, మిరియాలపొడి - చెంచా, ఎండుమిర్చి చెంచా, ఉప్పు - తగినంత, అల్లం తరుగు - చెంచా, వెల్లుల్లి ముక్కలు - రెండు చెంచాలు, కొత్తిమీర- రెండు కట్టలు, పుదీనా - కట్ట, మైదా - ముప్పావుకప్పు, నూనె - కప్పు.

తయారు చేసే విధానం : రాజ్మాను ముందురోజు రాత్రే నానబెట్టుకోవాలి. మర్నాడు ఆ నీటితో సహా కుక్కర్‌లో వేసి, ఎనిమిది నుంచి పది విజిల్స్ వచ్చే వరకు ఉంచి దింపేయాలి. వేడి చల్లారాక రాజ్మాను మిక్సీ జారులోకి తీసుకుని మెత్తని ముద్దలా చేసుకోవాలి. అందులో నూనె, మైదా, బ్రెడ్ పొడి తప్ప మిగిలిన పదార్థాలన్నీ వేసుకుని బాగా కలుపుకోవాలి. ఈ పిండిని కాసేపు ఫ్రిజ్‌లో ఉంచాలి. ఇంతలో మైదా పిండితో పాటు సరిపడా నీళ్ల పోస్తూ గరిటె జారుగా (లైట్ లూజ్ బాటర్) చేసుకుని పెట్టుకోవాలి. నానిన రాజ్మా మిశ్రమాన్ని ఫ్రిజ్ లోంచి తీసుకుని చిన్నచిన్న టిక్కీల్లా చేసుకోవాలి. ఒక్కో దాన్ని మైదా మిశ్రమంలో ఉంచి.. తర్వాత బ్రెడ్ పొడి అద్దాలి. ఇలాగే మిగిలినవీ చేసుకుని, పెనం మీద ఉంచి, నూనె వేసుకుంటూ రెండు వైపులా కాల్చి తీసుకుంటే చాలు. అయితే పెనం మీద పెట్టే ముందే వీటిని మైదా మిశ్రమంలో ముంచాలి. లేదంటే నానిపోయి.. టిక్కీ ముద్దలా అయిపోతుంది.

పనీర్, బఠాణీలు..

కావాల్సిన పదార్థాలు : బఠాణీలు - అరకప్పు (ఎండు బఠాణీలు అయితే ఆరు గంటల ముందు నాన బెట్టి, ఉడికించి, ముద్దలా చేసుకోవాలి), పనీర్ తురుము - కప్పు, నెయ్యి - ఒకటిన్నర చెంచా, జీలకర్ర - చెంచా, అల్లం తరుగు - రెండు చెంచాలు, పచ్చిమిర్చి - రెండు, జీలకర్రపొడి, కారం - చెంచా చొప్పున, ఉప్పు - తగినంత, జీడి పప్పు, కిస్మిస్ పలుకులు - పావు కప్పు, కొత్తిమీర - కట్ట (సన్నగా తరగాలి), దాల్చినచెక్క పొడి - అర చెంచా, మొక్కజొన్న పిండి - చెంచా, నూనె - అర కప్పు,

తయారు చేసే విధానం : కడాయిని స్టవ్ మీద పెట్టి.. నెయ్యి వేసి కరిగించాలి. అందులో జీలకర్రా, అల్లం తరుగూ, పచ్చిమిర్చి ముక్కలు వేయాలి. అవి వేగాక ఉడికించి ముద్దలా చేసుకున్న బఠాణీల మిశ్రమం, జీలకర్ర పొడి, కారం, తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి. రెండు నిమిషాలయ్యాక జీడిపప్పు, కిస్మిస్ పలుకులూ, కొత్తిమీర తరుగూ వేసి కలిపి దింపేయాలి. ఇందులో పనీర్ తురుము, దాల్చినచెక్కపొడి వేసి ముద్దలా కలుపు కోవాలి. ఇప్పుడు మొక్కజొన్న పిండిలో కొద్దిగా నీళ్ల పోసి కలిపి పెట్టుకోవాలి. బఠాణీల మిశ్రమాన్ని టిక్కీల్లా ఒత్తు కోవాలి. పొయ్యి మీద పెనం పెట్టి వేడి చేయాలి. ఒక్కో టిక్కీని తీసుకుని మొక్కజొన్నపిండిలో ముంచి.. పెనం మీద ఉంచి, నూనె వేసుకుంటూ రెండు వైపులా కాల్చుకోవాలి. ఇలా మిగిలినవీ చేసుకోవాలి.





పాలకూర, శెనగలు..


కావాల్సిన పదార్థాలు : పాలకూర - ఐదు కట్టలు, శెనగలు - అర కప్పు, పచ్చి మిర్చి - రెండు, వెల్లుల్లి - ఐదు, ఉప్పు - తగినంత, గరంమసాలా - రెండు చెంచాలు, చాట్ మసాలా - ఒకటిన్నర చెంచా, చీజ్ - అరకప్పు, నూనె - ముప్పావుకప్పు, బ్రెడ్పొడి - కప్పు

తయారు చేసే విధానం : పాలకూరను సన్నగా తరిగి.. ఆరబెట్టుకోవాలి. పాలకూరలో తడిపోయాక పచ్చిమిర్చి, వెల్లుల్లి రెబ్బలు, మిక్సీ జార్‌లోకి తీసుకుని ముద్దలా చేసుకో వాలి. తర్వాత నానబెట్టి, ఉడికించిన శెనగల్ని అందులో వేసి మరోసారి మిక్సీ పట్టాలి. ఈ ముద్దను ఓ గిన్నెలోకి తీసుకుని తగినంత ఉప్పు, గరంమసాలా, చాట్ మసాలా, బ్రెడ్ పొడి వేసి బాగా కలిపి కాసేపు ఫ్రిజ్‌లో ఉంచాలి. పదిహేను నిమిషాలయ్యాక కొద్దిగా పాలకూర ముద్దను తీసుకుని చిన్న టిక్కీలా అద్దుకుని, అందులో చీజ్‌ని కొద్దిగా ఉంచి.. మళ్లీ టిక్కీలా అద్దుకోవాలి. ఇలాగే మిగిలిన మిశ్రమాన్ని చేసుకోవాలి. ఇప్పుడు పెనం స్టవ్ మీద పెట్టి.. రెండు రెండు టిక్కీల చొప్పున ఉంచి.. నూనె వేసుకుంటూ రెండు వైపులా కాల్చుకుని తీసుకోవాలి.

సోయా, అటుకులతో...

కావాల్సిన పదార్థాలు : అటుకులు - కప్పు, సోయా కీమా - అరకప్పు, నూనె కప్పు, జీలకర్ర - చెంచా, అల్లం తరుగు - రెండు చెంచాలు, పచ్చిమిర్చి - మూడు, ఉల్లిపాయ - ఒకటి, కారం - అరచెంచా, పసుపు - పావు చెంచా, ఆమ్‌చూర్ పొడి, చాట్ మసాలా - అరచెంచా చొప్పున, ఉప్పు - తగినంత, నిమ్మరసం - ఒకటి న్నర చెంచా, ఉడికించిన ఆలూ- రెండు, మొక్కజొన్న పిండి - రెండు చెంచాలు

తయారు చేసే విధానం : కడాయిని స్టవ్ మీద పెట్టాలి. వేడయ్యాక రెండు చెంచాల నూనె వేసి జీలకర్ర, అల్లం, పచ్చిమిర్చి తరుగు వేయాలి. అన్నీ వేగాక ఉల్లి పాయముక్కలు వేయాలి. అవి కూడా కొద్దిగా వేగాక కారం, పసుపు, ఆమ్ చూర్‌పొడి, చాట్‌మసాలా వేసి బాగా కలపాలి. నిమిషం తర్వాత అటుకులూ, సోయా కీమా వేసి కాసిని నీళ్ల చల్లుతూ ఉండాలి. కాసేపటికి అవి మెత్తగా అవుతాయి. అప్పుడు కొద్దిగా ఉప్పు, నిమ్మరసం వేయాలి. అన్నీ బాగా కలిశాక ఉడికించిన ఆలు, మొక్కజొన్న పిండి వేసి రెండు నిమిషాలయ్యాక దింపేయాలి. ఈ మిశ్రమాన్ని గుండ్రని టిక్కీల్లా చేసుకోవాలి. వీటిని పెనంపై ఉంచి.. నూనె వేసుకుంటూ రెండు వైపులా కాల్చి తీసుకోవాలి.



మంచి ఆహారం తినకపోతే...



మీరు తినే ఆహారంలో కూరగాయలు, ఆకుకూరలతో పాటూ ఫ్రూట్స్, డ్రైఫ్రూట్స్, పప్పులు, గింజల వంటివి కూడా ఉంటాయా? అలా ఉంటే మీకు బైపోలార్ డిజార్డర్ రాదు. అలా కాకుండా... ఎక్కువగా జంక్ ఫుడ్ తింటూ బ్యాలెన్సింగ్ డైట్ తినకపోతే అలాంటి వారికి ఈ మానసిక సమస్య వస్తోంది. అసలు ఈ బైపోలార్ డిజార్డర్ అంటే ఏమిటో.. దాని లక్షణాలు ఏమిటో తెలుసుకుందాం...

బైపోలార్ డిజార్డర్‌ను ఇదివరకు మానిక్ డిప్రెషన్ అనే వారు. ఇది పని ఒత్తిడి ఎక్కువగా ఉండే వారికి వస్తూ ఉంటుంది. లేదంటే... ప్రేమించిన వాళ్ల దూరమైన, అయిన వాళ్ల చని పోయినా, ఒంటరి జీవితాన్ని అనుభవిస్తున్నా మత్తుపదార్థాలకు బానిసైనా అలాంటి వాళ్ల బైపోలార్ డిజార్డర్‌లోకి జారుకుంటారు. ఓ వైపు ఒత్తిడి, మరోవైపు కుంగుబాటుతనం రెండూ ఒకే సమయంలో వచ్చేవారికి ఈ బైపోలార్ డిజార్డర్ వస్తుంది.

లక్షణాలు ఇవే...

ఇది వచ్చినవాళ్ల తాము ఒంటరైపోయినట్టు ఫీలవుతారు. తమకు ఈ ప్రపంచంతో సంబంధం లేదన్నట్టు భావిస్తారు. చీకట్లో కూర్చొని కుమిలిపోతారు. ఒక్కోసారి ఆత్మహత్య చేసుకోవాలనుకుంటారు. ఎక్కువగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఈ డిజార్డర్ వచ్చి ప్రాణాలు తీసుకుంటున్నారు.

పోగొట్టుకోవడం ఎలా?

ఈ సమస్య ఉన్న వాళ్ల దీన్ని పోగొట్టుకోవాలి. అలాగే లేని వాళ్ల ఇది రాకుండా చేసుకోవాలి. ఇందుకు మంచి ఆహారం తినడమే సరైన మందు అంటున్నారు డాక్టర్లు. మంచి ఆహారం తీసుకునే వారికి ఈ మానసిక సమస్య రాదని తేల్చారు. ఈ సమస్య ఉన్న వారికి ప్రస్తుతం న్యూట్రాస్యూటికల్ ట్రీట్‌మెంట్ అనేది చేస్తున్నారు. అధిక బరువు ఉన్న వారు కూడా జాగ్రత్త పడాలి. ఎందుకంటే... ఈ సమస్య వచ్చిన వారిలో చాలా మంది అధిక బరువు కలిగివుంటున్నారంట.

ఇతర పనుల్లోకి జారుకోవాలి

మన శరీరానికి ఏ గాయమో అయితే వెంటనే తగ్గించగలరు గానీ... మానసిక సమస్యలు, డిజార్డర్ల వంటివి ఉంటే మాత్రం వెంటనే తగ్గించలేరు. ముఖ్యంగా బైపోలార్ డిజార్డర్ ఉన్నవారు ఒంటరితనాన్ని వదిలేయాలి. ఫ్రెండ్స్, కుటుంబ సభ్యులు, బంధువులు, తెలిసిన వాళ్లతో మాట్లాడాలి. ఏదేదో అనుకుంటూ అదే పనిగా ఫీలవ్వడం మానేసి తమకు ఇష్టమైన ఇతర పనుల్లోకి జారుకోవాలి. ఇలా చేయడం వల్ల ఒంటరి ఆలోచనలకు దూరం కావొచ్చు. రోజూ వ్యాయామం, వాకింగ్ వంటివి చెయ్యాలి. అదే సమయంలో మంచి ఆహారం తీసుకుంటే... మెదడు, శరీరం అన్నీ చక్కగా చురుగ్గా ఉంటూ బైపోలార్ డిజార్డర్‌ను దూరం చేస్తాయి.

ఆరెస్పీయే కాబోయే సీఎం

నవతెలంగాణ-సూర్యాపేట

తెలంగాణలో రాబోయేది బీఎస్పీ సర్కారేనని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) జాతీయ అధ్యక్షులు మాయావతి ధీమా వ్యక్తం చేశారు. ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమారే కాబోయే ముఖ్యమంత్రి అని తెలిపారు. సూర్యాపేటలోని గాంధీనగర్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఎస్పీ అభ్యర్థి వట్టెజానయ్య యాదవ్ విజయాన్ని కాంక్షిస్తూ బుధవారం జరిగిన బహిరంగసభను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. దేశంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ సంపన్న వర్గాల కోసం పనిచేస్తున్నాయని, కానీ బీఎస్పీ మాత్రం బహుజన వర్గాల కోసం ప్రజల విరాళాలతో నడుపబడుతున్న ఏకైక పార్టీ అని తెలిపారు. తెలంగాణలో అత్యంత అవినీతి ప్రభుత్వం ఉందని, శాంతి భద్రతలు క్షీణించాయని, ఈ ప్రభుత్వానికి ప్రజల సమస్యలు పట్టవని.. భ్రష్టాచార్ ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించాలన్నారు. ఉత్తరప్రదేశ్ మాదిరి తెలంగాణలో కూడా బహుజన సమాజ్ పార్టీని ఆదరించాలని కోరారు. అంబేద్కర్‌కు భారతరత్న ఇవ్వకుండా కాంగ్రెస్ అవమానించిందన్నారు. మహిళా కోటాలో ఎస్సీ, ఎస్టీ కోటా ఉండాలని.. మొదటి నుంచి బీఎస్పీ ఈ విషయం చెప్తోం దన్నారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఐపీఎస్‌ను వదిలి.. ప్రజల సేవ కోసం వచ్చారని తెలిపారు. పార్టీని గెలిపించి ఆయనను ముఖ్యమంత్రిని చేయాలని సూచించారు. తమ పార్టీ అభ్యర్థి వట్టెజానయ్య యాదవ్‌పై జరిగిన దాడి బీఆర్ఎస్, కాంగ్రెస్ జరిపించిన దాడులని వ్యాఖ్యానించారు. రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో బీఎస్పీ.. గతంలో కంటే ఎక్కువ స్థానాలను గెలవబోతోందని అన్నారు. బీసీ వాదం ఎత్తుకున్నందుకు జానయ్యపై మంత్రి జగదీశ్‌రెడ్డి 70కి పైగా కేసులు పెట్టించారని విమర్శించారు. అభ్యర్థి వట్టెజానయ్య యాదవ్ మాట్లాడుతూ.. చావు నోట్లోకి వెళ్లి ప్రజల ఆశీర్వాదంతో తిరిగి వచ్చానని చెప్పారు.

బీఆర్ఎస్ పాలనలో శ్రమ చులకన

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

శ్రమను, శ్రమ జీవులను బీఆర్ఎస్ ప్రభుత్వం చులకనగా చూస్తోందని సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు అన్నారు. కార్మిక హక్కులను కాలరాస్తూ.. సమ్మెలు, ఆర్టీసీలో యూనియన్‌లను నిషేధించిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఈ ఎన్నికల్లో గద్దె దించాలని పిలుపునిచ్చారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సాయిబాబు మాట్లాడారు. కార్మిక సంఘ పోరాటాలకు వామపక్షాలు వెన్నుదన్నుగా ఉన్నాయి కాబట్టి ఈ ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీలకు సీఐటీయూ మద్దతు ఇస్తున్నట్టు తెలిపారు. 30న జరిగే ఎన్నికల్లో సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐ(ఎంఎల్) అభ్యర్థులకు కార్మికులు ఓట్లు వేయాలని కోరారు. 55 రోజుల పాటు ఆర్టీసీలో సమ్మె చేశారనే కారణంతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ పార్టీ యూనియన్‌తో సహా కార్మిక సంఘాలన్నింటినీ నిషేధించిందని తెలిపారు. కార్మిక హక్కులను కాలరాస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఈ ఎన్నికల్లో నిషేధించాలని పిలుపునిచ్చారు. చట్టసభల్లో వామపక్షాలకు ప్రాతినిధ్యం ఉంటేనే కార్మిక హక్కుల పరిరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. 73 షెడ్యూల్ పరిశ్రమల్లో 1.70 కోట్ల మంది కార్మికులకు ప్రతి ఐదేండ్లకు ఒకసారి వేతన సవరణ చేయాల్సి ఉన్నా బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. ఆర్టీసీ భవిష్య నిధి రూ. 1200 కోట్లు, సింగరేణిలో రూ.10వేల కోట్లను ప్రభుత్వం జమ చేసుకొని ఆయా సంస్థలతో పాటు కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీస్తుందని ఆరోపించారు. రిటైరయిన రెండేండ్ల వరకు ఆర్టీసీ కార్మికుల పెన్షన్, బెనిఫిట్స్‌ను ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 1.30 లక్షల మంది కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించలేదని తెలిపారు. అందుకనే వామపక్షాలు కార్మికుల మేనిఫెస్టో విడుదల చేశాయని తెలిపారు. ఎలక్షన్స్ వచ్చేసరికి రూ 400కే గ్యాస్ సిలిండర్ ఇస్తామనడం బీఆర్ఎస్ మోసపూరిత హామీకి నిదర్శనమని చెప్పారు. రాష్ట్ర శాసనసభలో బీఆర్ఎస్ ప్రభుత్వం జీఎస్టీ బిల్లు ప్రవేశపెట్టినప్పుడు సీపీఐ(ఎం) ఎమ్మెల్యే సున్నం రాజయ్య మినహా మిగతా సభ్యులందరూ ఆమోదం తెలిపారని గుర్తు చేశారు. కమ్యూనిస్టులు చట్టసభల్లో ఉంటే ప్రజలపై భారాలు పడకుండా నియంత్రిస్తారన్నారు. అందుకే వామపక్షాల తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులందర్నీ గెలిపించాలని పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) అభ్యర్థులుగా బరిలో ఉన్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్‌తో పాటు నాయకులు పిట్టల అర్జున్, మల్లికార్జున్, యర్ర శ్రీకాంత్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మా విష్ణు, కళ్యాణం వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు వై.విక్రమ్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.రమ్య తదితరులు పాల్గొన్నారు.

అమృత్‌కాల్‌లో...అమృత్ లేదు

(మొదటిపేజీ తరువాయి)

అయితే అమృతం పోయిందని అన్నారు. దేశంలోని రైతులు, కూలీలు, విద్యార్థి, యువకులు, దళితులు, మైనారిటీలు, మహిళల పరిస్థితి అధ్వాన్నంగా ఉందన్నారు. అమ్రారామ్ అసెంబ్లీకి వెళితే దాతరామ్‌ఘడ్‌లోని సామాన్య ప్రజానీకానికి నిజమైన అమృతాన్ని అందిస్తారని అన్నారు. అదే కాంగ్రెస్ అభ్యర్థి గెలిచిన తర్వాత దాతరామ్‌ఘడ్ గ్రామాల్లో తాగునీరు లేదని, ప్రభుత్వ కళాశాల లేదని అన్నారు. ఆ విధంగా కాంగ్రెస్, బీజేపీలు దేశ ఆస్తులను దోచిపెడుతున్నాయని, మన రైల్వేలు, బ్యాంకులు, బీమా, విమానయాన సంస్థలు, పాఠశాలలు, ఆస్పత్రులను దోచుకుంటున్నారని విమర్శించారు. మీ ప్రతినిధిగా అమ్రారామ్‌ను ఎన్నుకోవాలని పిలుపు ఇచ్చారు. నేడు దేశం చాలా సంక్షోభంలో ఉందన్నారు. ఆ రకంగా చూస్తే రాజస్థాన్‌లో జరిగే ఈ ఎన్నికలకు ఎంతో ప్రాధాన్యత ఉందని, ఈ ఎన్నికల్లో రాజస్థాన్ ప్రజలు సీపీఐ(ఎం) అభ్యర్థు లను గెలుపిస్తారని తాను నమ్ముతున్నానని అన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రముఖ రైతు నాయకుడు, సీపీఐ(ఎం) అభ్యర్థి అమ్రారామ్



మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన ఈ 75 ఏండ్లు గడుస్తున్నా ఎనిమిది సార్లు కాంగ్రెస్, ఐదుసార్లు బీజేపీ ఎమ్మెల్యేలు ఎన్నికయ్యారని, అయితే నేటికీ ప్రజలు తాగునీటికి నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. కేంద్రంలో బీజేపీ జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ కూడా ఇదే ప్రాంతంలో పుట్టాడని, కానీ బీజేపీ నీళ్లను అందించలేకపోయిందని విమర్శించారు. 2008లో తనకు అవకాశం ఇచ్చారని, కోట్లాది రూపాయల ప్రణాళికను ఆమోదించి నీటి సమస్య పరిష్కారానికి కృషి చేశానని తెలిపారు. నేడు దంతా, పల్సానా పెద్ద పట్టణాలని, కానీ కాలేజ్ లేకపోవడంతో రైతు కూలీల పిల్లలు ఉన్నత చదువులు చదవలేకపోతున్నారని అన్నారు. కాబట్టి దాతరామ్‌ఘడ్ ప్రజల కలలతో ఆడుకునే వారికి గుణపాఠం చెప్పాలని, ఎర్ర జెండాను ఎన్నుకోవాలని కోరారు.

కాంగ్రెస్ హయాంలో కుండ నీళ్ల కోసం వెళ్లిన మూడో తరగతి దళిత విద్యార్థిని ఇంద్ర మేఘ్వాల్‌ను మీసాలు మెలిసి చంపేశారని, అందుకే సామాన్య ప్రజానీకం, దళితులకు గౌరవం కల్పించేందుకు మీ ప్రతినిధిగా అమ్రారామ్‌ను ఎన్నుకోవాలని ధోడ్ మాజీ ఎమ్మెల్యే పేమారామ్ కోరారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కిషన్ పారిక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేపర్ లీక్ ప్రభుత్వమన్నారు. ఈ సభలో సీపీఐ(ఎం) హర్యానా రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర మాలిక్, మాజీ కార్యదర్శి ఇంద్రజిత్ సింగ్, ఐద్వా నేత ఆశా శర్మ, నేతలు సుభాష్ జాఖర్, భగవాన్ సహాయ్ ధాకా, కుందన్ వర్మ, ఘాసిరామ్ చౌదరి, తారా ధయాల్, సాబీర్ అలీ తదితరులు ప్రసంగించారు.

అంతకుముందు సికార్ నియోజకవర్గం సీపీఐ(ఎం) అభ్యర్థి ఉస్మాన్ ఖాన్‌కు మద్దతుగా జరిగిన భారీ సభను ఉద్దేశించి ఏచూరి ప్రసంగించారు. ఈ సభలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కిషన్ పారిక్ తదితరులు పాల్గొన్నారు.

గెలిస్తే కదా.. సీఎం అయ్యేది

(మొదటిపేజీ తరువాయి)

పొలం దున్నారా.. అవన్నీ తెలియవు కాబట్టే ఉచిత విద్యుత్, రైతు బంధుపై నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేనే సీఎం అనేవాళు కాంగ్రెస్‌లో 15మంది ఉన్నారన్నారు. కాంగ్రెస్ గెలిస్తే కదా.. రేవంత్ సీఎం అయ్యేది అంటూ వ్యాఖ్యానించారు. ఆయన సీఎం అవుతారని ఓటేస్తే.. కొడంగల్ పరిస్థితి మొదటికే వస్తుందని అన్నారు. భూకబ్జాదారుడైన రేవంత్.. సత్యహరిశ్చంద్రుడిలా మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ అంటేనే దళారుల రాజ్యం అని, వారి పాలనలో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందన్నారు. మన భూములు మనకు కాకుండా చేసే కుట్ర కాంగ్రెస్ చేస్తుందన్నారు. కాంగ్రెస్ హయాంలో రూ.200 పింఛన్ ఇస్తే, బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 2000 ఇచ్చినట్టు తెలిపారు. త్వరలోనే దానిని పెంచుతామన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించి, ఎవరు గెలిస్తే రాష్ట్ర గౌరవం పెరుగుతుందో ప్రజలే నిర్ణయించుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని దళితులంతా ధనికులు అయ్యే వరకు దళిత బంధు పథకం కొనసాగుతుందని హామీ ఇచ్చారు. అలాగే, వచ్చే ఏడాది మిషన్ మేడ్‌లో పేదలకు ఇండ్లు నిర్మిస్తామని చెప్పారు. తనకు పదవులపై ఆశలేదని, తెలంగాణను అగ్రగామిగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలిపారు.

కాంగ్రెస్ అంటేనే దళారుల రాజ్యం

కాంగ్రెస్ ధరణి తొలగిస్తే రైతులు ఆగం కావడమే కాక సంక్షేమ పథకాలు పక్కదారి పడతాయన్నారు. దాంతో దళారీ వ్యవస్థ వచ్చి రాష్ట్రం అధోగతి పాలవుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బైపాస్ రోడ్డు పూర్తికావడంతో పాలమూరుకు రవాణా సమస్య తగ్గిందన్నారు. మినీ ట్యాంక్‌బండ్, కేసీఆర్ పార్క్ వంటి పర్యాటక ప్రాంతాలతో పాటు దివిటీపల్లి దగ్గర రూ.10వేల కోట్లతో అమరరాజా బ్యాటరీ కంపెనీ రావడం శ్రీనివాస్ గౌడ్ కృషికి నిదర్శనమన్నారు.

బక్కోడు కాదు.. బకాసురుడు

(మొదటిపేజీ తరువాయి)

డబుల్ బెడ్‌రూమ్‌లు కట్టిస్తానన్న కేసీఆర్.. రూరల్ నియోజకవర్గంలోని ఏ ఒక్క గ్రామంలో ఒక్కరికైనా డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇచ్చిందా అని ప్రశ్నించారు. వారం రోజులు ఓపిక పడితే.. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని, తమ కష్టాలన్నీ తీరుస్తుందని చెప్పారు. ధరణి ఎత్తేసి భూభారతి ద్వారా ప్రజల భూములు కాపాడుతామని అన్నారు. రేషన్ కార్డులు అందిస్తామని చెప్పారు.

కేసీఆర్ ఓడిపోవడం ఖాయం

గజ్వేల్ సభలో మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రాదని కేసీఆర్‌కు తెలిసిపోయిందని, గజ్వేల్‌లో ఓడిపోతానని కామారెడ్డి పారిపోయినట్టు విమర్శించారు. కానీ కామారెడ్డిలో తాను కేసీఆర్‌ను చిత్తుచిత్తుగా ఓడిస్తానని, గజ్వేల్‌లో నర్సారెడ్డి చేతిలో ఓడిపోవడం ఖాయమని అన్నారు. కరీంనగర్, మహబూబ్‌నగర్, సిద్దిపేట ప్రజలను మోసం చేసినట్టు గజ్వేల్ ప్రజలను రెండుసార్లు మోసం చేసి గెలిచారని తెలిపారు. సీఎం కేసీఆర్ బక్కటోడు కాదని బకాసురుడని అన్నారు. కావేరి సీడ్స్ కంపెనీని కాపాడుకొని వరి ధాన్యాన్ని రూ.4,250కు కేసీఆర్ విక్రయించుకుంటున్నారని ఆరోపించారు. రైతులకు మాత్రం రూ.1,960లే ఎందుకు ఇస్తున్నారని ప్రశ్నించారు. మిల్లర్లు, ప్రభుత్వం కలిసి రైతులను దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. కామారెడ్డిలో కేసీఆర్‌ను ఓడగొట్టడానికి వేటగాడుగా మారుతున్నానని అన్నారు.

ఎమ్మెల్యేను బండకేసి కొడితే బిల్లులు వస్తాయంటూ భూపాల్‌రెడ్డిపై ఫైర్

నారాయణఖేడ్ సభలో మాట్లాడుతూ.. నారాయణఖేడ్ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డిని బండకేసి కొడితే.. సర్పంచ్‌ల బిల్లులు అవే వస్తాయని వ్యాఖ్యానించారు. కేసీఆర్ పాలన గాడిదకు గడ్డేసి.. ఆవుకు పాలు పిండినట్టు ఉన్నదని ఎద్దేవా చేశారు. సంజీవరెడ్డి, షెట్కర్ కుటుంబాలు కలిస్తే కేసీఆర్ జేజమ్మ వచ్చినా ఇక్కడ కాంగ్రెస్ గెలుపు ఆపలేరన్నారు. పార్టీని ఐక్యంగా ఉంచడం కోసం సురేష్ షెట్కర్ తన టిక్కెట్‌ను సంజీవరెడ్డికి ఇచ్చారన్నారు. గ్రామపంచాయతీలుగా గుర్తించిన తాండాలకు నిధులు కేటాయించలేదని తెలిపారు. చెరకు ఫ్యాక్టరీ మూతపడటంతో ఇక్కడి రైతులు వలస కూలీలుగా పనికి వెళ్తున్నారని.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వారి సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

బందోబస్తు పెంచండి

(మొదటిపేజీ తరువాయి)

చర్చించినట్టు తెలిసింది. వాటిని దృష్టిలో ఉంచుకొని తాజాగా మరో 20 శాతం అధికంగా సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించినట్టు తెలిసింది. ప్రధానంగా ఈ సారి బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల మధ్య ముక్కోణపు పోరు జరుగుతున్న ప్రాంతాల్లో పోలింగ్ సందర్భంగా గొడవలు జరిగే అవకాశం ఉన్నదని ఇంటెలిజెన్స్ విభాగం అంతర్గతంగా హెచ్చరించినట్టు తెలిసింది. దీంతో ఆయా ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించాలని డీజీపీ యోచిస్తున్నట్టు సమాచారం. అలాగే, ఎస్పీలు, నగర పోలీసు కమిషనర్ల నుంచి కూడా ఆయన సమాచారాన్ని సేకరిస్తున్నట్టు తెలిసింది. ముఖ్యంగా, పాత బస్తీ మొదలుకొని భువనగిరి, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, నిజామాబాద్ అర్బన్ మొదలైన ప్రాంతాల్లో మతపరమైన ఉద్రిక్తతలు చోటు చేసుకోకుండా ఇంటెలిజెన్స్ వ్యవస్థను మరింత చురుకుగా పని చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించినట్టు తెలిసింది. అలాగే, 33 జిల్లాల్లో మొత్తం 49 లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేయటానికి ఎన్నికల కమిషన్ అనుమతినివ్వటంతో ఆ కేంద్రాల వద్ద కూడా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేస్తున్నట్టు సమాచారం.

మోడీ, కేసీఆర్ ఇద్దరూ ఒక్కటే

(మొదటిపేజీ తరువాయి)

కూడా దారి మళ్లించి దుర్వినియోగం చేస్తున్నారన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ఒంటరిగా పోరాటం చేస్తుందని, బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం కలిసి కాంగ్రెస్‌పై కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసేందుకు ప్రజలు మద్దతు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ స్టార్ క్యాంపెనర్, నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, హుజూర్‌నగర్ అభ్యర్థి ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మెన్ నేతి విద్యాసాగర్, కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బుర్రి శ్రీనివాసరెడ్డి, తిప్పర్తి జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు గుమ్మల మోహన్ రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మెన్ అబ్బగోని రమేశ్‌గౌడ్, డీసీసీ బీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈసారి అంత ఈజీ కాదు..

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్యేలు కాకుండా మిగతా ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మెన్లు, జిల్లాల అధ్యక్షులు, ఇతర ప్రజా ప్రతినిధులు, ప్రధాన బాధ్యులందరూ ఈనెల 30 దాకా నియోజకవర్గాలు వీడి బయటకు రావద్దంటూ ఆయన ఆదేశాలు జారీ చేశారు. కులాలు, వర్గాలు, తరగతుల వారీగా ఓటర్లను కలుస్తూ, ఆత్మీయ సమ్మేళనాలు, సమావేశాలు నిర్వహించాలని సూచించారు. తద్వారా ఏ ఒక్క ఓటరు 'చే'జారి పోకుండా చూసుకోవాలని కోరారు. ముఖ్యంగా 'తటస్థ' ఓటర్లపై దృష్టి

ఇక కాంట్రాక్టర్ల వంతు

(మొదటిపేజీ తరువాయి)

కూడా రోడ్లపై బైఠాయించి, పోరాటాలు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఓ గుత్తేదారు ఆందోళన వ్యక్తం చేశారు. సీఈఆర్సీ చీఫ్ ఇంజినీర్ ఆధ్వర్యంలో ఈ ఏడాది సెప్టెంబర్ 29న ఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో మెజారిటీ రాష్ట్రాల ఎలక్ట్రికల్ ఇన్స్‌పెక్టర్లు దీనికి ఆమోదం తెలిపారని పేర్కొంది. అదే సందర్భంలో ఏ రాష్ట్రం నుంచి లైసెన్స్ తీసుకున్నా, పొరుగు రాష్ట్రాల్లో కాంట్రాక్టులు చేసుకొనేందుకు ఉన్న షరతుల్ని కూడా సడలించారు. పొరుగు రాష్ట్రాల్లో పనులు చేయాలంటే కాంట్రాక్టర్ లైసెన్స్, వర్క్‌మెన్ పర్మిట్, సూపర్‌వైజరీ కాంపిటెన్సీ సర్టిఫికెట్‌ను మాత్రమే పరిశీలిస్తే చాలని పేర్కొన్నారు. లైసెన్సులు ఇచ్చే అధికారాన్ని ఆయా రాష్ట్రాల ప్రభుత్వ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్స్‌పెక్టర్లకు అప్పగించారు. రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లోని కాంట్రాక్ట్ విధానంలో ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్టర్లకు టెండర్లలో కొంత శాతం ఇవ్వాలనే షరతులు ఉన్నాయి. కేంద్రం తెచ్చిన ఒకే దేశం-ఒకే లైసెన్స్ విధానంతో వీటికి గండిపడే అవకాశాలు ఉన్నాయి.

పద్దేమిదేండ్ల వయసులోనే
పోరాట బాట

ప్రజా సంక్షేమం కోసమే పోటీ
అమరవీరుల పోరాట వారసత్వం
సీపీఐ(ఎం) భద్రాచలం
అభ్యర్థి కారం పుల్లయ్య



అమరవీరుల స్ఫూర్తితో పద్దేమిదేండ్ల వయసులోనే బడుగు బలహీన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు చేస్తున్నట్టు సీపీఐ(ఎం) భద్రాచలం ఎమ్మెల్యే అభ్యర్థి కారం పుల్లయ్య తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన నవతెలంగాణతో ప్రత్యేకంగా మాట్లాడారు. యలమంచిలి సీతారామయ్య, బండారు చంద్రావు స్ఫూర్తితో ప్రజాసంఘాల్లో పని చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం గిరిజన సంఘం బాధ్యతలను చూస్తూనే సీపీఐ(ఎం) మండల కార్యదర్శిగా, జిల్లా కార్యదర్శివర్గ సభ్యునిగా గిరిజన, గిరిజనేతరులు ఎదుర్కొంటున్న అనేక రకాల సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తున్నానని చెప్పారు. ఆయన మాటల్లోనే..

ప్రధాన పోరాటాలు, ఎదుర్కొన్న నిర్బంధాలపై..

పోలవరం ఎత్తు తగ్గించాలని పార్టీ నిర్వహించిన పోరాటంలో భాగస్వామినయ్యాను. 25 రోజులపాటు జైలు జీవితాన్ని గడిపాను. పోడు భూములకు పట్టాల కోసం జరిగిన పోరాటంలో అనేక నిర్బంధాలను ఎదుర్కొన్నాను. గిరిజన, గిరిజనేతర, ఇతర పేదల కోసం జరిగిన ఇండ్ల స్థలాల పోరాటాలు, సంక్షేమ పథకాల పోరాటాలకు నాయకత్వం వహించి అనేకసార్లు పోలీస్ లాఠీ దెబ్బలతో పాటు పలు కేసులు ఎదుర్కొన్నాను. కరోనా కాలంలో దుమ్ముగూడెం మండలంలో యలమంచిలి సీతారామయ్య ట్రస్టు పేరుతో వందలాది కుటుంబాలకు నిత్యావసర వస్తువులతో పాటు వైద్య సదుపాయాలను అందించాం. బండారు చంద్రావు ట్రస్టు పేరుతో భద్రాచలంలో ఐసోలేషన్ కేంద్రం నిర్వహిస్తూ 300 మంది కరోనా రోగులకు వైద్యం అందించడంలో భాగస్వామినయ్యాను. ఎస్టీ, ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు విడుదల చేయాలని నియోజకవర్గ వ్యాప్తంగా సైకిల్ యాత్ర నిర్వహించాను.

భద్రాచల నియోజకవర్గ ప్రధాన సమస్యలు..?

భద్రాచలం పట్టణాన్ని గోదావరి ముంపు నుంచి కాపాడేందుకు కరకట్ట ఎత్తు పొడవు పెంచడం, ఆంధ్రప్రదేశ్‌లో కలిసిన ఐదు పంచాయతీలను భద్రాచలంలో కలిపేందుకు కృషి చేస్తాను. భద్రాచలం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో ఖాళీ పోస్టుల భర్తీ, ఏజెన్సీలో మెరుగైన వైద్యాన్ని అందించేందుకు పనిచేస్తా. వలస ఆదివాసీలకు గుర్తింపుతో పాటు మిగిలి ఉన్న పోడు భూములకు పట్టాలు, తునికాకు కార్మికులకు బోనస్, ఆదివాసీలందరికీ ఇంటి స్థలంతో పాటు సొంత ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం. ఆదివాసీ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పోరాడుతాను. భవన నిర్మాణ కార్మికులకు ప్రతిరోజు పని దొరికేందుకు ఇసుక అందుబాటులోకి తీసుకురావడం కోసం పనిచేస్తాను.

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులపై..?

భద్రాచలం నియోజకవర్గంలో మాకు ప్రధాన పోటీ కాంగ్రెస్ పార్టీ. ఆ పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యే పొదెం వీరయ్యపై అవినీతి ఆరోపణలున్నాయి. దళిత బంధు లబ్దిదారుల నుంచి రూ.3 లక్షలు వసూలు చేయడంతో పాటు ఇతర సంక్షేమ పథకాల్లో కూడా చేతివాటం ప్రదర్శించారని వార్తలు వచ్చాయి. భద్రాచలానికి ఆయన అతిధి ఎమ్మెల్యేగానే వ్యవహరిస్తున్నారు. ఏ సమస్యపైనా ప్రభుత్వంపై పోరాడిన సాధించిన సందర్భాలు కూడా లేవు. బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తున్న తెల్లం వెంకట్రావు సైతం సంవత్సరానికి ఒక పార్టీ మారుతూ ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో తెలియదు. అరాచకవాదులను తమ పార్టీలో చేర్చుకొని నియోజకవర్గ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఆయనకు ప్రజా సమస్యలపై ఏమాత్రం అవగాహన లేదు.

30న జరిగే ఎన్నికల ఫలితాలపై మీ అంచనా..?

కచ్చితంగా ఈ ఎన్నికల్లో సీపీఐ(ఎం) గెలిచి తీరుతుందన్న విశ్వాసం ఉంది. ప్రస్తుత భద్రాచల అభివృద్ధి మొత్తం సీపీఐ(ఎం) ప్రజాప్రతినిధులు కుంజా బొజ్జి, ముర ఎర్రయ్య రెడ్డి, సున్నం రాజయ్య మిడియం బాబురావు ప్రజా ప్రతినిధులుగా ఉన్నప్పుడే జరిగింది. ఇప్పుడు సీపీఐ(ఎం) అధికారంలో లేని లోటు స్పష్టంగా కనబడుతోంది. పార్టీ కార్యకర్తలే, నియోజవర్గ ప్రజల ఆశీస్సులతో ఎన్నికల్లో గెలిచి భద్రాచలం అభివృద్ధికి కృషి చేస్తా.



హంగూ ఆర్భాటం లేకుండా
ప్రజలవద్దకే అభ్యర్థులు

- ఒక్కొక్క చోట ఒక్కో సమస్యను వివరిస్తూ...
- సీపీఐ(ఎం) కార్యకర్తల ఇంటింటి ప్రచారాలు

పోరాడేవారికే ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి



నవతెలంగాణ-విలేకరులు

ప్రజా సమస్యలపై పోరాట విజయాలే సీపీఐ(ఎం) ఎన్నికల అజెండా అని, ఆ పోరాట వారసత్వం కలిగిన తమకు ఓటేసి గెలిపించాలని సీపీఐ(ఎం) అభ్యర్థులు ప్రజలను కోరడం ఆకట్టుకుంటోంది. ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, వరంగల్, మెదక్, రంగారెడ్డి జిల్లాలోని 19 చోట్ల సీపీఐ(ఎం) తమ అభ్యర్థులను రంగంలోకి దింపింది. అభ్యర్థులందరూ పోరాట చరిత్ర ఉన్నవారే. సమస్యలపై పోరాడుతున్నవారే. ప్రజా సంక్షేమమే పరమావధిగా పని చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీల మాదిరి హంగూ ఆర్భాటాలతో సభలు నిర్వహించలేకున్నా... ఇండ్లవద్దే ప్రజలను కలుస్తూ ఓట్లు అడగడం చర్చనీయాంశమవుతోంది.

ఇంటింటికి వెళ్లడంతో పాటు కూలీల అడ్డాలు, వ్యాపార కూడళ్ల వద్దకు వెళ్లి ఓటర్లను కలుస్తున్నారు. పీఎన్ఎం కళాకారులు కళారూపాలు ప్రదర్శిస్తున్నారు. సమస్యలను తెలుసుకుంటూ వాటికి పరిష్కారమార్గమేంటో కూడా చూపుతున్నారు. ఇతర పార్టీల అభ్యర్థులను ప్రజలు నిలదీస్తున్నా.. సీపీఐ(ఎం) అభ్యర్థులను మాత్రం ఆదరిస్తున్నారు. పోరాడే వారికే తమ మద్దతు ఉంటుందని తమను కలిసిన సీపీఐ(ఎం) అభ్యర్థులకు చెబుతున్నారు. ప్రజలను ఆలోచింపచేసేలా ఏ పార్టీ అభ్యర్థి చరిత్ర ఏంటో.. ఏ పార్టీ విధానమేంటో గెలిచాక ఏమి చేయబోతుంది.. గెలిచిన వారు పార్టీలు మారిన విధానాన్ని వివరించుకుంటూ పోతున్నారు.

బుధవారం ఖమ్మం సీపీఐ(ఎం) అభ్యర్థి యర్రా శ్రీకాంత్ ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో త్రీ టౌన్ ప్రాంతంలోని గాంధీ చౌక్ చౌరస్తా వద్ద బిల్డింగ్ వర్కర్స్ కార్మికులను కలిసి మాట్లాడారు. ఎస్బీఐ ప్రధాన కార్యాలయం, జిల్లా ఫారెస్ట్ డిపార్ట్మెంట్, డీసీసీబీ బ్యాంకు నందు జోరుగా ప్రచారం నిర్వహించారు. ప్రజలు ఆలోచించి నిత్యం ప్రజల కోసం కార్మికుల, ప్రజల కోసం పనిచేస్తున్న సీపీఐ(ఎం)కు ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు.


భద్రాచలం నియోజకవర్గంలోని దుమ్ముగూడెం ప్రాంతంలో కారం పుల్లయ్యకు మద్దతుగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాలలో ప్రజలను, వ్యాపార వర్గాలను ఓట్లు అభ్యర్థించారు. అసమర్థ కాంగ్రెస్, అవకాశవాద బీఆర్ఎస్ పార్టీలకు చెందిన ఎమ్మెల్యేల అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో వస్తే అ పార్టీలో చేరి సొంత ప్రయోజనలకే పరిమితమౌతారని అదే వైరాలో సీపీఐ(ఎం) నుంచి పోటీ చేస్తున్న భూక్య వీరభద్రంని గెలిపిస్తే ప్రభుత్వం మెడలు వంచి సంక్షేమ పథకాలు సంపూర్ణంగా అమలు చేయిస్తాడని సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. కొణిజర్ల మండలం బస్వాపురంలో ఆయన పాల్గొన్నారు. మధిర నియోజవర్గంలో ఆగిన అభివృద్ధి తన గెలుపుతో ముందుకుపోతుందని మధిర సీపీఐ(ఎం) అభ్యర్థి పాలడుగు భాస్కర్ విజ్ఞప్తి చేశారు. ఎర్రుపాలెంలోని పలు గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. ప్రచార రథం వెంట బైకులతో ర్యాలీ నిర్వహించారు. డప్పు దరువులతో పూల మాలలతో హారతులతో ఘన స్వాగతం పలికారు.

డబ్బు సంచులతో వచ్చే వాళ్లకు, దందాలు చేసే వాళ్లకు, అసెంబ్లీలో మాట్లాడలేని వారికి ఓటు వేయొద్దని సీపీఐ(ఎం) ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి రంగారెడ్డి అన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గం వేములపల్లి మండలంలోని అన్నపరెడ్డిగూడెం, వేములపల్లి, బుగ్గ బావి గూడెం, సల్కునూరు గ్రామాలలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తనని గెలిపిస్తే ముందు బెంచీలో కూర్చుని ప్రజా సమస్యలు పరిష్కరిస్తానని అన్నారు.

అతనికి ఆమె అండ..

- భర్త గెలుపునకు భార్య సహకారం
- మహిళా ఓటర్లను ఆకర్షిస్తున్న వైనం
- పోల్ మెనేజ్‌మెంట్‌లోనూ వ్యూహాలు

గెలుపు కోసం యుద్ధ క్షేత్రంలోకి సకుటుంబ పరివారం



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

ఎన్నికల్లో మనకు ప్రత్యేక్షంగా కనిపించేంది అభ్యర్థి మాత్రమే. కానీ అతని గెలుపు కోసం ఎందరో కష్టపడతారు. వీరిలో ముందు వరసలో ఉంటారు కుటుంబ సభ్యులు. ముఖ్యంగా భర్త గెలుపు కోసం భార్యలు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ముఖ్యంగా మహిళా ఓటర్లను ఆకర్షించడంలో వీరిదే కీలకపాత్ర. ఎన్నికల యుద్ధ క్షేత్రంలో గెలుపు కోసం ప్రత్యేక వ్యూహాలు రచిస్తున్నారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మొత్తం 12 నియోజకవర్గాలున్నాయి. రంగారెడ్డిలో ఎనిమిది నియోజకవర్గాలు, వికారాబాద్ జిల్లాలో నాలుగు నియోజకవర్గాలు ఉన్నాయి. అన్ని నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల మధ్య పోటీ తీవ్రంగా ఉంది. ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటంతో అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. పోటాపోటీగా గ్రామాలను చుట్టి వస్తున్నారు. ఈ ప్రచారంలో అభ్యర్థులతోపాటు కుటుంబ సభ్యులు చురుగ్గా పాల్గొంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా చాలాచోట్ల ఇదే పరిస్థితి ఉంది. ఏమాత్రం శ్రమ అనుకోకుండా ప్రచారంలో భాగస్వాములవుతూ గెలుపునకు తమ వంతు కృషి చేస్తున్నారు. వారితోపాటు ఎమ్మెల్యే అభ్యర్థుల అనుచరుల కుటుంబాలూ భాగస్వాములవుతున్నాయి.

మహిళా ఓటర్లపై ఫోకస్

అభ్యర్థుల తరపున ప్రచారం చేస్తున్న వారి కుటుంబ సభ్యులు ముఖ్యంగా మహిళ ఓటర్లపై ఫోకస్ పెట్టారు. అభ్యర్థుల భార్యలు ప్రచారంలో భాగంగా మహిళ ఓటర్లను ప్రభావం చేసే ప్రయత్నం చేస్తున్నారు. మహిళల కోసం చేపడుతున్న కార్యక్రమాలను వివరించడంతోపాటు సానుభూతి పెంచుకోవడం ద్వారా ఓట్లు రాబట్టుకునేందుకు కృషి చేస్తున్నారు. అభ్యర్థుల పిల్లలు ముఖ్యంగా యువత ఓట్లను ఆకర్షిస్తున్నారు. ప్రత్యేక స్పీచ్‌లతో ఆకట్టుకుంటున్నారు. ఇలా అభ్యర్థి గెలుపు కోసం కుటుంబ మొత్తం ఎన్నికల క్షేత్రంలోకి వెళ్లారు. వీరి కష్టం ఏ మేర ఫలిస్తుందో తెలియాలి అంటే మరికొన్ని రోజులు వేచిచూడాల్సిందే..

పంచ్ తంత్రం!

ఎదుటివాడిని దొల్త కదిలించి చూసేయి
బలము లేకుంటె చెయ్ బలి పశువును
పడగొట్టుటకు ముందు తొడగొట్టి చూదాలి
అదిరెనా పని కాస్త అల్కనౌను
శత్రుపక్షపు వాడి శత్రువెవ్వడొజూసి
వాన్ని లేపగవలె వీన్ని తొక్క
గట్టి పిండమెయైతె పట్టు గట్టిగ పట్టి
సకల శక్తులతోడ సమరమప్పుడు

అవసరమైన వేళలో తెల్విజూపి
ఎత్తుగడలోనె అంతటా చిత్తుచేసి
ఎన్నికలు గెల్వవలెకొంతఎత్తుగడతొ
అక్కరున్నంత నేజేతు రసలు పోరు

– ఏనుగు నరసింహారెడ్డి



గాల్లో దీపం...
గీతన్న బతుకు



గీతకార్మికుల బతుకు గాల్లో దీపంలా ఉంది. దినదిన గండం నూరేళ్ల ఆయుస్సులా బతుకు పోరాటాన్ని సాగిస్తున్నారు.అత్యంత ప్రమాదకర వృత్తి ఏదైనా ఉందీ అంటే..అది గీత వృత్తే. రెండు రోజులకొకరు చెట్టుమీది నుంచి ప్రమాదవ శాత్తు పడి చనిపోతున్నారంటే.. వారి పరిస్థితి ఎంత ఆందోళనగా ఉందో అర్థం చేసుకోవచ్చు.ఏడాదికి సుమారు 200 మంది చినిపోతున్నారు. 550మంది తీవ్రమైన గాయాలతో మంచంపడుతున్నారు. ఇంటిపెద్ద మంచాన పడితే..ఆ కుటుంబాన్ని ఆదుకునే దిక్కులేక అవస్థలు పడుతున్న వారెందరో..?

పోరాటాలతోనే హక్కులు సాధన

- ఏడాదికి 200మంది ప్రమాదవశాత్తు మృతి
- నీటి మూటగా ప్రమాద నివారణా చర్యల హామీ
- బడ్జెట్ కేటాయింపుల్లో వివక్ష
- సర్కార్ సంక్షేమం మాటల్లోనే

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

గీత వృత్తి పరిరక్షణ, కార్మికుని సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తున్నదని ప్రభుత్వం బాకాలూదుతున్నది. అది మాటల వరకే తప్ప..క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి లేదని వారు వాపోతున్నారు. ప్రమాద నివారణకోసం సేఫ్టీ మోకులు ప్రభుత్వమే అందజేస్తుందని కార్మికులకు ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. రాష్ట్రంలో 2.50లక్షల మంది గీత కార్మికుల్లో ఏ ఒక్కరికి సేఫ్టీ మోకులు అందలేదు. వృత్తి చేసుకునే వారికి మోపెడ్‌లు అందజేస్తామన్నది..అదీ కేవలం ఎన్నికల హామీగానే మిగిలింది. గీత కార్మికుల సంక్షేమానికి, బతుకు భద్రతకు బడ్జెట్‌లో రూ.5వేల కోట్లు కేటాయించాలనే డిమాండ్‌ను పెడచెవిన పెట్టింది. రూ.100కోట్లు కేటాయించి, అందులో నీరాకు రూ.25కోట్లు, సంక్షేమానికి కార్పొరేషన్‌ద్వారా ఖర్చు చేస్తామని చెప్పిన రూ.30కోట్లలో ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకపోవటం చూస్తే..గీత కార్మికుల అభివృద్ధి పట్ల ప్రభుత్వ చిత్త శుద్ధి అర్థమవుతుందని కార్మిక సంఘాలంటున్నాయి. 'నెల రోజుల్లో గీతన్న బీమా' అమలుకు నోచుకోని హామీగానే మిగిలింది. 'కుల వృత్తులకు ఆర్థిసాయం పథకం' గీత కార్మికులకు అందని ద్రాక్షలా మిగిలింది.

నీరా.. నీరసం..

ఆరోగ్యానికి హాని తలపెట్టని 'నీరా' ఉత్పత్తుల పట్ల ప్రభుత్వం మాటలతో కోటలు కడుతున్నదని కార్మికులు భావిస్తున్నారు. నీరా కేంద్రాలను ఎక్కువగా నెలకొల్పి..దాని ప్రయోజనానికి ప్రచారాన్ని కల్పించాలి. బహుళజాతి కంపెనీల శీతల పానియాల అడ్వటైజ్‌మెంట్లకు ధీటుగా విస్తృత ప్రచారానికి ప్రభుత్వం ముందుకు రావాలి. అప్పుడే..అనుసంధాన ఉత్పత్తులకు గిరాకీ వస్తుంది. తద్వారా గీత కార్మికుడికి తగిన ఉపాధి లభిస్తుందని సంఘం నేతలు ప్రభుత్వం దృష్టికి పలు మార్లు తీసుకుపోయారు.

వృత్తి ఆధునీకరణకు కృషి ఉత్తమాటే..

కల్లు గీత వృత్తిదారులకు ఆర్థికంగా అభివృద్ధి చేయటం, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వృత్తిని ఆధునీకరించి ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. తగిన విధంగా రుణాలు అందించాలి. కానీ..బీఆర్ఎస్ తొమ్మిదేండ్ల కాలంలో రుణాలు, తగిన విధంగా నిధుల కేటాయింపుల్లేవు. కార్పొరేషన్‌కు బడ్జెట్ కేటాయింపులు లేవు. కేటాయించిన అరకొర బడ్జెట్..సిబ్బంది జీతభత్యాలు, ఆఫీసు నిర్వహణకే ఖర్చు చేస్తుంది.

పోరాటాలే మార్గం..

ఎక్స్‌గ్రేషియో కోసం తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం ఎన్నో పోరాటాలు నిర్వహించింది. పలు రూపాల్లో ఉద్యమాలకు రూపకల్పన చేసింది. ఈ నేపథ్యంలో ఐదేండ్ల కాలంలో రూ.20కోట్లు కార్మికులకు ఎక్స్‌గ్రేషియో సాధించింది. ప్రమాదవ శాత్తు చెట్టుపైనుంచి పడ్డ కార్మికుడికి తక్షణ సాయంగా టాడీ కార్పొరేషన్ ద్వారా రూ.25వేలు 2021నుంచి అమల్లోకి వచ్చింది. ఎక్స్‌గ్రేషియో రూ.2లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచటం గీత కార్మికుల పోరాట ఫలితమే. మెడికల్ సర్టిఫికేట్‌లో



ప్రతిబంధకంగా ఉన్న నిబంధనలు తొలగించాలని పలు రకాల ఆందోళనలు సంఘం నేతృత్వంలో జరిగాయి. దీంతో ప్రభుత్వం దిగిరాక తప్పలేదు.

'హంగ్' కోసం
బీజేపీ ఆరాటం

రేవంత్‌రెడ్డి పక్కా ఆర్ఎస్ఎస్ వాది

- 110 స్థానాల్లో 'మామ'ను గెలిపించండి
- 'మీట్ ది ప్రెస్'లో ఏఐఎమ్ఐఎమ్ అధ్యక్షులు అసదుద్దీన్ ఓవైసీ



నవతెలంగాణ–హైదరాబాద్‌బ్యూరో

గాంధీభవన్ రిమోట్ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్‌భగవత్ చేతుల్లో ఉందనీ, ఆయన ఎలా చెప్తే, ఇక్కడి పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి అలా నడుస్తారని ఆలిండియా మజ్లిస్ ఏ ఇత్తెహదుల్ ముస్లిమీన్ (ఏఐఎమ్ఐఎమ్) అధ్యక్షులు అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. రేవంత్‌రెడ్డి పక్కా ఆర్ఎస్ఎస్ వాది అనీ, గతంలో ఆయన బీజేపీ అభ్యర్థుల తరఫున ప్రచారం కూడా చేశారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో బుధవారంనాడిక్కడి బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు. ప్రస్తుత ఎన్నికల్లో తమపార్టీ 9 స్థానాల్లో పోటీ చేస్తున్నదనీ, మిగిలిన 110 నియోజవర్గాల్లో 'మామ' (సీఎం కేసీఆర్)కు మద్దతు ఇస్తున్నామనీ స్పష్టం చేశారు. బీజేపీని ఓడించాలంటే, ఓట్లు చీలకూడదనీ, అందువల్లే తాము బలంగా నిజమాబాద్ రూరల్, అర్బన్, కరీంనగర్, ముషీరాబాద్, మహబూబ్‌నగర్ వంటి స్థానాల్లో కూడా పోటీ చేయట్లేదన్నారు. కాంగ్రెస్ అసమర్థత వల్లే అక్కడ బీజేపీ గెలుస్తున్నదనీ, దాన్ని ఒప్పుకోలేకే తమపై నిందలు వేస్తున్నారని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అభ్యర్థి, క్రికెటర్ అజారుద్దీన్‌పై పోటీ చేయడాన్ని ఆయన సమర్థించుకున్నారు.

ఆ స్థానం నుంచి తాము చాలా సంవత్సరాలుగా పోటీచేస్తున్నామని తెలిపారు. ఎన్నికల్లో మతం ప్రాతిపదిక కాదనీ, తమది సెక్యులర్ పార్టీ అని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్‌తో తమకు ఎలాంటి ఎన్నికల పొత్తు లేదనీ, అలాగని ప్రత్యర్థులమూ కాదన్నారు. ఎన్సీఆర్టీలో రామాయణం, మహాభారతం వంటి పాఠ్యాంశాలు చేర్చడంపై స్పందిస్తూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్ వంటి వారి పాఠాల్ని ఎందుకు తొలగించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో హంగ్ రావాలని బీజేపీ ప్రయత్నిస్తున్నదనీ, దానివల్ల వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో లబ్ది పొందాలనేది ఆపార్టీ రాజకీయ ఎత్తుగడ అని విశ్లేషించారు. కానీ రాష్ట్ర ఓటర్లు చైతన్యవంతులనీ, ఆ అవకాశం బీజేపీకి ఇవ్వబోరని విశ్వాసం వ్యక్తంచేశారు. కార్యక్రమానికి విరాహత్ అలీ సమన్వయకర్తగా వ్యవహరించారు. టీయూడబ్ల్యూజే జాతీయ కార్యవర్గ సభ్యులు ఎమ్ఏ మాజిద్, హెచ్‌యూజే నాయకులు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

ద్రవ్యోల్బణ కట్టడికి అన్ని ప్రయత్నాలు

- సుస్థిరత కోసమే వ్యక్తిగత రుణాలపై వెయిటేజీ :

ఆర్‌బిఐ గవర్నర్ దాస్ వెల్లడి



న్యూఢిల్లీ: దేశంలో ద్రవ్యోల్బణాన్ని తగ్గించేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. ధరల పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. బుధవారం ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ (ఫిక్కీ), ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబిఎ) సంయుక్తంగా నిర్వహించిన ఓ కార్యక్రమంలో శక్తికాంత దాస్ పాల్గొని మాట్లాడారు. తాను ఇటీవల ఓ విమానాశ్రయానికి వెళితే అక్కడే ఉన్న సిఐఎస్ఎఫ్ బృందం కూడా అధిక ధరలు, వడ్డీ రేట్ల గురించి ప్రశ్నలడిగారని దాస్ తెలిపారు. ప్రజలకు ఆర్థిక అంశాలపై ఎంతో అవగాహన ఉందన్నారు. వాతావరణ ప్రతికూల పరిస్థితులతో ఆహారోత్పత్తుల ధరలు ఇప్పటికీ ఆందోళనకరంగానే ఉన్నాయన్నారు.

ద్రవ్యోల్బణం క్రమంగా అదుపులోకి వస్తోందన్నారు. అమెరికా ట్రెజరీ రాబడులు అధికంగా ఉన్నప్పటికీ.. రూపాయి స్వల్ప స్థాయిలోనే ఒత్తిడిని ఎదుర్కొందన్నారు. ధరల ఒత్తిడిని అధిగమించాలంటే వ్యవసాయ ఉత్పత్తుల సరఫరా, మార్కెటింగ్‌లో సంస్కరణలు అవసరమన్నారు. రుణాల జారీలో సుస్థిరత సాధించాలన్న లక్ష్యంతోనే వ్యక్తిగత, క్రెడిట్ కార్డు రుణాలపై రిస్క్ వెయిట్‌ను పెంచినట్లు తెలిపారు. వృద్ధిని దృష్టిలో పెట్టుకునే గృహ, వాహన రుణాలను అందులోంచి మినహాయించామన్నారు. ప్రస్తుతం బ్యాంకింగ్ వ్యవస్థపై ఎలాంటి ఒత్తిడి లేదన్నారు. అయినప్పటికీ బ్యాంకులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సూచించారు.

మార్కెట్లోకి ఇ-స్ప్రింటో నుంచి రపో, రోమి స్కూటర్లు



న్యూఢిల్లీ : విద్యుత్ ద్విచక్ర వాహనాల తయారీ కంపెనీ ఇ-స్ప్రింటో ఆవిష్కరించిన రాపో, రోమి మోడళ్లను మార్కెట్లోకి విడుదల చేసింది. 2023 నవంబర్ 21న వీటిని అధికారికంగా ఆవిష్కరించింది. తాజాగా వీటిని విక్రయానికి అందుబాటులోకి తెచ్చినట్లు ఆ కంపెనీ బుధవారం వెల్లడించింది. రపో ధరను రూ.54,999గా, రోమి ధరను రూ.62,999గా నిర్ణయించింది. కాలేజీ విద్యార్థులు, గిగ్ వర్కర్స్, పట్టణ ప్రయాణికుల అవసరాలను తీర్చనున్నాయని ఆ సంస్థ పేర్కొంది. వీటిని ఒక్కసారి ఛార్జింగ్ చేస్తే 100 కిలోమీటర్ల మేర ప్రయాణించవచ్చని ఇ-స్ప్రింటో కో ఫౌండర్ అతుల్ గుప్తా తెలిపారు.

టాటా టెక్ ఇష్యూకు భలే క్రేజీ

- తొలి రోజు 6.5 రెట్ల స్పందన



ముంబయి: టాటా గ్రూపు నుంచి దాదాపుగా 19 ఏళ్ల తర్వాత తొలిసారి ఇష్యూ కు వచ్చిన టాటా టెక్నాలజీస్‌కు ఇన్వెస్టర్లలో చాలా ఆసక్తి నెలకొంది. బుధవారం ప్రారంభ మైన టాటా టెక్నాలజీస్ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు అనుహ్య డిమాండ్ వచ్చింది. తొలి గంటలోనే 4.50 కోట్ల షేర్లకు సబ్‌స్క్రిప్షన్ వచ్చింది. ఈ ఇష్యూలో ద్వారా రూ.3042.5 కోట్లు సమీకరించాలని ఆ కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. టాటా మోటార్స్‌కు చెందిన టాటా టెక్నాలజీస్ ఇంజినీరింగ్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ డిజిటల్ సర్వీసెస్ సంస్థ, జాగ్వార్ ల్యాండ్‌రోవర్ సహా టాటా గ్రూప్‌లోని ఇతర సంస్థలకు ఇది ప్రధానంగా సేవలందిస్తోంది. ఈ ఐపిఒలో భాగంగా టాటా మోటార్స్ 11.4 శాతం వాటాకు సమానమైన షేర్లను విక్రయించనుంది. మంగళవారం యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి టాటా టెక్ రూ.791 కోట్లు సమీకరించింది. నవంబర్ 24 నాటితో ఈ ఇష్యూకు దరఖాస్తు ముగియనుంది. తొలి రోజు ఇష్యూలో 6.54 రెట్ల స్పందన వచ్చిందని మార్కెట్ వర్గాలు వెల్లడించాయి.

అపోలోలో అత్యంత అధునాతన రోబోటిక్ రేడియో సర్జరీ సిస్టమ్



చెన్నయ్: ఆరోగ్య సంరక్షణ లో మరో కొత్త శకానికి నాంది పలుకుతున్నట్లు అపోలో క్యాన్సర్ సెంటర్ పేర్కొంది. క్యాన్సర్ చికిత్స కు సంబంధించి దక్షిణా సియాలో తొలిసారి చెన్నయ్‌లో తొలి సైబర్ నైఫ్ ఎస్7 ఎఫ్ఐఎం రోబోటిక్ రేడియో సర్జరీ సిస్టమ్‌ని పరిచయం చేసినట్లు ప్రకటించింది. ఇది క్యాన్సర్, క్యాన్సర్ కాని కణితులకు ఖచ్చితమైన చికిత్సా విధానం అందుతుందని రేడియేషన్ అంకాలజీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ మహదేవ్ పోతరాజు పేర్కొన్నారు. దీంతో చికిత్స సెషన్‌లు నాన్ ఇన్వాసివ్ ఔట్ పేషెంట్ విధానాలు, అనస్తీషియా, కోతల అవసరం ఉండదన్నారు.

కర్నాటకలో టికెఎం రూ.3,300 కోట్ల పెట్టుబడులు

బెంగళూరు : కర్నాటకలో కొత్త ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రముఖ కార్ల తయారీ కంపెనీ టయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) ప్రకటించింది. 2026 నాటికి అందుబాటులోకి రానున్న ఈ యూనిట్ కోసం అక్కడి రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు పేర్కొంది. ఇందుకోసం రూ.3,300 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. ఇక్కడ ఏడాదికి లక్ష యూనిట్ల తయారీ చేపట్టనున్నామని.. 2వేల మందికి ఉపాధి లభించనుందని వెల్లడించింది.

జొమాటో, స్విగ్గీలకు జిఎస్‌టి నోటీసులు..!

న్యూఢిల్లీ : ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థలైన జొమాటో, స్విగ్గీలకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జిఎస్‌టి ఇంటెలిజెన్స్(డిజిజిఐ) నోటీసులు జారీ చేసిందని సమాచారం. జొమాటో రూ.400 కోట్లు, స్విగ్గీ రూ.350 కోట్ల విలువైన జిఎస్‌టి ఎగవేశాయని రిపోర్టులు వస్తున్నాయి. ఫుడ్ డెలివరీ అనేది ఒక సర్వీస్ కాబట్టి దాని పన్ను శ్లాబుకు తగినట్లు జిఎస్‌టి చెల్లించాలని డిజిజిఐ తెలిపింది. ఈ సేవలపై 5 శాతం పన్ను రేటు అమల్లో ఉంది.

రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోరుతూ బీహార్ క్యాబినెట్ తీర్మానం



పాట్నా : బీహార్‌కు ప్రత్యేక హోదా కోరుతూ ఆ రాష్ట్ర క్యాబినెట్ సమావేశం తీర్మానం చేసింది. బుధవారం ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ తీర్మానం చేశారు. ఈ విషయాన్ని నితీశ్ కుమార్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ' ఈ రోజు జరిగిన క్యాబినెట్ సమావేశంలో బీహార్‌కు ప్రత్యేక కేటగిరి హోదా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ ఒక తీర్మానం ఆమోదించాం. బీహార్ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తక్షణమే బీహార్‌కు ప్రత్యేక రాష్ట్ర హోదా కల్పించాలని నేను కోరుతున్నాను' అని నితీష్‌కుమార్ ట్వీట్ చేశారు. ప్రజల ప్రయోజనాల కోసం బీహార్ ప్రభుత్వం రూపొందించిన పథకాలను అమలు చేయడానికి సుమారు రూ. 2.50 లక్షల కోట్లు అవసరమవుతాయి, కాబట్టి కేంద్రం బీహార్‌కు ప్రత్యేక రాష్ట్ర హోదాను కల్పిస్తే.. ఈ పథకాలను వేగంగా అమలు చేస్తామని తెలిపారు. 2010 నుంచి కూడా బీహార్‌కు ప్రత్యేక హోదా కోసం డిమాండ్ చేస్తున్నామని నితీష్ కుమార్ ఈ సందర్భంగా గుర్తు చేశారు.

ఎట్టకేలకు గాజాలో కాల్పుల విరమణకు ఓకే

నాలుగు రోజుల పాటు దాడులకు విరామం

- బందీల విడుదలకు మార్గం సుగమం
- గత రాత్రి దాడుల్లో వందమందికి పైగా మృతి
- ఒప్పందాన్ని స్వాగతించిన అంతర్జాతీయ సమాజం
- మళ్ళీ యుద్ధాన్ని కొనసాగిస్తామన్న నెతన్యాహు



గాజా, జెరూసలేం : గత ఆరు వారాలకు పైగా గాజాలో వరుస దాడులతో బీభత్సం సృష్టించిన ఇజ్రాయిల్ ఎట్టకేలకు కాల్పుల విరమణకు అంగీకరించింది. నాలుగు రోజుల పాటు కాల్పులను విరమించేందుకు ఇరు పక్షాల మధ్య అంగీకారం కుదిరింది. దీంతో హమస్ చెరలో వున్న బందీల విడుదలకు అవకాశం కలుగుతుంది. అలాగే ఇజ్రాయిల్ అదుపులో వున్న పాలస్తీనియన్లను కూడా విడిపించేందుకు వెసులుబాటు వుంటుందని అధికారులు బుధవారం తెలిపారు.

హమస్‌తో మధ్యవర్తిత్వం వహించడంలో కీలక పాత్ర పోషించిన కతార్ ఒప్పందం వివరాలను ప్రకటించింది. బుధవారం అర్ధరాత్రి లేదా గురువారం తెల్లవారు జాము నుండి కాల్పుల విరమణ అమల్లోకి వస్తుందని తెలిపింది. హమస్ వద్ద గల 50మంది బందీలు దశలవారీగా విడుదలవుతారని, అందుకు ప్రతిగా ఇజ్రాయిల్ జైళ్లలో మగ్గుతున్న 150మంది ఖైదీలను విడుదల చేయాల్సి వుంటుందని తెలిపింది. బందీల్లో 33మంది మహిళలు, 123మంది మైనర్లు వున్నారు. వీరందరూ 2021 నుండి నిర్బంధంలో వున్నారు. రాళ్ళు విసరడం నుండి హత్యా ప్రయత్నాల వరకు వీరిపై అభియోగాలు మోపారు. కాగా ప్రస్తుతం కుదిరిన ఒప్పందం దీర్ఘకాల కాల్పుల విరమణ దిశగా తొలి చర్య అని కతార్ భావిస్తోంది.

నెతన్యాహు మొండిపట్టు

ఒప్పందం కుదిరిందంటే యుద్ధం ఆగిపోతుందని అర్థం కాదని, కాల్పుల విరమణ పూర్తి కాగానే మళ్ళీ కాల్పులు ప్రారంభిస్తామని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు ప్రకటించారు. "మేం యుద్ధం జరుపుతున్నాం, అది కొనసాగుతుంది." అని ఆయన వ్యాఖ్యానించారు. "మేము అనుకున్న లక్ష్యాలన్నింటినీ సాధించేవరకు ఈ యుద్ధం కొనసాగుతుంది." అని ప్రకటించారు.

కాగా నాలుగు రోజులే కాదని ఒప్పంద గడువును ఇంకా పెంచాలని సౌదీ అరేబియా, ఈజిప్ట్, జోర్డాన్‌ల విదేశాంగ మంత్రులు కోరారు. లండన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ వీరు, ఈ కాల్పుల విరమణ ఒప్పందం అంతిమంగా రెండు దేశాల ఏర్పాటు దిశగా చర్చల పునరుద్ధరణకు దారి తీయాలని పేర్కొన్నారు. ఇజ్రాయిల్ మానవ హక్కుల పర్యవేక్షణా విభాగం కూడా ఒప్పందాన్ని స్వాగతించింది.



ఆస్పత్రులు, శరణార్థ శిబిరాలపై కొనసాగుతున్న దాడుల్లో 100మంది మృతి

గాజాలో ఆస్పత్రులు, శరణార్థ శిబిరాలపై గత రాత్రంతా, బుధవారం ఉదయం జరిగిన దాడుల్లో దాదాపు వందమందికి పైగా పాలస్తీనియన్లు మరణించారు. వీరందరినీ సామూహిక ఖననం చేశారు. ఆస్పత్రుల్లో, చుట్టుపక్కలా పరిస్థితులు భయంకరంగా వున్నాయని కమల్ అద్వాన్ ఆస్పత్రి డైరెక్టర్ తెలిపారు. తమ ఆస్పత్రికి గత రాత్రి నుండి 60వరకు మృత దేహాలు, వెయ్యి మందికి పైగా గాయపడిన వారు వచ్చారని చెప్పారు. వైద్య బృందాలు చాలా అలిసిపోతున్నాయని, ఒక్క చుక్క కూడా ఇంధనం లేదని, చేతుల్లో టార్చిలైట్లు పట్టుకుని చీకట్లోనే పనిచేస్తున్నామని చెప్పారు. ఆస్పత్రికి చుట్టుపక్కలా కూడా బాంబు దాడులు పెరిగాయని అన్నారు. అనేక భవనాలు కుప్పకూలుతున్నాయని, వడీ గాజా నుండి ఉత్తర గాజా వరకు పనిచేస్తున్న ఆస్పత్రుల్లో ఇదొక్కటే వుందని చెప్పారు. విచక్షణారహితంగా బాంబు దాడులు జరుగుతున్నాయని అన్నారు.

సరైన దిశగా కీలక చర్య

కాల్పుల విరమణ ఒప్పందాన్ని సరైన దిశలో తీసుకున్న కీలకమైన చర్యగా పేర్కొంటూ ఐక్యరాజ్య సమితి స్వాగతించింది. అయితే ఇంకా చేయాల్సింది చాలా వుందని పేర్కొంది. కాల్పులు విరమించిన ఈ సమయాన్ని బందీల విడుదలకు, గాజాలోని పాలస్తీనియన్ల దుస్థితిని తప్పించేలా వారి అవసరాలు తీర్చేందుకు ఉపయోగించాలని మధ్య ప్రాచ్య శాంతి ప్రక్రియకు ఐక్యరాజ్య సమితి ప్రత్యేక కోఆర్డినేటర్ టార్ వెనెస్‌లాండ్ సూచించారు. అల్‌షిఫా రోగులందరినీ తక్షణమే తరలించేందుకు తాము సిద్ధంగా వున్నామని పాలస్తీనా రెడ్ క్రీసెంట్ చెప్పింది.

రెండు పక్షాల మధ్య జరుగుతున్న ఘర్షణ యుద్ధం పరిధిని దాటి తీవ్రవాదంగా రూపాంతరం చెందిందని పోప్ ఫ్రాన్సిస్ వ్యాఖ్యానించారు. ఇరుపక్షాలకు చెందిన బంధువులు, కుటుంబ సభ్యులతో విడివిడిగా ఆయన మాట్లాడారు. వారి బాధలను ప్రత్యక్షంగా విన్నానని చెప్పారు.

అంతర్జాతీయ సమాజం స్పందన

మానవతా సంక్షోభాన్ని తగ్గించేందుకు ఈ కాల్పుల విరమణ ఒప్పందం సాయపడుతుందని ఆశిస్తున్నట్లు చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ వ్యాఖ్యానించారు. ఉద్రిక్తతలను, ఘర్షణలను తగ్గించడానికి వెసులుబాటు కలుగుతుందన్నారు.

కీలకమైన చర్యగా బ్రిటన్ వ్యాఖ్యానించింది. బందీల కుటుంబాలకు ఉపశమనం కలుగుతుందని, మానవతా సంక్షోభాన్ని పరిష్కరించడానికి అవకాశం వుంటుందని పేర్కొంది.


చాలా కాలం తర్వాత విన్న మొదటి మంచి వార్తగా రష్యా ప్రశంసించింది. సుస్థిర పరిష్కారం దిశగా ఇదొక్కటే మార్గమని వ్యాఖ్యానించింది.

గాజాలో మానవతా సాయం పెంచడానికి ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చని యురోపియన్ కమిషన్ అధ్యక్షుడు ఉర్సులా వాన్ డెర్ లేయన్ వ్యాఖ్యానించారు.

బీజేపీ ఎమ్మెల్యే ఆస్తులు 100 కోట్లకుపైనే

రెండో స్థానంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజస్థాన్ ఎన్నికల బరిలో సంపన్నులు . ఏడీఆర్

రాజకీయాల్లో ప్రజాసేవ చేసే రోజులు గతించాయి. కరెన్సీ ఇచ్చి ఓటు తీసుకున్నాక..ఎంత పోగేసుకున్నామన్న యావ తప్ప గెలిచిన అభ్యర్థులకు ఇంకేం ఉండటంలేదు. అందువల్లే అధికారంలో ఉండగానే.. కోట్లకుకోట్లు కుమ్మేస్తున్నారు. భారీ సంపదను జమ చేసుకుంటున్నారు. తాజాగా రాజస్థాన్ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల వద్ద కోట్ల సంపద ఉన్నట్టు...వారు దాఖలు చేసిన అఫిడవిట్ లో ప్రస్తావించిన వివరాలను ఏడీఆర్ వెల్లడించింది.



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

గత ఐదేండ్లలో రాజస్థాన్‌లో "గౌరవనీయ" ఎమ్మెల్యేల సంపద భారీగా పెరిగింది. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ ఇటీవలి నివేదికలో దావా చేసింది. ఇందులో కాంగ్రెస్ నుంచి అత్యధికంగా 99 మంది, బీజేపీ నుంచి 60 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఏడీఆర్ నివేదికలో ఏమి క్లెయిమ్ చేసిదంటే....

161 మంది ఎమ్మెల్యేల సంపద 1శాతం-1999 శాతం పెరిగింది. వాస్త వానికి, 2023 రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ పోటీ చేస్తున్న 173 మంది ఎమ్మెల్యేల అఫిడవిట్‌లను అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్, రాజస్థాన్ ఎలక్షన్ వాచ్ విశ్లేషించాయి. ఇందులో 173 మంది ఎమ్మెల్యేలలో 161 మంది ఎమ్మెల్యేల ఆస్తులు అంటే 93 శాతం ఎమ్మెల్యేల ఆస్తులు 1శాతం నుంచి 1999 శాతానికి పెరిగాయని, 13 మంది ఎమ్మెల్యేలు అంటే 7 శాతం మంది ఎమ్మెల్యేల ఆస్తులు 1 శాతం నుంచి తగ్గాయని తేలింది.

భారతీయ ఆదివాసీ పార్టీ

ఐదేండ్లలో బీఏపీ ఎమ్మెల్యే సగటు సంపద రూ.1.16 కోట్లు పెరిగింది. 2018లో ఎమ్మెల్యే ఆస్తుల విలువ రూ.1.22 లక్షలు కాగా, అది 2023లో రూ.1.17 కోట్లకు పెరిగింది. మొత్తంమీద, మళ్లీ పోటీ చేస్తున్న 173 మంది ఎమ్మెల్యేల సగటు ఆస్తులు ఐదేండ్లలో రూ.2.86 కోట్లు లేదా 40 శాతం పెరిగాయి. 2018లో ఎమ్మెల్యేల ఆస్తులు రూ.7.10 కోట్లు కాగా, 2023 నాటికి రూ.9.97 కోట్లకు పెరిగాయి.

ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న టాప్ 5 ఎమ్మెల్యేల ఆస్తుల్లో అత్యధిక పెరుగుదల (రూపాయిల్లో)


బీజేపీ ఎమ్మెల్యే, బికనీర్ ఈస్ట్ నియోజకవర్గం అభ్యర్థి సిద్ధి కుమారి తన సంపద రూ.97.61 కోట్లు పెరిగిందని, అంటే 2018లో రూ.4.66 కోట్లుగా ఉన్న తన సంపద ఇప్పుడు 2023లో రూ.102.27 కోట్లకు పెరిగిందని ప్రకటించారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యే, అంటా సీటు అభ్యర్థి ప్రమోద్ జైన్ ఆస్తులు ఐదేండ్లలో రూ.29.17 కోట్లు, 2018లో రూ.27.31 కోట్ల నుంచి 2023లో రూ.56.49 కోట్లకు పెరిగాయి.

కాంగ్రెస్ ఎమ్మెల్యే, గంగాపూర్ సీటు అభ్యర్థి రాంకేష్ ఆస్తులు రూ.23.68 కోట్లు, 2018లో రూ.39.96 కోట్ల నుంచి 2023లో రూ.63.64 కోట్లకు పెరిగాయి.

కాంగ్రెస్ ఎమ్మెల్యే, నవాల్‌ఘర్ సీటు అభ్యర్థి డాక్టర్ రాజ్‌కుమార్ శర్మ ఆస్తులు రూ.18.62 కోట్లు, 2018లో రూ.9.31 కోట్ల నుంచి 2023లో రూ.18.71 కోట్లకు పెరిగాయి.

చిత్తోర్‌గఢ్ స్థానం నుంచి బీజేపీ ఎమ్మెల్యే, ప్రస్తుతం స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న చంద్రభాన్ సింగ్ చౌహాన్ సంపద ఐదేండ్లలో రూ.17.94 కోట్లు పెరిగింది. 2018లో ఆయన సంపద రూ.9.51 కోట్లు కాగా, 2023లో రూ.27.46 కోట్లకు పెరిగింది.



పోటీ చేసే ఎమ్మెల్యేల సగటు ఆస్తులు పెంపు

కాంగ్రెస్: ఐదేండ్లలో 99 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఆస్తులు కోట్లాది రూపాయలు పెరిగాయి. ఏడీఆర్ నివేదిక ప్రకారం కాంగ్రెస్ ఎమ్మెల్యేల సగటు ఆస్తులు 33.41శాతం పెరిగాయి. 2018లో వారి సగటు సంపద రూ.8.41 కోట్లు కాగా, 2023లో రూ.11.22 కోట్లకు పెరిగింది.

బీజేపీ: ఐదేండ్లలో 60 మంది బీజేపీ ఎమ్మెల్యేల సగటు ఆస్తులు 50.63 శాతం పెరిగాయి. 2018లో రూ.5.70 కోట్లుగా ఉన్న ఎమ్మెల్యేల సగటు సంపద ఇప్పుడు రూ.8.58 కోట్లకు పెరిగింది.

ఇండిపెండెంట్ అభ్యర్థులు కూడా..

స్వతంత్రులు: ఆస్తుల పెంపు విషయంలో స్వతంత్రులు కూడా వెనుకంజ వేయలేదు. ఆరుగురు స్వతంత్ర ఎమ్మెల్యేల ఆస్తులు 86.89 శాతం పెరిగాయి. అంటే 2018లో ఎమ్మెల్యేల ఆస్తులు రూ.5.63 కోట్లు కాగా, 2023 నాటికి రూ.10.53 కోట్లకు పెరిగాయి.

రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ

ముగ్గురు ఎమ్మెల్యేల ఆస్తులు రూ. 1.79 కోట్లు అంటే 184.12 పెరిగాయి. 2018లో వారి సగటు సంపద రూ.97.50 లక్షలు కాగా, 2023లో రూ.2.77శాతం కోట్లకు పెరిగింది.

శివసేన: శివసేన ఎమ్మెల్యే సగటు సంపద 346% పెరిగింది అంటే రూ.3.3 కోట్లు. 2018లో ఎమ్మెల్యేల సగటు సంపద రూ.95 లక్షలు కాగా, అది 2023లో రూ.4.26 కోట్లకు పెరిగింది.

ఐదేండ్లలో ఆర్ఎల్పీ ఎమ్మెల్యే సగటు సంపద రూ. 1.34 కోట్లు లేదా 52.7 శాతం పెరిగింది. ఎమ్మెల్యే ఆస్తులు 2018లో రూ.2.55 కోట్లు కాగా, 2023లో రూ.3.89 కోట్లకు పెరిగాయి. రాష్ట్రీయ జనతా సేన: ఆర్జేఎస్‌కు చెందిన ఓ ఎమ్మెల్యే కూడా ఐదేళ్లలో తన సంపదను అనేక కోట్లు పెంచుకున్నాడు. 2018లో ఎమ్మెల్యే సగటు ఆస్తి రూ.13.08 కోట్లు కాగా, 2023లో రూ.17.04 కోట్లకు పెరిగింది. మొత్తంమీద ఐదేండ్లలో ఎమ్మెల్యేల సగటు సంపద రూ.3.95 కోట్లు అంటే 30.22% పెరిగింది.

▸▸ **2018 ఎన్నికల్లో సగటు ఆస్తులు:** 2018లో స్వతంత్రులతో సహా వివిధ పార్టీల ద్వారా మళ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఈ 173 మంది ఎమ్మెల్యేల సగటు

▸▸ **2023 ఎన్నికల్లో సగటు ఆస్తులు:** 2023లో మళ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఈ 173 మంది ఎమ్మెల్యేల సగటు ఆస్తులు రూ.9.97 కోట్లు.

▸▸ **5 సంవత్సరాలలో (2018-2023):** 2018 మరియు 2023 రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల మధ్య తిరిగి ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఈ 173 మంది ఎమ్మెల్యేల సగటు ఆస్తి వృద్ధి రూ.2.86 కోట్లు.

▸▸ **ఐదేండ్లలో పెరిగిన శాతం (2018-2023):** ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఈ 173 మంది ఎమ్మెల్యేల ఆస్తుల సగటు పెరుగుదల 40శాతం.

కేవలం 12 మీటర్ల దూరంలో ..

- తుది దశకు 'ఉత్తరకాశీ' టన్నెల్ ఘటన సహాయక కార్యక్రమాలు



డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లో టన్నెల్ కూలిపోయిన ప్రమాదం నుంచి కార్మికులను వెలికితీతకు జరుగుతున్న సహాయక కార్యక్రమాలు తది దశకు చేరుకున్నాయి. కేవలం మరోక 12 మీటర్లు డ్రిల్లింగ్ చేస్తే కార్మికులను సురక్షితంగా బయటకు తీసుకుని రావచ్చునని బుధవారం సాయంత్రం అధికారులు వెల్లడించారు. అన్ని అనుకూలిస్తే బుధవారం రాత్రికే కార్మికులు బయటకు వచ్చే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. 'కార్మికులు 57 మీటర్ల దూరంలో భూగర్భంలో చికుకున్నారని భావిస్తున్నాం. ఇందులో ఇందులో ఇప్పటి వరకూ 45 మీటర్లు డ్రిల్లింగ్ పూర్తి చేశాం. కాబట్టి మరో 12 మీటర్ల దూరం మాత్రమే మిగిలిఉంది' అని ఉత్తరాఖండ్ రోడ్డు రవాణ శాఖకు చెందిన సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. రాష్ట్రంలో ఉత్తరకాశీ జిల్లాలో ఈ నెల 12న నిర్మాణంలో ఉన్న సొరంగం కూలిపోయిన సంగతి తెలిసిందే. ఈ సొరంగంలో 41 మంది కార్మికులు వరసగా 11 రోజుల పాటు చికుకుని ఉన్నారు. వీరికి ఆహారం, నీరు, ఆక్సిజన్, ఔషధాలను పైప్ ద్వారా పంపిస్తున్నారు.

ఇండియన్ కాన్సులేట్ దాడి కేసు

- 14 ప్రాంతాల్లో ఎన్ఐఎ సోదాలు



న్యూఢిల్లీ : పంజాబ్, హర్యానాలోని 14 ప్రాంతాల్లో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) బుధవారం ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. శాన్‌ఫ్రాన్సిస్కోలోని కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియాపై దాడులకు సంబంధించిన కేసు విచారణలో భాగంగా ఎన్ఐఎ ఈ సోదాలు నిర్వహించినట్లు సమాచారం. ఈ ఏడాది మార్చి 19, జులై 2న శాన్‌ఫ్రాన్సిస్కోలోని ఇండియన్ కాన్సులేట్‌పై దాడులు జరిగిన సంగతి తెలిసిందే. కార్యాలయంలోకి చొరబడిన దుండగులు కార్యాలయాన్ని ధ్వంసం చేయడంతో పాటు, భవనానికి నిప్పు పెట్టారు. కాన్సులేట్ అధికారులపై దాడికి కూడా యత్నించారు. ఈ దాడుల్లో భాగమైన కొంతమంది వ్యక్తులను ఎన్ఐఎ ఇప్పటికే గుర్తించింది. ఈ దాడుల వెనుక ఉన్న పూర్తి కుట్రను ఛేదించే ప్రయత్నంలోనే బుధవారం ఉదయం రెండు రాష్ట్రాల్లో 14 ప్రాంతాల్లో సోదాలు చేసింది. పంజాబ్‌లోని మోగా, జలంధర్, లూథియానా, గురుదాస్‌పూర్, మొహాలి, పాటియాలా జిల్లాలోనూ, హర్యానాలోని కురుక్షేత్ర, యమునానగర్‌ల్లోనూ ఎన్ఐఎ దాడులు జరిపింది.

దేశం పేరును మాత్రమే మార్చారు

- బీజేపీపై ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలు



ఈరోడ్ : గత తొమ్మిదేళ్లలో పేరు మార్చడం తప్ప బీజేపీ దేశానికి చేసిందేమీ లేదని తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యానించారు. ఈరోడ్‌లో పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "2014లో ఎన్నికల ప్రచారం సందర్భంగా నరేంద్ర మోడీ మాట్లాడుతూ, నల్ల ధనాన్ని పూర్తిగా నిర్మూలన చేస్తానని చెప్పారు. కానీ చేయలేదు. 2020కల్లా భారత్‌ను అగ్రరాజ్యంగా చేస్తానని ప్రకటించారు. కానీ ఇప్పుడు 2047కల్లా అగ్రరాజ్యంగా మారుతుందని చెబుతున్నారు. భారత్‌ను మారుస్తానంటూ చెప్పారు. కానీ ఆయన కేవలం పేరు మాత్రమే మార్చారు. 2024 ఎన్నికల్లో వీటన్నింటికీ మేం సమాధానం ఇవ్వాల్సి వుంది." అని స్టాలిన్ పేర్కొన్నారు. బానిస పార్టీలన్నింటికీ బీజేపీ మాస్టర్ అని వ్యాఖ్యానించారు. 2021లో తమిళనాడులో మేం బానిస పార్టీని ఓడించామని, అలాగే బీజేపీని కూడా పార్లమెంటరీ ఎన్నికల్లో ఓడిస్తామన్నారు. అన్నాడిఎంకెను ప్రస్తావిస్తూ, తమిళనాడు హక్కులన్నింటినీ అన్నాడిఎంకె ప్రభుత్వం త్యాగం చేసిందన్నారు. నీట్‌ను ఒకప్పుడు అనుమతించారు. కానీ జయలలిత హయాంలో నీట్ రాష్ట్రంలో అమలు కాలేదు. ఆమె చనిపోయిన తర్వాత అన్నాడిఎంకె అనుమతించిందన్నారు.